www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 10-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 164 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 11.12 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ రా. 8.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా.1.58-3.39; దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, రా.10.09-10.55; అమృతఘడియలు: ఉ.8.48-10.32; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.17

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సైబర్ దందాకు బ్యాంకర్ల అండ!

సైబర్ కేటుగాళ్లు 2

అడ్డగోలుగా ఖాతాలు తెరిచేలా కొందరి సహకారం

ఆ ఖాతాలతో రూ.వందల కోట్ల అక్రమ లావాదేవీలు

వాటిపై పోలీసు నోటీసులకూ స్పందించని వైనం

రాజస్థాన్ ముఠా.. యూపీఐ దోపిడీ

14

'చార్జ్ బ్యాక్' ఆప్షన్‌తో 4 కోట్ల మోసం

బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూములే టార్గెట్

హైదరాబాద్‌లో 13 మంది అరెస్ట్

4 వారాల్లో విచారణకు

షెడ్యూల్ ఇవ్వండి

అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ఎదుట ఉంచండి

వాదనలు, ఆధారాలు, విచారణ వంటివి షెడ్యూల్లో ఉండాలి

దానిని ఖరారు చేసిన తర్వాత హైకోర్టు రిజిస్ట్రార్‌కు పంపండి

లేకపోతే, సుమోటోగా మళ్లీ కేసుల విచారణ మొదలుపెడతాం

ఐదేళ్లూ కోర్టులు చేతులు కట్టేసుకుని ఉండాలనడం సరికాదు

స్పీకర్ సాచివేత రాజ్యాంగ, నైతిక సూత్రాలకు విరుద్ధం


న్యాయ సమీక్ష చేయడానికి వీల్లేదంటే ఎంత కాలం ఆగాలి!?

ఒక పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడాన్ని ఏమంటారు!?

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కేసులో హైకోర్టు కీలక తీర్పు

అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు

రాజ్యాంగబద్ధ స్పీకర్ గౌరవం తగ్గించకుండానేనని వ్యాఖ్య



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణకు సంబంధించి నాలుగు వారాల్లో షెడ్యూలు జారీ చేయాలని అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇరు వర్గాల వాదనలు, ఆధారాల సమర్పణ, వ్యక్తిగత విచారణ తదితరాలకు సంబంధించిన వివరాలు సదరు షెడ్యూల్లో ఉండాలని నిర్దేశించింది. ఇందుకు అనుగుణంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ఎదుట ఉంచాలని అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. షెడ్యూలును ఖరారు చేసి సదరు వివరాలను హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు తెలియజేయాలని, వీటికి సంబంధించి నాలుగు వారాల్లో ఎటువంటి చర్యలూ తీసుకోకపోతే సుమోటోగా ఈ కేసుల విచారణ

మిగతా 13వ పేజీలో...

పీఏసీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీ

అంచనాల కమిటీకి పద్మావతిరెడ్డి

ప్రభుత్వ రంగ సంస్థలకు శంకరయ్య

ఒక్కో కమిటీలో 13 మంది సభ్యులు

శాసనసభ నుంచి 9 మంది సభ్యులు

మండలి నుంచి నలుగురు చొప్పున..

అసెంబ్లీ కార్యాలయం బులెటిన్

13

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేలా తీర్పు

కాంగ్రెస్ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత ఖాయం

ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం..

బీఆర్ఎస్ గెలుపు తథ్యం: కేటీఆర్, హరీశ్‌రావు

13

వాళ్లు బీఆర్ఎస్ సభ్యులుగానే!

పీఏసీ చైర్మన్‌గా గాంధీ నియామకమే సంకేతం

వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం

స్పీకర్ నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

కాలుష్య రహితంగా గ్రీన్ ఫార్మా సిటీ

దాని అభివృద్ధిని వేగవంతం చేయండి

భారీ పెట్టుబడులకు ప్రముఖ కంపెనీలు సిద్ధం

అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నేతన్నకు చేయూత కింద రూ.290 కోట్ల చెక్కును విడుదల చేస్తున్న సీఎం రేవంత్, మంత్రి తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ శివార్లలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పర్యావరణ హితంగా, కాలుష్యరహితంగా పరిశ్రమల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ, తదితర మౌలిక సదుపాయాలను వీలైనంత త్వరగా కల్పించాలన్నారు. ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపికచేసిన పరిసరాల్లో గ్రీన్‌ఫార్మా సిటీ ఏర్పాటు ప్రణాళికలపై సోమవారం సాయంత్రం సచివాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన ఉన్నతస్థాయి

మిగతా 12వ పేజీలో...

నేతన్నలకు బీఆర్ఎస్ చేసిందేం లేదు

12

ఎలక్షన్లు, కలెక్షన్లు చేసి తమదే త్యాగమంటున్నారు

త్యాగమంటే కొండా లక్ష్మణ్‌దే.. ఐఐహెచ్‌టీకి ఆయన పేరు

నేతన్నలకూ రుణ మాఫీ.. థ్రిఫ్ట్‌కు రూ.290 కోట్ల చెక్కు

ఐఐహెచ్‌టీ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



మిజోరాం గవర్నర్ కంభంపాటికి తీవ్ర అస్వస్థత

ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు

గ్రీన్ చానల్ ద్వారా స్టార్ ఆస్పత్రికి తరలింపు

14

రాష్ట్రాల పన్ను వాటాను 50 శాతానికి పెంచండి

16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ఆర్థిక సంఘం, పలు రాజకీయ పార్టీల విజ్ఞప్తి

ప్రగతిశీల దక్షిణాది రాష్ట్రాల్ని ప్రోత్సహించాలి

నిధులిచ్చే ముందు మాకు సమాచారమివ్వండి

విపత్తుల నిర్వహణకు ప్రత్యేక నిధులు ఇవ్వండి

చిన్న పంచాయతీలకు గ్రాంట్లివ్వండి: కాంగ్రెస్

భగీరథకు 20 వేల కోట్లు ఇవ్వండి: హరీశ్‌రావు

ఓబీసీలకు గ్రాంటు సిఫారసు చేయాలి: బీజేపీ

రాష్ట్రాలకు వాటా పెంపుపై ఆలోచిస్తాం..

కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా

నేడు భేటీ కానున్న సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పన్ను వాటాను 50శాతానికి పెంచాలని 16వ ఆర్థిక సంఘాన్ని రాష్ట్ర ఆర్థిక సంఘం, వివిధ రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో కోరాయి. 14వ ఆర్థిక సంఘంలో 42శాతంగా ఉన్న వాటాను 15వ ఆర్థిక సంఘం 41శాతానికి కుదించిందని, దీనివల్ల

మిగతా 12వ పేజీలో...

భద్రాద్రి జిల్లాలో కుండపోత

1 పెరిగిన గోదావరి.. రాష్ట్రంలో నేడు, రేపు మోస్తరు వానలు

1 వరద బాధిత కుటుంబాలకు 16,500: పొంగులేటి

1 రేపు తెలంగాణకు కేంద్ర బృందం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

3

భారత్‌లో కొత్త మంకీపాక్స్ కేసు నిర్ధారణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: భారత్‌లో కొత్త మంకీపాక్స్ కేసు నిర్ధారణ అయింది. అయితే అది క్లేడ్-2 రకానికి చెందిందని, కంగారుపడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. విదేశాలనుంచి ఇటీవల భారత్‌కు వచ్చిన యువకుడిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించడంతో ఐసోలేషన్‌లో ఉంచి నమూనాలను పరీక్షించారు. మంకీపాక్స్ సోకిందని నిర్ధారణ అయింది. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగా ఉందని కేంద్రం తెలిపింది. 2022 జులై నుంచి భారత్‌లో నిర్ధారణ అయిన 30 కేసుల మాదిరిగానే ఇది కూడా ఉందని వెల్లడించింది. వాస్తవానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ క్లేడ్-1 రకాన్ని ప్రపంచ ప్రజారోగ్య అత్యయిక స్థితికి కారణంగా ప్రకటించింది.

మొబైల్‌లో విద్యార్థినుల 5 వేల నగ్న వీడియోలు

- కర్ణాటకలో ఆర్ట్ టీచర్ నీచకృత్యం..ఫోరెన్సిక్‌లో వెలుగులోకి

బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని కోలారు జిల్లా మాలూరు తాలూకా మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్ మొబైల్‌లో 5 వేలకుపైగా నగ్న వీడియోలు ఉన్న విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాలలో గత ఏడాది విద్యార్థులచేత మ్యాన్‌హోల్ శుభ్రం చేయించిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. అప్పట్లో తల్లిదండ్రులు ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల అశ్లీల ఫొటోలు, వీడియోలు తీశాడని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ట్ (డ్రాయింగ్) టీచర్ మునియప్ప మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. మాస్తి పోలీసులు ఫోన్లలోని డేటాను పరిశీలించి, నగ్న వీడియోలను గుర్తించారు. సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మునియప్పపై పోక్సో కేసు నమోదు చేశారు. మునియప్ప తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు, ఉపాధ్యాయుడి చర్య నీచమని, భయంకరమని వ్యాఖ్యానించింది. కేసు రద్దుకు నిరాకరించింది. ఉపాధ్యాయుడి నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా, ఐదు వేలకు పైగా నగ్నవీడియోలు ఉన్న విషయం బహిర్గతమైంది. అందులో విద్యార్థినులు బట్టలు మార్చుకునేవి, బాత్రూంలో ఉన్న సమయంలో చిత్రీకరించినవి ఉన్నట్టు సమాచారం.

హరియాణాలో ఒంటరిగా బరిలోకి ఆప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు చర్చలు విఫలం కావడంతో ఒంటరిగా బరిలోకి దిగాలని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్ణయించింది. 20 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. 90 నియోజకవర్గాలున్న హరియాణా అసెంబ్లీకి అక్టోబరు 5న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి తోడు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు సెప్టెంబరు 12 ఆఖరు కావడంతో ఆప్ నిర్ణయం కీలకంగా మారింది. వాస్తవానికి పొత్తులో భాగంగా ఆప్ 10 సీట్లు అడగ్గా కాంగ్రెస్ కేవలం 5 మాత్రమే ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. దీంతో సొంతంగా బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే 20 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆప్ రాష్ట్ర నాయకత్వం త్వరలో మిగతా అన్ని చోట్లా అభ్యర్థులను ప్రకటించనుంది. ఆప్-కాంగ్రెస్ మధ్య పొత్తు కుదరకపోవడంతో ఓట్లు చీలి అధికార బీజేపీకి కలిసొచ్చే అవకాశం ఉంది.

శ్రీరామ జన్మభూమి ట్రస్టు చీఫ్ నృత్యగోపాల్‌దాస్ ఆరోగ్యం విషమం



లఖ్‌నవూ, సెప్టెంబరు 9: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మూత్రాశయ సమస్యతో బాధపడుతున్న 86 ఏళ్ల గోపాల్ దాస్ యూపీలోని గ్వాలియర్‌లో కొంతకాలంగా చికిత్స తీసుకుంటున్నారు. కోలుకోకపోవడంతో ఆదివారం లఖ్‌నవూలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

రైలును పట్టాలు తప్పించేందుకు ట్రాక్‌పై సిలిండర్

కాన్పూర్, సెప్టెంబరు 9: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో కాళింది ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ప్రయాగ్‌రాజ్ నుంచి హరియాణాలోని భివాని వెళ్తున్న ఈ రైలు ఆదివారం రాత్రి శివరాజ్‌పూర్ సమీపంలో పట్టాలపై గ్యాస్ సిలిండర్‌ను అతి వేగంగా ఢీ కొట్టింది. సిలిండర్ పేలక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. లోకోపైలెట్ విషయాన్ని గార్డుకు తెలపగా అతడు రైల్వే పోలీసులకు సమాచారాన్ని అందించాడు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పట్టాల సమీపంలో గ్యాస్ సిలిండర్‌తో పాటు పెట్రోల్ బాటిల్‌ను, అగ్గిపెట్టను స్వాధీనం చేసుకున్నారు. రైలును పట్టాలు తప్పించే కుట్రతోనే గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే ట్రాక్‌పై సిలిండర్‌ను పెట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడి.. 18 మృతి

డమాస్కస్, సెప్టెంబరు 9: సిరియాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 18 మంది మృతి చెందగా, 40 మందికి పైగా గాయపడ్డారని సిరియా అధికారిక మీడియా సోమవారం ప్రకటించింది. దాడుల్లో చనిపోయినవారిలో నలుగురు సాధారణ పౌరులని యూకే నుంచి పనిచేసే సిరియా మానవ హక్కుల సంస్థ ఒకటి తెలిపింది. సిరియాలో ఆయుధాల తయారీకి వచ్చిన ఇరాన్ నిపుణులు, మిలీషియా ఉన్న ప్రాంతంపైనా ఇజ్రాయెల్ దాడి చేసిందని ఆ సంస్థ తెలిపింది. తీర ప్రాంతంలోని టార్టస్ నగరంపైనా దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది.

చంద్రబాబు అనుభవంతో విజయవాడ ప్రజలను కాపాడారు

- పార్టీ మారడంపై అవసరం వచ్చినప్పుడు చెబుతా: మల్లారెడ్డి



తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'తుపాన్ ప్రభావంతో విజయవాడ అతలాకుతలమైనప్పటికీ వరదలోనే దాదాపు 30 కిలోమీటర్లు తిరిగి ప్రజలను కాపాడిన ఘనత చంద్రబాబుది. ఆయన అనుభవంతో సహాయ కార్యక్రమాలు భారీగా నిర్వహించి ప్రజలను కాపాడారు. ఆయనకు నా ధన్యవాదాలు' అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏపీ సీఎం చంద్రబాబును ప్రశంసలతో ముంచెత్తారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీవేంకటేశ్వరస్వామి తాను ఏది కోరినా తీర్చే దేవుడన్నారు. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు ఇవ్వడంతో పాటు ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యే వంటి పదవులు స్వామి ఇచ్చిన ప్రసాదమన్నారు. మంచి యూనివర్సిటీ కూడా ఇచ్చిన నేపథ్యంలో మొక్కు చెల్లించుకునేందుకు కాలినడకన తిరుమలకు వచ్చి తలనీలాలు సమర్పించి స్వామిని దర్శించుకున్నట్టు చెప్పారు. పార్టీ మారే అవకాశాలున్నాయా అన్న ప్రశ్నకు పార్టీ మారనంటూనే అవసరమొచ్చినప్పుడు చెబుతానని వెళ్లిపోయారు.

సీట్ల పెంపుపై ఇంజినీరింగ్ కాలేజీలకు ఊరట

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన సీట్లకు మాప్-అప్ కౌన్సెలింగ్ నిర్వహించే విషయమై పలు ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు హైకోర్టు డివిజన్‌లో ఊరట లభించింది. ఏఐసీటీఈ అనుమతిచ్చిన పెంపు మేరకు ఆయా కాలేజీల పూర్తిసామర్థ్యంతో ప్రవేశాలు (ఇంక్రీజ్డ్ ఇంటేక్ కెపాసిటీ) కల్పించేందుకు అవకాశం కల్పించాలని, అందుకు మాప్-అప్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. అయితే ఈ ప్రవేశాలు సింగిల్ జడ్జి ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టంచేసింది.


సిర్పూర్కర్ కమిషన్ నివేదికపై స్టే ఉంది

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయకుండా సింగిల్ జడ్జి స్టే విధించారని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోరాదని పేర్కొంటూ మధ్యంతర ఆదేశాలు జారీచేసిందని పేర్కొంది. ఆ ఉత్తర్వులు ఇప్పటికీ అమల్లో ఉన్నాయని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి డివిజన్ బెంచ్‌కు తెలియజేశారు. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై హత్య కేసు పెట్టాలని ప్రజాసంఘాలు దాఖలు చేసిన పిల్స్‌పై ధర్మాసనం సోమవారం విచారణ జరపగా.. ప్రభుత్వం ఈ మేరకు సమాచారం ఇచ్చింది.

తెలుగు భాష కాదు.. చరిత్ర

తెలుగు ముఖ్యం కాదంటే తెలుగువారిని అవమానించినట్లే

- ఒక రాష్ట్రం గొప్ప.. మరో రాష్ట్రం కాదు అని ఉండదు
- ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోకపోవడం వల్లే పోరాటాలు
- మోదీపై ప్రజలకు భయం పోయింది
- అమెరికాలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): "తెలుగు అంటే ఒక భాష కాదు. ఒక చరిత్ర.. ఒక సంప్రదాయం.. ఒక సంస్కృతి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ ఆదివారం డాలస్‌లో.. టెక్సస్ ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆరెస్సెస్‌పై నిప్పులు కురిపించారు. భారత సమాఖ్య వ్యవస్థ గురించి మాట్లాడుతూ.. తెలుగును ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భారత జాతీయగీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది. అన్ని రాష్ట్రాలను సమానంగా చూపిస్తుంది. ఒక రాష్ట్రం మాత్రమే గొప్ప అని ఎక్కడా చెప్పదు. ఏ రాష్ట్రం ఎక్కువా కాదు. తక్కువా కాదు. భాషలు సంప్రదాయాలు కూడా సమానమే. తెలుగునే తీసుకోండి.. మనం తెలుగు కేవలం భాషగా మాత్రమే కాకుండా.. చరిత్ర, సంప్రదాయం, సంస్కృతిగా చూస్తాం. హిందీతో పోలిస్తే తెలుగు భాష అంత ముఖ్యం కాదని ఒకవేళ ఆ రాష్ట్ర ప్రజలకు చెబితే.. అది వారిని అవమానించినట్లే" అని వ్యాఖ్యానించారు. ఈ చిన్న తేడాను కొందరు అర్థం చేసుకోకపోవడం వల్లే భారత్‌లో పోరాటాలు జరుగుతున్నాయంటూ బీజేపీపై ఫైర్ అయ్యారు. భారత రాజకీయాల్లో ప్రేమ, గౌరవమర్యాదలు, మానవత్వం లోపించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము(కాంగ్రెస్) మాత్రం కుల, మత, సంస్కృతి, చరిత్ర అనే తరతమబేధాల్లేకుండా ప్రతి ఒక్కరికీ సమానావకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామని ఉద్ఘాటించారు. "ఆరెస్సెస్ భారత్‌ను ఒక భావజాలంగా భావిస్తుంది. మహిళలు ఇంటికే పరిమితమవ్వాలనే ధోరణిలో ఉంటుంది. మేము మాత్రం భారత్ అంటే.. బహుళ భావజాలాలు అని విశ్వసిస్తాం. అమెరికా మాదిరిగానే మేము కూడా ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించాలని కోరుకుంటాం. కుల, మత బేధాల్లేకుండా ప్రతి ఒక్కరూ తమ కలలను సాకారం చేసుకునేందుకు సహకరిస్తాం" అని స్పష్టం చేశారు. భారత ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది క్షణాల్లోనే.. ప్రజలు బీజేపీకి, ప్రధాని మోదీకి భయపడడం మానేశారనే విషయాన్ని తాను గుర్తించానన్నారు. ఇది రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు సాధించిన భారీ విజయంగా ఆయన అభివర్ణించారు. "నేను ఏం చెప్పాలనుకుంటున్నానంటే.. భారత్ అంటే.. రాష్ట్రాల సమాఖ్య. అందుకే అన్ని ప్రాంతాలను, భాషలను, సంస్కృతులను గౌరవించాలి. అన్ని కులాలను గౌరవించాలి" అని వ్యాఖ్యానించారు. ఈ తరతమబేధాలతోనే భారత్‌లో నైపుణ్యం ఉన్నవారిని పక్కనపెడుతున్నారని పేర్కొంటూ.. మహాభారతంలో ఏకలవ్యుడి ఉదంతాన్ని ఉటంకించారు. "నైపుణ్యత ఉన్నవారిని పాలకులు గౌరవించడం లేదనేది నా భావన" అని స్పష్టం చేశారు. తాము విపక్షంలో ఉన్నామని.. విపక్షం అంటే ప్రజల గొంతుక అని అన్నారు. భారత్, అమెరికా మధ్య స్వేచ్ఛాయుత రాకపోకలు ఉండాలనేదే తన ఆకాంక్ష అని వివరించారు. చైనాతో పోలిస్తే భారత్‌లో నిరుద్యోగం ఎక్కువ ఉందన్నారు. భారత్ సహా.. పాశ్చాత్య దేశాలు, అమెరికా, ఐరోపా ఉత్పత్తిని మానేసి.. ఆ పనిని చైనాకు అప్పజెప్పాయని, దీని వల్ల ఈ దేశాల్లో నిరుద్యోగం పెరిగిందని పేర్కొన్నారు.

భగ్గుమన్న బీజేపీ

ఆరెస్సెస్, బీజేపీపై రాహుల్‌గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక ద్రోహికి ఆరెస్సెస్ అంటే అర్థం కాదని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆరెస్సెస్‌ను అర్థం చేసుకోవాలంటే రాహుల్ ఎన్నో జన్మలెత్తాలని, దేశాన్ని విమర్శించేందుకు విదేశాలకు వెళ్లేవారికి సంఘ్ మూల సిద్ధాంతాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఆరెస్సెస్ పాత్ర గురించి రాహుల్ ఏదైనా టెక్నాలజీని ఉపయోగించి.. తన నానమ్మ దగ్గర తెలుసుకోవాలన్నారు. భారతదేశ విలువల నుంచి ఆరెస్సెస్ జన్మించిందన్నారు. రాహుల్ చైనాను బలపరిచేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తుంటారని బీజేపీ అధికార ప్రతినిధులు ప్రదీప్ భండారీ, గౌరవ్ భాటియా అన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీతో రాహుల్ ఎంవోయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. రాహుల్ బెయిల్‌పై ఉన్నందుకే భారత న్యాయవ్యవస్థను విమర్శిస్తున్నారన్నారు. దేశాన్ని విభజించి, పాలించాలన్న వ్యూహంతోనే ఆయన సామాజిక ఉద్వేగాలను ఆశిస్తున్నారని దుయ్యబట్టారు. రాహుల్ భారతీయ దేవతలను అవమానిస్తారని విమర్శించారు.



'దుబాయి అమ్నెస్టీ'పై దృష్టి పెట్టాలి

- పథకం సద్వినియోగానికి చొరవ చూపాలి
- ప్రభుత్వాలకు ఐపీఎఫ్ తెలుగు చాప్టర్ సూచన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో చట్ట విరుద్ధంగా ఉంటున్న విదేశీయులు ఎలాంటి జరిమానాలు, జైలు శిక్షలు లేకుండా స్వదేశాలకు తిరిగి వెళ్లిపోయేందుకు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించిన అమ్నెస్టీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తెలుగు ప్రవాసీయులు మాతృభూమికి చేరేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ చూపాలని దుబాయిలోని ప్రవాసీ భారతీయ సంఘం ఐపీఎఫ్ తెలుగు చాప్టర్ సూచించింది. ఈ మేరకు సంఘం ఆదివారం సమావేశమై ఈ పథకం కింద స్వదేశానికి తిరిగి వెళ్లాలనుకుంటున్న తెలుగు ప్రవాసీయుల కష్టసుఖాలను తెలుసుకోవడానికి తెలుగు రాష్ట్రాలు ప్రత్యేక అధికారుల బృందాలను దుబాయికి పంపించాలని కోరింది. భారతీయ దౌత్య కార్యాలయాలు జారీ చేసే ఎమర్జెన్సీ సర్టిఫికెట్లు, గడువు ముగిసిన పాస్‌పోర్టులను పునరుద్ధరించడానికి హైదరాబాద్, విజయవాడల్లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాల ద్వారా విచారణలో జాప్యం జరగకుండా చూడాలని సంఘం అధ్యక్షుడు కుంబాల మహేందర్ రెడ్డి కోరారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పాస్‌పోర్టుల విచారణలో విదేశాల్లోని భారతీయ కార్యాలయాలు, ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాల మధ్య సమన్వయం లేక ఎమర్జెన్సీ సర్టిఫికెట్లు, సాధారణ పాస్‌పోర్టుల జారీలో జాప్యం జరుగుతోందని దీన్ని తగ్గించాలని ఆయన కోరారు. స్వదేశాలకు తిరిగి వెళ్తున్న వారిలో నైపుణ్యం ఆధారంగా అమరావతి, ఫ్యూచర్ సిటీల నిర్మాణంలో వారికి ఉపాధి కల్పించాలని మహేందర్ రెడ్డి కోరారు.

యూఏఈ అణుశక్తికి భారత్ సహకారం

- యువరాజు అల్ నహ్యాన్‌తో మోదీ చర్చలు
- నాలుగు కీలక ఒప్పందాలపై సంతకాలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: అణుశక్తి రంగంలో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్(యూఏఈ)కి భారత్ సహకారం అందించనుంది. యూఏఈతోపాటు.. అరేబియా ద్వీపకల్పంలో మొట్టమొదటి అణుశక్తి కేంద్రం అయిన బరాకా న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్వహణ, ఆపరేషన్స్‌కు.. ఎమిరేట్స్ న్యూక్లియర్ ఎనర్జీ కంపెనీ(ఈఎన్ఈసీ)కి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) సహకరించనుంది. సోమవారం ఢిల్లీలో యూఏఈ యువరాజు షేక్ ఖాలెద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, భారత ప్రధాని మోదీ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా ఈఎన్ఈసీ, ఎన్‌పీసీఐఎల్ ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. అదేవిధంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)కు ఎల్ఎన్‌జీని సరఫరా చేసేందుకు అబుధాబి జాతీయ చమురు కంపెనీ(ఏడీఎన్ఓసీ)తో భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల సంస్థ(ఐఎస్‌పీఆర్ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. అబుధాబి ఆన్‌షోర్ బ్లాక్-1కు సంబంధించి ఉర్జా భారత్-ఏడీఎన్ఓసీ మధ్య.. భారత్‌లో ఫుడ్‌పార్క్‌ల అభివృద్ధికి గుజరాత్ ప్రభుత్వానికి, అబుదాబి డెవలప్‌మెంటల్ హోల్డింగ్ కంపెనీ పీజేఎస్‌జీ(ఏడీక్యూ)తో ఒప్పందాలు జరిగాయి. ఈ సమావేశం అనంతరం ఇరువురు నేతలు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. అక్కడ మహాత్ముడి సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో బస చేసిన యూఏఈ యువరాజు రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయ్యారు. మంగళవారం ఆయన ముంబైలో జరగనున్న బిజినెస్ ఫోరంలో పాల్గొంటారు.

ఈ సమయంలో ప్రధానితో భేటీనా?

- కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకేపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం



బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. 'ముడా' ఇంటి స్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయమై పార్టీ అధిష్ఠానానికి వివరణ ఇచ్చేందుకు సీఎం సిద్దరామయ్య, శివకుమార్ ఆగస్టు మూడోవారంలో ఢిల్లీ వెళ్లారు. అదే సందర్భంలో శివకుమార్ ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ముఖ్యమంత్రిపై వివాదం కొనసాగుతున్న సమయంలో ప్రధానమంత్రిని డీకే కలవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ప్రధానిని కలిసేందుకు సొంత పార్టీ ముఖ్యమంత్రులకే అవకాశం లభించడం కష్టంగా ఉందని, అటువంటిది వైరి పార్టీ నేత అయిన శివకుమార్ ఏ విధంగా అపాయింట్‌మెంట్ పొందారనే విషయంపై అధిష్ఠానం ఆరా తీసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నప్పుడు, సీఎం ఢిల్లీలో ఉన్న సమయంలోనే ఉప ముఖ్యమంత్రి ప్రధానిని కలవడం వెనుక ఉద్దేశమేమిటని ఆరా తీసినట్టు సమాచారం. పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. మంత్రిగా పలు అభివృద్ధి పనులపై ప్రధానిని కలిశానని, రాజకీయ ఉద్దేశం లేదని డీకే వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో ఉన్న నేపథ్యంలో శివకుమార్ కూడా అమెరికా చేరుకున్నారు. వారిద్దరూ అక్కడ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గింపు!

జీఎస్టీ మండలిలో విస్తృత ఏకాభిప్రాయం

- నవంబరు భేటీలో తగ్గింపుపై నిర్ణయం
- క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు
- చిరుతిళ్లపై 18 నుంచి 12 శాతానికి..
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీన్ని తగ్గించే విషయమై జీఎస్టీ మండలి విస్తృత ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సోమవారం ఆమె నేతృత్వంలో జీఎస్టీ మండలి 54వ సమావేశం జరిగింది. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. బీమా ప్రీమియంలపై ఎంత మేరకు పన్ను తగ్గించాలనే అంశంపై నవంబరులో జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీని తగ్గిస్తే కలిగే ప్రభావాలపై కేంద్రం, రాష్ట్రాల పన్నుల అధికారులతో కూడిన ఫిట్‌మెంట్ కమిటీ సమగ్ర నివేదికను జీఎస్టీ మండలికి అందజేసింది. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని రాష్ట్రాలన్నీ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు నిర్మల తెలిపారు. దీనిపై వచ్చే నెలాఖరులోగా నివేదిక సమర్పించాలని బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందాన్ని ఆదేశించినట్లు చెప్పారు. ఆ నివేదికను పరిశీలించిన తర్వాత నవంబరులో జరిగే మండలి భేటీలో బీమా ప్రీమియంపై ఎంత మేరకు జీఎస్టీ తగ్గించాలనేదానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇక తాజా సమావేశంలో క్యాన్సర్ ఔషధాలపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మతపరమైన ప్రయాణాల్లో ఉపయోగించే హెలికాప్టర్ సర్వీసులపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని నిర్ణయించినట్లు నిర్మల వెల్లడించారు. అలాగే చిరుతిళ్ల (స్నాక్స్)పై ఉన్న 18 శాతం జీఎస్టీని 12 శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం జీఎస్టీ వసూలు చేయాలని నిర్ణయించిన తర్వాత (2023, అక్టోబరు 1) నుంచి ఆర్నెల్లలోనే ఈ రంగంలో పన్ను వసూళ్లు 412 శాతం పెరిగి రూ.6909 కోట్లకు చేరాయని నిర్మల వెల్లడించారు. కాగా, బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గిస్తే చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం తగ్గిపోయి.. కోట్లాది మంది పాలసీదారులకు లబ్ధి చేకూరుతుంది. 2023-24లో కేంద్రం, రాష్ట్రాలు ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ కింద రూ.8262.94 కోట్లు వసూలు చేశాయి.

ఆ పత్రం ఎక్కడ?

- మృతదేహాన్ని శవపరీక్షకు ఇచ్చినప్పుడు వైద్యులిచ్చే డాక్యుమెంట్ ఏది?
- కోల్‌కతా హత్యాచారం కేసులో సీబీఐ, బెంగాల్ సర్కారుకు సుప్రీం ప్రశ్న
- మృతురాలి ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆదేశం

ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద సీబీఐ అధికారులు, సీఐఎస్ఎఫ్ బలగాలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: కోల్‌కతా ప్రభుత్వ వైద్య కళాశాలలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలి కేసులో మృతురాలి శవపరీక్షకు సంబంధించిన కీలక పత్రం కనిపించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై దర్యాప్తు జరపాలని సీబీఐని ఆదేశించింది. మరోవైపు హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళనలకు దిగిన వైద్యులు విధుల్లో చేరాలని సూచించింది. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధులకు హాజరవకపోతే చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తెలిపింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసును విచారించింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అప్పగించిన సమయంలో ఇవ్వాల్సిన పత్రం ఎక్కడ ఉందని సీజేఐ ధర్మాసనం సీబీఐని, బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే ఆ పత్రం తమ రికార్డుల్లో లేదని సీబీఐ తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది కపిల్ సిబాల్ స్పందిస్తూ.. ఆ పత్రం గురించి తనకూ తెలియదని, తర్వాత దానికి సమాధానం ఇస్తానని చెప్పారు. అత్యాచారం, హత్య జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కోల్‌కతా పోలీసులకు 14 గంటలు ఎందుకు పట్టిందని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. అలాగే ఈ కేసు దర్యాప్తుపై ఈ నెల 17న తాజా నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. ఇక మృతురాలి ఫొటోలను అన్ని సోషల్ మీడియా వేదికల నుంచి తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కేసు దర్యాప్తుపై సీబీఐ స్థాయీ నివేదికను సమర్పించిందని, కేసు విచారణ కొనసాగుతోందని.. ఈ విషయంలో సీబీఐకి తాము సలహాలు ఇవ్వాలనుకోవడం లేదని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఆర్జీ కర్ కళాశాలలో హత్యాచార ఘటన జరిగిన ప్రదేశంలో సేకరించిన ఫోరెన్సిక్ నమూనాలను రాష్ట్ర ప్రభుత్వ ఫోరెన్సిక్ విభాగం పరిశీలించిందని, వాటిని తాము ఢిల్లీ ఎయిమ్స్‌కు పంపాలని నిర్ణయించామని తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో భద్రత కోసం నియమించిన మూడు కంపెనీల సీఐఎస్ఎఫ్ సిబ్బందికి తక్షణమే సౌకర్యాలు కల్పించాలని బెంగాల్ హోంశాఖను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. కాగా, వైద్యుల నిరసన కారణంగా రాష్ట్రంలో 23 మంది మరణించారని బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.

2వారాలు.. 2వేల పోలీసులు

ఎట్టకేలకు చిక్కిన స్వయంప్రకటిత దైవ కుమారుడు క్విబొలోయ్

- చిన్నపిల్లల సెక్స్‌ట్రాఫికింగ్, స్మగ్లింగ్ సహా ఫిలిప్పీన్స్ పాస్టర్‌పై ఎన్నో కేసులు



మనీలా, సెప్టెంబరు 9: తనను తాను దైవ కుమారుడిగా, ఈ విశ్వానికి యజమానిగా ప్రకటించుకుని.. లక్షలాది మందిని ఆధ్యాత్మిక మత్తులో ముంచేసి.. చిన్నపిల్లల సెక్స్ రాకెటింగ్ సహా రకరకాల అరాచకాలకు పాల్పడిన ఫిలిప్పీన్స్ పాస్టర్ అపోలో క్విబొలోయ్‌ని అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అరెస్ట్ చేసింది! ఫిలిప్పీన్స్‌తోపాటు అమెరికా దేశాల 'వాంటెడ్' జాబితాలో ఉన్న ఈ 74 ఏళ్ల పాస్టర్‌ను పట్టుకునేందుకు దాదాపు 2000 మంది పోలీసులు.. కింగ్‌డమ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ (కేవోజేసీ) పేరిట అతడు ఏర్పాటుచేసుకున్న 75 ఎకరాల సామ్రాజ్యంలో రెండువారాలపాటు అణువణువూ గాలించారు! 2017లో మన దేశంలో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌సింగ్‌ను అరెస్ట్ చేసినప్పుడు అతడి అనుచరులు చేసిన రచ్చ గుర్తుందా? అచ్చం అలాగే.. క్విబొలోయ్ అనుచరులు కూడా పోలీసుల తనిఖీలను తీవ్రంగా ప్రతిఘటించారు. వేలాదిగా తరలివచ్చి పోలీసులతో ఘర్షణకు దిగారు. అయినా పోలీసులు వెనక్కి తగ్గలేదు. ప్రత్యేక నిఘా పరికరాలను తెప్పించి.. వాటిలో నమోదైన హృదయస్పందల ఆధారంగా అతడు అక్కడే అండర్‌గ్రౌండ్‌లో ఒక బంకర్‌లో దాక్కుని ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. అతడితోపాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని రాజధాని మనీలాకు తరలించారు. క్విబొలోయ్ లాయర్లు మాత్రం అతడే తనంత తానుగా లొంగిపోయాడని చెబుతున్నారు. తన అరెస్టు వెనుక సైతాను హస్తం ఉందని క్విబొలోయ్ ప్రకటించాడు.

ఇవీ అభియోగాలు..

ఫిలిప్పీన్స్‌లో పేదరికంలో మగ్గిపోతున్న చిన్నారులకు దాతృత్వం పేరుతో అమెరికాలోనూ ఆధ్యాత్మిక దుకాణం తెరిచిన క్విబొలోయ్‌పై 2021లో అమెరికా పోలీసులు చిన్నపిల్లల సెక్స్‌ట్రాఫికింగ్, మోసం, భారీగా నగదు అక్రమ రవాణా వంటి కేసులు పెట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దైవకార్యం పేరిట క్విబొలోయ్ ఫిలిప్పీన్స్ నుంచి బాలికలను, యువతులను అమెరికాకు తీసుకెళ్లేవాడు. వారంతా.. పగటిపూట విరాళాలు సేకరించాల్సి ఉంటుంది. రాత్రి పూట.. 'నైట్ డ్యూటీ' పేరిట వేసే ప్రత్యేక డ్యూటీలో భాగంగా అతడికి లైంగిక సేవలు అందించాలి. అందుకు ఒప్పుకొన్నవారికి డిస్నీలాండ్ సందర్శన, ప్రైవేటు జెట్ విమానంలో టూర్ల వంటి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. కాదన్నవారికి 'శాశ్వత నరకం' తప్పదని బెదిరించేవారు. 'సైతాను బిడ్డ' అని రాసి ఉన్న దుస్తులువారికి వేసి గదుల్లో బంధించేవారు. ఈ విషయాలన్నీ 2021లోనే బయటపడినా.. అతడు అప్పటి ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టే బాల్యస్నేహితుడు, ఆధ్యాత్మిక సలహాదారు కావడంతో అతడి అరెస్టుకు ఎవరూ సాహసించలేదు. 2022 జూన్‌లో డ్యుటెర్టే పదవీకాలం ముగిశాక క్విబొలోయ్‌కి కష్టాలు మొదలయ్యాయి. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం కూడా అతడిపై అరెస్ట్ వారంట్ జారీ చేసింది. ఆ ఆశ్రమంలోని ఒక కొండమీద అతడికో కోట ఉంది దానిపేరు.. 'గార్డెన్ ఆఫ్ ఈడెన్ రిసార్ట్' అని పేరు పెట్టుకున్నాడు. సొంత టీవీ, రేడియో, సోషల్ మీడియా నెట్‌వర్క్ కూడా ఉన్నాయి. తనకు ఫిలిప్పీన్స్‌లోనే 40 లక్షల మంది అనుచరులు.. ప్రపంచవ్యాప్తంగా మరో 30 లక్షల మంది దాకా భక్తులున్నారని గతంలో ఒకసారి ప్రకటించాడు.

భద్రాద్రి జిల్లాలో కుండపోత

- పొంగిన వాగులు, వంకలు
- చెరువులో పడి ఒకరి మృతి
- పెరిగిన గోదావరి నీటిమట్టం
- నేడు, రేపు మోస్తరు వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భద్రాద్రి జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపిలేని భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. అక్కడక్కడ పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని పెద్ద గొల్లగూడెంలో చింతలచెరువులో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి పడి మృతి చెందాడు. అశ్వారావుపేటలో 8 సెం.మీ., టేకులపల్లిలో 4.6, ఇల్లందులో 4.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జూలూరుపాడు మండలంలో గుండెపుడిలోని చెరువు కట్ట కోతకు గురైంది. అధికార యంత్రాంగం మరమ్మతులు చేపట్టింది. గోధుమవాగు పొంగి ప్రవహించడంతో పెనుబల్లి వద్ద వంతెనపైకి నీరు రావటంతో రాకపోకలను నిలిపేశారు. చర్ల మండలం తాలిపేరు నుంచి 24 గేట్లు ఎత్తి 1.30 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో 2 గేట్లు ఎత్తి 11 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం ఉదయం 6 గంటలకు 25.3 అడుగులున్న నీటిమట్టం.. సాయంత్రం 6 గంటలకు 29.6 అడుగులకు చేరింది. మంగళవారం తొలి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకునే అవకాశాలున్నట్లు సమాచారం. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో గత రెండ్రోజుల నుంచి సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఇక సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 78 మండలాల్లో 1 నుంచి 6 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, కృష్ణా, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు నిలకడగా వరద వచ్చిచేరుతోంది. సోమవారం ఆల్మట్టి ప్రాజెక్టుకు 94 వేల క్యూసెక్కులు, నారాయణపూర్ ప్రాజెక్టుకు 65 వేలు, జూరాల ప్రాజెక్టుకు 2.05 లక్షలు, తుంగభద్రకు 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 2.54 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా... 2.27లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 2.04 లక్షల క్యూసెక్కులు ఉండగా.. 1.37లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదైంది. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్‌కు 42 వేలు, శ్రీపాద ఎల్లంపల్లికి 1.37 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి 3.51 లక్షల క్యూసెక్కులు, సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)కు 6.37 లక్షలు, దుమ్ముగూడెంకు 3.58 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.


తాలిపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. చాలా జిల్లాల్లో గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఆయా జిల్లాలకు యెల్లో‌అలెర్ట్ జారీ చేసింది.


ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న కూనంనేని, వాసిరెడ్డి సీతారామయ్య

సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ

- ఎన్నికలు జరిగిన 8 నెలలకు ధ్రువీకరణ పత్రం అందజేత

గోదావరిఖని, సెప్టెంబరు 9: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం హోదా ఎట్టకేలకు ఏఐటీయూసీకి లభించింది. ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలలకు ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని సింగరేణి యాజమాన్యం అందజేసింది. గత సంవత్సరం డిసెంబరు 27న సింగరేణిలో రహస్య ఓటింగ్ విధానం ద్వారా గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ విజయం సాధించినప్పటికీ అధికారికంగా ఎలాంటి పత్రాలు అందలేదు. ఎన్నికలు నిర్వహించిన కార్మిక శాఖ.. సింగరేణి యాజమాన్యం ద్వారానే హోదా పత్రాలు పొందాలని చెప్పింది. తమకు సంబంధం లేదని సింగరేణి దాటవేసింది. చివరికి సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంనాయక్ ఏఐటీయూసీకి గుర్తింపు హోదా పత్రాన్ని అందజేశారు.

గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలకు తాళం

- అద్దె బకాయిలు చెల్లించనందుకు యజమాని చర్య

వనపర్తి రూరల్ : అద్దె బకాయిలు చెల్లించలేదని వనపర్తి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాల భవనాల గేట్లకు యజమాని సోమవారం తాళం వేశారు. బీజేపీ మాజీ నాయకుడు అనుజ్ఞా రెడ్డి తన భవనాలను అద్దెకు ఇచ్చారు. ఎనిమిది నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో రూ.62.16 లక్షలు బకాయి ఉందని, ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడంతో గేట్లకు యజమాని తాళం వేశారు. దాదాపు మూడు గంటల తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపి అద్దె డబ్బులు వచ్చేలా ప్రయత్నం చేస్తానని కళాశాల ప్రిన్సిపాల్ చెప్పడంతో గేట్లకు వేసిన తాళం తీశారు.

పంటరుణం కట్టాలని మహిళా రైతుకు లీగల్ నోటీసు

కేశంపేట, సెప్టెంబర్ 9: రుణమాఫీ కాని వారికి బ్యాంకులు లీగల్ నోటీసులు పంపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా కేశంపేటకు చెందిన ఓ మహిళా రైతుకు పంటరుణం చెల్లించాలంటూ బ్యాంకు నుంచి సోమవారం లీగల్ నోటీసు అందింది. కేశంపేటకు చెందిన తలసాని యశోదమ్మ కెనరా బ్యాంకు నుంచి 2021లో రూ. 68,000 పంట రుణం తీసుకున్నారు. అందులో కొంత తిరిగి చెల్లించారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని చెప్పడంతో మిగతాది చెల్లించలేదు. ప్రభుత్వం జారీ చేసిన జాబితాలో తన పేరు ఉందని ఆమె తెలిపారు. తన కుమారుడి రేషన్ కార్డులో తన పేరు ఉండటంతో రుణమాఫీ కాలేదని, కుటుంబసభ్యుల నిర్ధారణ తరువాత రుణమాఫీ అవుతుందని వ్యవసాయాధికారులు చెప్పారని వివరించారు. అయినా బ్యాంకువారు రూ. 48,129 పంటరుణం చెల్లించాలని లీగల్ నోటీసు పంపించారని వాపోయారు.

ఠాణాలో నేత పుట్టినరోజు.. ఎస్సైపై బదిలీ వేటు

వట్‌పల్లి, సెప్టెంబరు 9: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని వట్‌పల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌పై బదిలీ వేటు పడింది. ఆదివారం వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ జోషి పుట్టినరోజును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిపారు. స్టేషన్‌లో రమేష్ జోషికి కేక్ కట్ చేసి ఎస్సై లక్ష్మణ్ తినిపించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఎస్ఐ లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లోని మల్టీజోన్ వీఆర్‌కు అటాచ్ చేశారు.

పొలాలను ముంచెత్తుతున్న పాలేరు

నడిగూడెం, సెప్టెంబరు 9: జోరు వానలకు సాగర్ ఎడమ కాల్వకు గండ్లు పడి పంటలు నష్టపోయిన రైతులకు.. ఆ గండ్ల నుంచి పోటెత్తుతున్న పాలేరు వరద మరింత ఇబ్బందిగా మారింది. మొన్న కురిసిన భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని సాగర్ ఎడమకాల్వకు రెండు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. ఇప్పుడిప్పుడే వాటికి మరమ్మతులు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మరోవైపు, పొలాల్లో ఇసుక మేటలను తొలగించుకుంటూ రైతులు సాగు భూములను బాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పాలేరు జలాశయానికి ఎగువ నుంచి వరద పోటెత్తుతుండటంతో ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం వద్ద ఉన్న గేట్లు ఎత్తి సోమవారం నుంచి ఎడమకాల్వలోకి వరదను వదులుతున్నారు. దీంతో ఆ నీరంతా ఇప్పటికే గండ్లు పడిన సాగర్ ఎడమకాల్వ ప్రాంతాన్ని మరోసారి ముంచెత్తుతోంది. ఈ పరిణామం అటు కాల్వ మరమ్మతు పనులకు, ఇటు రైతులకు ఇబ్బందిగా మారింది. కాల్వ రెండు గండ్ల నుంచి పొలాల మీదుగా ఖమ్మం జిల్లా మందనర్సయ్యగూడెం, ఈశ్వరమాదారం, రాజుపేట మీదుగా వరద ఉధృతంగా పారుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఆగస్టు 30న కురిసిన భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం పరిధిలోని సాగర్ ఎడమకాల్వ 132-133 కి.మీ. వద్ద రెండు చోట్ల గండ్లు పడ్డాయి. వీటి వల్ల సుమారు 1,000 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా, కాల్వ గండ్లను పూడ్చేందుకు ప్రభుత్వం రూ.2.10 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎన్నెస్పీ అధికారులు మరమ్మతుల పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సమయంలోనే పాలేరుకు ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ఎడమ కాల్వ రెండు గండ్లను ప్రవాహం ముంచెత్తింది. పాలేరుకు వరద తగ్గితే గండ్ల వద్ద మామూలు పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది.

ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ కేసులో మద్యం వ్యాపారి మహేందుకు బెయిల్

ఆప్ వాలంటీర్ రయత్‌కు కూడా ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఢిల్లీ ఎక్సయిజ్ విధానం కేసులో నిందితులుగా ఉన్న మద్యం వ్యాపారి సమీర్ మహేందు, ఆమ్ ఆద్మీ పార్టీ వాలంటీర్ చన్‌ప్రీత్ సింగ్ రయత్‌లకు సోమవారం ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ బన్సల్ బెయిల్ మంజూరు చేశారు. మద్యం వ్యాపారుల నుంచి సొమ్ము తీసుకొని దానిని గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆప్ నాయకులకు ఇచ్చారంటూ రయత్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణతో 2022 ఏప్రిల్ 12న అరెస్టు చేసింది. కొందరికి లబ్ధి కలిగించేలా ఆప్ ప్రభుత్వం మద్యం విధానంలో మార్పులు చేసిందని, ప్రయోజనం పొందిన వారిలో మహేందు ఉన్నారని ఈడీ పేర్కొంది. మద్యం తయారీ కంపెనీతో పాటు, హోల్‌సేల్, రిటెయిల్ లైసెన్సులు ఉన్నాయని, ప్రభుత్వ నిర్ణయం ఆయనకు మేలు కలిగించిందని ఆరోపించింది. ఆయనను 2022 సెప్టెంబరు 28న అరెస్టు చేసింది.

ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అమ్మకూడదన్న 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, ఇతర రక్షణ సామగ్రిని విక్రయించకుండా నిరోధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రస్తుతం గాజాలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఆయుధాల విక్రయం తగదంటూ అశోక్ కుమార్ శర్మ మరికొందరు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ద్వారా ఈ 'పిల్'ను దాఖలు చేశారు.

చివరి బాధితుడి వరకూ సాయం

వరద బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున పరిహారం

- ముంపునకు గురైన ఎకరానికి రూ.10 వేలు
- మృతుల కుటుంబాలకు 5లక్షలు, ఇందిరమ్మ ఇల్లు
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు సర్కారు అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చివరి బాధితుడి వరకు సహాయం అందిస్తామని భరోసానిచ్చారు. సోమవారం ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాఖల వారీగా వరద నష్టాన్ని పక్కాగా అంచనా వేయాలని సూచించారు. కేంద్రానికి పంపే నివేదికల్లో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి పంపాలని కోరారు. వరద బాధిత ప్రాంతాల్లో దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి రూ.16,500 చొప్పున ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ ద్వారా నేరుగా బాధితుల ఖాతాల్లో ఈ నగదు జమ చేస్తామని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఇంటికి రూ.10 వేలు అందజేస్తామని తొలుత ప్రకటించారని, అయితే జరిగిన నష్టాన్ని ఆయన స్వయంగా పరిశీలించాక మానవతా దృక్పథంతో రూ.16,500 ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ఈ సహాయాన్ని సోమవారం నుంచే బాధితులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, ముంపునకు గురైన ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 358 గ్రామాలు వరద ముంపునకు గురవగా, 2 లక్షల మంది ప్రభావితమైనట్లు చెప్పారు. భారీ వర్షాలు, వరదల వల్ల 33 జిల్లాలను ప్రభావిత జిల్లాలుగా ప్రకటించామని పొంగులేటి తెలిపారు. వర్షాల వల్ల రాష్ట్రంలో 33 మంది మృతి చెందారన్నారు. ఖమ్మంలో ఆరుగురు, కొత్తగూడెంలో ఐదుగురు, ములుగులో నలుగురు, కామారెడ్డిలో ఇద్దరు, వనపర్తిలో ముగ్గురు మృతి చెందినట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించారు. ఇల్లు కూలిపోయిన వారిని గుర్తించి రూ.5 లక్షలతో ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. దెబ్బతిన్న పంచాయతీరాజ్, రహదారుల భవనాల శాఖ పరిధిలోని రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సంబంధించి పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న వాటి వివరాలను 24 గంటల్లోపు సచివాలయంలోని ఆయాశాఖల అధిపతులకు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇళ్లలోకి నీరు చేరి ఆస్తి పత్రాలు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ఇతర ధ్రువ పత్రాలు తడిచిపోయినా, కొట్టుకుపోయిన వారి కోసం స్థానిక పోలీసు స్టేషన్లలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. అక్కడ దరఖాస్తు చేసుకుంటే పోయిన పత్రాలను ప్రభుత్వం తిరిగి అందించే ఏర్పాటు చేస్తుందని తెలిపారు.



2 ఏజెన్సీల నిర్వాకం వల్లే వరద..

మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు ఏజెన్సీలు వ్యర్థాలను ప్రభుత్వ భూముల్లో వేయడం వల్లనే సూర్యాపేట, పాలేరుకు భారీ నష్టం జరిగిందని అధికారులు మంత్రి పొంగులేటికి వివరించారు. గుట్టలుగా ఉన్న వ్యర్థాల వల్ల వరద నీరు పారే అవకాశం లేకుండాపోయిందని.. ఈ రెండు ఏజెన్సీలు 18 లక్షల క్యూబిక్ మీటర్ల వ్యర్థాలు నదిలో పోశాయని వెల్లడించారు. దీంతో మంత్రి స్పందిస్తూ.. జరిగిన నష్టాన్ని ఆ రెండు ఏజెన్సీల నుంచి వసూలు చేయాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేపు తెలంగాణకు కేంద్ర బృందం

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఈ నెల 11న కేంద్ర బృందం పర్యటించనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో అకాల వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని కేంద్ర బృందం అంచనా వేస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సలహాదారు, కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం బుధవారం ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు సహా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు. ఈ బృందంలో ఆర్థిక , వ్యవసాయం, రోడ్లు, రహదారులు, గ్రామీణాభివృద్ధి, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులు కూడా ఉంటారని వివరించారు. కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులు, అధికారులతో చర్చిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు.

చర్లపల్లి స్టేషన్‌కు రోడ్లు వేయాలంటూ రేవంత్‌కు లేఖ

సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వే టర్మినల్స్‌కు వెళ్లే రహదారుల విస్తరణకు సహకరించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. చర్లపల్లి రైల్వే టర్మినల్ పనులు దాదాపు పూర్తయ్యాయని పేర్కొంటూ, ప్రయాణికుల రాకపోకలకు కనీసం వంద అడుగుల రోడ్డు అవసరమని వివరించారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, క్వాడ్రప్లింగ్‌తో పాటుగా లైన్ల విద్యుదీకరణ, 40కి పైగా స్టేషన్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. చర్లపల్లిలో రూ.415 కోట్లతో కొత్త రైల్వే టర్మినల్ నిర్మాణం వేగవంతంగా పూర్తవుతోందని, ప్రయాణికుల రాకపోకల కోసం 100 అడుగుల రోడ్డు నిర్మాణం అవసరముందని లేఖలో వివరించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను రూ.715 కోట్లతో వచ్చే ఏడాది చివరి నాటికల్లా అత్యాధునిక వసతులతో ప్రజలకు అంకితం చేయడానికి ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు వచ్చి, పోయే మార్గాలు చాలా ఇరుకుగా ఉండటంతో, పీక్ అవర్స్‌లో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, సమస్య పరిష్కారానికి సీఎం చొరవతీసుకోవాలని కిషన్‌రెడ్డి లేఖలో కోరారు.

నీటిపారుదల శాఖలో త్వరలో నలుగురు ఈఎన్‌సీలు

- ఒక సూపర్ న్యూమరరీ ఈఎన్‌సీ పోస్టు
- 22 సీఈ పోస్టులకు 13 ఖాళీ
- పదోన్నతుల ప్రక్రియను రెండురోజుల్లో
- పూర్తిచేయాలని మంత్రి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నీటిపారుదల శాఖలో కొత్తగా నలుగురు ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్)ల నియామకం జరుగనుంది. ప్రస్తుతం ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్), ఈఎన్‌సీ(రామగుండం), ఈఎన్‌సీ (జనరల్) పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆ పోస్టుల్లో ముగ్గురు సీనియర్ చీఫ్ ఇంజనీర్ల(సీఈ)ను నియమించనున్నారు. అంతేకాకుండా మరో ఈఎన్‌సీ (అంతరాష్ట్ర వ్యవహారాల) కోసం ప్రత్యేకంగా ఒక సూపర్ న్యూమరరీ పోస్టును సృష్టించి, అందులో కీలక అధికారిని నియమించే అవకాశాలున్నాయి. ఈఎన్‌సీ(జనరల్)గా పనిచేసిన మురళీధర్‌రావును రాజీనామా చేయాలని ప్రభుత్వం కోరగా... ఆయన రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్-1లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు/పంప్‌హౌస్‌ల నిర్మాణంలో పాల్గొన్న ఈఎన్‌సీ(రామగుండం) నల్లా వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం ఉద్వాసన పలికింది. మరో ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్)గా పనిచేస్తున్న బి.నాగేంద్రరావు కొద్దినెలల కిందట పదవీ విరమణ చేశారు. ఆయనకు తాత్కాలిక ప్రాతిపదిక, ఔట్‌సోర్సింగ్ విధానంలో నవంబరు దాకా అవకాశం ఇచ్చారు. అయితే నవంబరు లేదా ఆ మధ్యకాలంలో ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఆయన సేవలను నిలుపు చేస్తామని ప్రభుత్వం ఉత్తర్వుల్లోనే ప్రకటించింది. అయితే ఉత్తర తెలంగాణకు చెందిన కీలక మంత్రి ఆశీస్సులతో ఆయన ఈఎన్‌సీగా మరికొంత కాలం శాఖలో చక్రం తిప్పాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక రాష్ట్రంలో 22 చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఉండగా... 13 ఖాళీగా ఉన్నాయి. సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)లకు సీఈలుగా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(ఈఈ)కు ఎస్ఈలుగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(డీఈఈ)కు ఈఈలుగా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు డీఈఈలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియను ముందుకు కదిలించనున్నారు. దీనిపై సోమవారం జలసౌధలో నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ నేతృత్వంలో వేసిన కమిటీతో సమావేశమయ్యారు. రెండురోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. పదేళ్లుగా పదోన్నతుల ప్రక్రియ జటిలంగా మార్చారని, గత ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించకుండా నాన్చివేత ధోరణి అనుసరించిందని మంత్రి అధికారులకు గుర్తుచేశారు.

గూడు చెదిరిన పేద బతుకులు

- మున్నేరు వరదలో ఇళ్లు కోల్పోయిన రోజువారీ కూలీలు, చిరువ్యాపారులు
- ఖమ్మం జిల్లాలో వరద బారినపడ్డ మొత్తం ఇళ్లు 15,055
- పూర్తిగా పడిపోయిన 146 గుడిసెలు, షెడ్లు
- పొంచి ఉన్న అంటువ్యాధుల భయం
- బాధితులకు గుర్తింపు కార్డులిస్తాం: కలెక్టర్

ఖమ్మం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోజువారీ కూలీలుగా కాయకష్టం చేసుకునే నిరుపేదలు వారు.. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి.. అటువంటి వారి జీవితాలను మున్నేరు వరద నిలువునా ముంచింది. ఖమ్మం నగరంలో మున్నేరు నదికి ఇరు పక్కల నిర్మించుకున్న వారి ఇళ్లు మున్నేరు వరద బీభత్సానికి నేలమట్టమయ్యాయి. ఫలితంగా ఆ ఇళ్లలోని వారంతా ఇప్పుడు నిలువ నీడలేక రోడ్డున పడ్డారు. ఖమ్మంలోని మున్నేరు నదికి ఆనుకొని ఉన్న బొక్కలగడ్డ, సుందరయ్యనగర్, పద్మావతి నగర్, మోతీ నగర్, వెంకటేశ్వర నగర్, ధంసలాపురం, ప్రకాశ్ నగర్, రూరల్ మండలంలోని పెద్దతండా, జలగంనగర్, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప తదితర కాలనీలతో పాటు జిల్లాలో పలుచోట్ల 146 గుడిసెలు, షెడ్లు నేలమట్టం కాగా 15,055 ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించడంతో కొన్ని తీవ్రంగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇళ్ల ప్రహరీలు కూడా కూలిపోయాయి. కూలీల ఇళ్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. కూలీ పనులు, చిరువ్యాపారాలు, ఇళ్లలో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, మిర్చి మార్కెట్‌లో పనిచేసే హమాలీలకు సంబంధించిన ఇళ్లే ఎక్కువగా దెబ్బతిన్నాయి. మళ్లీ ఇళ్లు నిర్మించుకోవడం వీరికి తలకుమించిన భారమే కానుంది. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు రూరల్ మండలంలో పునరావాస కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నా తోటి వరద బాధితులంతా తమ ఇళ్లకు చేరి వాటిని శుభ్రం చేసుకుంటున్నారు. పూర్తిగా దెబ్బతిన్నవారు మాత్రం పునరావాస కేంద్రాల్లోనే, బంధువుల ఇళ్లలోనో తల దాచుకుంటున్నారు. అలాంటి వారంతా తమకు ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతున్నారు. మున్నేరు వరద బాధితులకు అంటువ్యాధుల బయం పట్టుకుంది. పలువురు దగ్గు, జలుబుతో బాధపడుతుండగా అక్కడక్కడా అతిసారం కేసులూ నమోదవుతున్నాయి. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతుండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మా ఇల్లు కూలిపోయింది

నేను మా ఆయన కూలి పనిచేసుకొని జీవిస్తున్నాం. వరదలో ఇల్లు కూలిపోయింది. సామగ్రి కొట్టుకుపోయింది. మళ్లీ ఇల్లు కటుకోవడం, సామగ్రి కొనుక్కోవడం మా వల్ల అవుతుందా? ప్రభుత్వం ఆదుకుంటేనే తిరిగి కోలుకుంటాం. ప్రభుత్వం మాకు పక్కా ఇల్లు నిర్మించాలి. - కె.స్వరూప, బొక్కలగడ్డ



రెండు వారాల్లోగా సర్టిఫికెట్లు

వరద బాధిత కుటుంబాలకు గుర్తింపు కార్డులు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లాలో వరదల కారణంగా విద్యార్థులు, రైతులు సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, ఇంటి దస్తావేజులు కోల్పోయారని.. 1077 నెంబర్‌తో కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. రెండు వారాల్లోగా బాధితులకు సర్టిఫికెట్లను అందించే కార్యక్రమం అధికార యంత్రాంగమే చేపడుతోందన్నారు. ఇప్పటికే 600 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అసలైన విజేతలు

ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే ఏ క్రీడాకారుడైనా కష్టాలను అధిగమించాల్సిందే. కానీ, జీవితమే కష్టతరమై, అడుగడుగునా అవరోధాలు ఎదురైనా, ముందుకు సాగుతూ లక్ష్యాన్ని చేరుకుంటారు పారా అథ్లెట్లు. తమకున్న వైకల్యాన్ని అధిగమించి ఆటల్లో సత్తాచాటి వెలుగులోకి వస్తారు. అత్యుత్తమ క్రీడా వేదికపై పోటీపడి పతకాలతో మెరిసి దేశ పతాకాన్ని రెపరెపలాడిస్తారు. ఈసారి కూడా మన దివ్యాంగ క్రీడాకారులు పారాలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శనతో అలరించి అసలైన విజేతలుగా నిలిచారు.


గత పన్నెండు రోజులుగా క్రీడాభిమానులను మురిపించి అందరిలోనూ స్ఫూర్తి నింపిన పారిస్ పారాలింపిక్స్‌కు ఆదివారంతో తెరపడింది. గత టోక్యో క్రీడల తరహాలోనే ఈసారి కూడా చైనా అత్యధికంగా 220 పతకాలు సాధించి ఆటల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఏకంగా 94 బంగారు పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. 49 స్వర్ణాలు సహా 124 పతకాలతో గ్రేట్ బ్రిటన్ ద్వితీయస్థానాన్ని అందుకోగా, 105 పతకాలతో అగ్రరాజ్యం అమెరికా తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. ఆత్మవిశ్వాసమే ఆస్తిగా, పట్టుదలే పెట్టుబడిగా, అనుక్షణం తమ పోరాట పటిమతో భారత పారాలింపియన్లు పారిస్‌లో అబ్బురపరిచారు. కనీసం పాతిక పతకాలు లక్ష్యంగా పోటీపడిన మన అథ్లెట్లు, అంతకంటే ఓ నాలుగు ఎక్కువగానే సాధించారు. 12 క్రీడాంశాల్లో 84 మంది పోటీపడి, మొత్తం 29 పతకాలు దక్కించుకున్నారు. పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచి భళా అనిపించారు. ఇందులో ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, పదమూడు కాంస్య పతకాలున్నాయి. భారత ఆటగాళ్లు పారా క్రీడల చరిత్రలోనే అత్యుత్తమంగా రాణించి అత్యధిక పతకాలను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పటిదాకా జరిగిన పారాలింపిక్ క్రీడల్లో కలిపి భారత్ మొత్తం అరవై పతకాలు సాధిస్తే.. ఇందులో ఒక్క పారిస్‌లోనే దాదాపు సగం పతకాలు లభించడం విశేషం.

పుట్టుకతోనే వచ్చిన వైకల్యంతో ఒకరు, ఊహించని ప్రమాదం బారినపడి కాలు, చేయి కోల్పోయి మరొకరు.. ఇలా పారిస్ పారాలింపిక్స్‌లో తలపడి పతకాలు సాధించిన యోధుల్లో ఒక్కొక్కరిది ఒక్కో స్ఫూర్తిగాథ. రెండు చేతులూ లేకున్నా, కాలితోనే విల్లును ఎక్కుపెడుతూ, లక్ష్యం దిశగా బాణాన్ని సంధించడంలో దిట్ట జమ్మూ కశ్మీర్‌కు చెందిన 17 ఏళ్ల శీతల్ దేవి. ఆర్చరీ క్రీడ వ్యక్తిగత విభాగంలో విఫలమైనా, రాకేశ్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో కంచు పతకం సాధించి వహ్వా అనిపించింది. పిన్నవయసులో పారాలింపిక్స్‌లో పతకం దక్కించుకున్న తొలి భారత ఆర్చర్‌గా ఘనత వహించింది. పదిహేనేళ్ల వయసులో జరిగిన రైలు ప్రమాదంలో కాలును కోల్పోయిన నితేశ్ కుమార్ విషాదం నుంచి కోలుకొని చదువుపై దృష్టి సారించాడు. ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు దక్కించుకొన్న అతడు, పారాలింపిక్స్‌లో దేశ షట్లర్ల విజయాలతో స్ఫూర్తిపొంది బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. కృత్రిమ పాదం అమర్చుకొని పోటీలకు సిద్ధమైన అతడు నాలుగు పదుల వయసులో బంగారు పతకం గెలిచి తన కల నెరవేర్చుకున్నాడు. నీరజ్ చోప్రా స్ఫూర్తితో జావెలిన్ త్రో క్రీడను కెరీర్‌గా ఎంచుకున్న ఒంటికాలి వీరుడు సుమిత్ అంటిల్ వరుసగా రెండో పారాలింపిక్స్‌లోనూ చాంపియన్‌గా నిలిచి తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. చిన్నప్పుడు కారు ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుబడిపోయినా జీవితంపై ఏమాత్రం ఆశలు కోల్పోని షూటర్ అవనీ లేఖారా వరుసగా రెండో పారాలింపిక్స్‌లో విజేతగా నిలిచి తన బుల్లెట్ పవరేంటో చూపించింది. తమకెదురైన అవమానాలనే సోపానాలుగా మలచుకుంటూ ముందుకుసాగిన పరుగుల రాణి ప్రీతి పాల్, పారిస్‌లో రెండు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించగా.. కంటిచూపు తక్కువున్నా, పట్టుదలతో పోరాడిన సిమ్రన్ శర్మ పతకంతో అదరగొట్టింది. కరెంట్ షాక్‌తో చిరుప్రాయంలోనే చూపు కోల్పోయిన జూడో స్టార్ కపిల్ పర్మార్ కాంస్యం నెగ్గాడు. షాట్‌పుట్‌లో కాంస్య పతకం అందుకున్న నాగాలాండ్‌కు చెందిన హోకాటో హోటొజి సెమా.. సైన్యంలో హవల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఎడమ కాలిని పోగొట్టుకున్నాడు. ఆత్మవిశ్వాసంతో పారా క్రీడల్లో ప్రవేశించి, విశ్వవేదికపై విజయఢంకా మోగించాడు. కొన్నాళ్లుగా అంతర్జాతీయ ఈవెంట్లలో రాణిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన దీప్తి జీవాంజి పారిస్ క్రీడల్లోనూ వెలుగులు విరజిమ్మింది. 400 మీటర్ల రేసులో కాంస్య పతకం సాధించి, ఒకప్పుడు తన మానసిక వైకల్యాన్ని చూసి వెక్కిరించిన వాళ్లతోనే ఇప్పుడు గర్వంగా జేజేలు పలికించుకుంది. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి, అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ, నిరాశలో కుంగిపోతూ, జీవితాన్ని వృథా చేసుకుంటున్న ఎందరికో ఈ పారా యోధుల విజయగాథలు స్ఫూర్తిదాయకం.

హైడ్రా పరిధి మరింత విస్తరించాలి!

తెలంగాణా ప్రాంతంలో విస్తారమైన సహజ వనరులు ఉన్నాయి. లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములతో పాటు, ఇనాం, దేవాదాయ, ధర్మాదాయ, వక్ఫ్ భూములు, అసైన్డ్ భూములు ఉన్నాయి. ఆనాడు కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన అగ్రకుల సంపన్నవర్గం తెలంగాణ జవ జీవాలను పీల్చివేసింది. దేశంలోని బడా పారిశ్రామికవేత్తలు ఈ దోపిడికి ఆ రోజు అండగా నిలబడ్డారు. వెనుకబడిన తెలంగాణ ప్రాంతం వనరులను దోపిడీ చేస్తూ, ఇక్కడి ప్రజలను అణచివేతకు గురి చేస్తూ పరిశ్రమలు, విద్యా, వైద్యం, విద్యుత్, రవాణా, కమ్యునికేషన్, బ్యాంకింగ్.. వంటి అన్ని కీలక రంగాలలో ప్రైవేటు ఆధిపత్యం జొప్పించారు. సామ్రాజ్యవాద మార్కెట్ సంస్కృతితో తెలంగాణలో విషం నింపారు.

తెలంగాణ ప్రజల సమస్యలకు పరిష్కారం ప్రత్యేక రాష్ట్రంతోనే తీరిపోదని ఈ దశాబ్ది పాలనలో తేటతెల్లమైంది. సామ్రాజ్యవాదం, ప్రపంచ బ్యాంకు నిర్దేశిస్తున్న విధానాలలో ఈ ప్రాంత ప్రజలకు అభివృద్ధి లేదు. ఈ తరుణంలో స్థానిక వనరులతో, స్వావలంబన విధానాలతో కింది నుంచి జరిగే అభివృద్ధి నిజమైన అభివృద్ధిగా నిలబడుతుంది. ఈ దిశగా తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ప్రజల నిర్దిష్టమైన సమస్యలకు నిర్దిష్టమైన పరిష్కార మార్గాలను చూపే విధమైన అభివృద్ధి విధానం కీలకం. ఇందుకు అనుగుణంగా అన్ని ప్రజా సముదాయాలకు అభివృద్ధి సమతూకంలో అందేలా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇవ్వగలగాలి. అప్పుడు మాత్రమే 'హైడ్రా'తో చేపడుతున్న కూల్చివేతల పట్ల ప్రజల్లో నమ్మకం కలుగుతుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 'హైడ్రా'ను హైదారాబాద్‌కు మాత్రమే పరిమితం చేస్తామని చెప్పడంగాక రాష్ట్రం మొత్తం 'హైడ్రా'ను విస్తరింపచేయాలి.



ప్రభుత్వ భూములు, నదులు, ఏర్లు, బఫర్ జోన్లు, దేవాదాయ, వక్ఫ్ భూములను అక్రమంగా ఆక్రమించిన పాగా వేసిన భూ కబ్జాదారుల్లో ఇప్పుడు హైడ్రా వల్ల భయాందోళనలు, అలజడులు మొదలయ్యాయి. హైడ్రా నిజాయితీతో నిబద్ధతతో పని చేయాలని, దాన్ని తెలంగాణ వ్యాప్తంగా విస్తరింపచేయాలనీ సాధారణ ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతున్నది. కనుక హైడ్రా విస్తృతి పెంచి తెలంగాణవ్యాప్తంగా అన్ని శాఖలనూ సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ ప్రైవేట్ భూముల ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి కూల్చివేతకు చర్యలు తీసుకోవాలి. వరంగల్ డిక్లరేషన్ దిశగా హైడ్రా అడుగులు పడాలని తెలంగాణ ప్రజానీకం ఎదురుచూస్తున్నది!

ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ తదితర ప్రాంతాల్లో రియల్టర్ల చేతుల్లో ఉన్న రియల్ ఎస్టేట్ భూములను, ఆంధ్రా కాలనీల భూములను స్వాధీన పరచుకుని ఆయా జిల్లాల్లో పేదలకు పంచిపెట్టాలి. అంతేగాక తెలంగాణా ఉద్యమం సందర్భంగా ఫిలింసిటీ, లాంకోహిల్స్, చిత్రపురి తదితర భూముల స్వాధీనం గురించిన డిమాండ్ ముందుకొచ్చింది. గత కేసీఆర్ ప్రభుత్వం అధికార బలంతో తెలంగాణ వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో అక్రమంగా నిర్మించిన విలాసవంతమైన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రభుత్వం వెంటనే స్వాధీనపరచుకోవాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కోస్తా ఆంధ్ర సంపన్నుల ఆధిపత్యాన్ని వేగంగా తొలగించి వేయాలి. సికింద్రాబాద్ హైదరాబాద్ జంట నగరాల్లో సినీ నిర్మాతలు, తదితర సంపన్నులు ఆక్రమించుకున్న విలువైన భూములను స్వాధీనపరచుకుని ప్రజలకు పంచాలి. పరిశ్రమల వ్యర్థ పదార్థాలను మూసీ నదిలోకి వదలకుండా చూడాలి. ఈ వ్యర్థ పదార్థాల వలన తలెత్తిన పర్యావరణ కాలుష్యం, తాగునీటి కొరత, వ్యవసాయ భూములు పనికి రాకుండా పోవడం వంటి సమస్యల కోసం శాశ్వత పరిష్కారాలు వెతకాలి. తెలంగాణ పరిశ్రమల్లో వచ్చే లాభాలు ఈ ప్రాంత అభివృద్ధికే ఖర్చు పెట్టాలి.

హైదరాబాద్‌లోని సంపన్న కాలనీవాసులకు నీరందించే విధంగా వాడుకుంటున్న సింగూరు, మంజీరా జలాశయాల నీటిని బస్తీవాసులకు కూడా అందివ్వాలి. ఆ అవినీతికి కుంభకోణానికి పాల్పడే రాజకీయ నాయకుల ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆస్తులు జప్తు చేయాలి. బడా పారిశ్రామిక వాణిజ్య వర్గాలకు సామ్రాజ్యవాదులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యక్ష పరోక్ష రాయితీలను, సబ్సిడీలను ఈ తరుణంలోనే నిలిపివేయాలి. వీరు వివిధ రూపాల్లో ఎగవేస్తున్న బకాయిల్ని వెంటనే వసూలు చేయాలి. అన్ని రకాల మిగులు భూములన్నీ పేద రైతాంగానికి పంచాలి. భూస్వాముల నుంచి రైతాంగం తిరిగి స్వాధీనపరుచుకున్న భూములకు పట్టాలు, రైతు భరోసా పథకాలు వర్తింపచేయాలి.

ప్రభుత్వ భూములు, నదులు, ఏర్లు, బఫర్ జోన్లు, దేవాదాయ, వక్ఫ్ భూములను ఆక్రమంగా ఆక్రమించి పాగా వేసిన భూ కబ్జాదారుల్లో ఇప్పుడు హైడ్రా వల్ల భయాందోళనలు, అలజడులు మొదలయ్యాయి. హైడ్రా నిజాయితీతో నిబద్ధతతో పని చేయాలని, దాన్ని తెలంగాణ వ్యాప్తంగా విస్తరింపచేయాలనీ సాధారణ ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతున్నది. కనుక హైడ్రా విస్తృతి పెంచి తెలంగాణ వ్యాప్తంగా అన్ని శాఖలనూ సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ ప్రైవేట్ భూముల ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి కూల్చివేతకు చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రైవేట్ వ్యక్తుల ప్లాట్లు, పట్టా భూములను సైతం కొంతమంది రౌడీషీటర్లు ఆక్రమించుకున్నారు. వారిచేత అవన్నీ ఖాళీ చేయించాలి. అక్రమ ఆక్రమణలను తొలగించి చెరువులు, ఏర్లూ, నదుల నీటి ప్రవాహానికి స్వేచ్ఛ కలిగించాలి. ఇలాంటి అన్ని విషయాలతో నిండిన వరంగల్ డిక్లరేషన్ దిశగా హైడ్రా అడుగులు పడాలని తెలంగాణ ప్రజానీకం ఎదురుచూస్తున్నది!

■ రామటెంకి అశోక్
తెలంగాణ ప్రజా ఫ్రంట్
ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు

ఆసియాకు అందేనా ఈ శతాబ్దం?

ఈ శతాబ్దం ఆసియాదే! ఏదో ఒక సందర్భంలో దీన్ని వినని వారే ఉండరు! 1750ల వరకూ జనాభాలోనే కాదు.. ప్రపంచ వస్తు, పంటల ఉత్పత్తిలో ఆసియాదే అగ్ర భాగం! ఒకనాడు ప్రపంచ ఉత్పత్తిలో సగం కంటే ఎక్కువే వాటా కలిగిన ఆసియా ఖండం 1950ల వరకూ తీవ్ర దుస్థితిని ఎదుర్కొంది. దాదాపు 200 ఏళ్లకు పైగా ఆసియా తన పూర్వ వైభవాన్ని ఎందుకు కోల్పోయింది? ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వేగంగా అడుగులు ఎందుకు వేయలేకపోయింది? ఇందుట్లో స్వయంకృతాపరాధాలెన్ని? బాహ్య ప్రమేయ అపరాధాలెన్ని? యాదృచ్ఛిక పరిణామాలెన్ని? అని ప్రశ్నించుకుంటే చాలా విషయాలను చెప్పుకోవచ్చు. గడచిన ముప్పయి ఏళ్లలో జరిగిన పరిశోధనలతో ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయి.

18వ శతాబ్దం విప్లవాలకు నిలయం. పారిశ్రామిక, అమెరికా, ఫ్రెంచ్ విప్లవాలతో పాటు అపూర్వ మేధో వికాసాలు ఆ శతాబ్దంలోనే జరిగాయి. దీన్ని దాటి వందల, వేల ఏళ్లు వెనక్కి వెళితే ఆసియా ఖండ ఘనచరిత్ర మనకు కనపడుతుంది. మానవ నాగరికతల అభివృద్ధిలో ఆసియాతో పోల్చదగినది ఏదీ లేదు. హిందూ, బౌద్ధ, క్రైస్తవ, ఇస్లాం లాంటి కోట్ల మంది అనుసరించే మతాలన్నీ ఇక్కడే పుట్టాయి. నదీ తీరాల్లో వెలిసిన తొలి నాగరికతలకూ ఇక్కడి నేలలే మూలం. ప్రపంచమంతా ప్రస్తుతం తినే అనేక ఆహార పదార్థాల ఎంపికా, ఉత్పత్తీ ఆసియాలోనే మొదలయ్యాయి. జంతువుల మచ్చికా ఇక్కడే ప్రారంభమైంది. రాజ్య వ్యవస్థలు ఉనికిలోకి వచ్చిందీ ఇక్కడే. అనేక విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతిక పరిజ్ఞానాలు ఆసియాలోనే ఊపిరి పోసుకున్నాయి.

ఇదంతా గతం! మనమంతా గర్వించతగిన ఘనమైన గతం! మరి భవిష్యత్తు ఏమిటి? యూరపు వలస పాలనతో అన్నింటా అట్టడుగుకు వెళ్లిన ఆసియాకు పూర్వ ప్రాభవం వచ్చేస్తోందా? ఆసియా దేశాలు చేస్తున్న ఉత్పత్తులు, సృష్టిస్తున్న సంపదలను డబ్బుగా లెక్కకట్టి చూస్తే అది సాధ్యమే అనిపించినా... దారి పొడవునా ఎన్నో సమస్యలు.. ఎన్నో ముళ్లదారులు.. సరిహద్దుల సంఘర్షణలు.. మత వైషమ్యాలు.. సైద్ధాంతిక స్పర్థలు.. జాత్యహంకార జాతీయవాదం విసురుతున్న సవాళ్లు.. వలసపాలన సృష్టించిన విపరీత కేంద్రీకృత పాలన.. ఇవన్నీ ఆసియా వాసుల మధ్య సంఘీభావానికీ సామరస్యానికీ ప్రతిబంధకాలు! క్రమేపీ అవి తొలగుతాయా? అసలు తామంతా ప్రగాఢ సంబంధాలతో కూడిన ఘనచరిత్ర కలిగిన ఆసియా ఖండ వారసులమన్న భావన ప్రజల్లో బలంగా ఎప్పుడైనా నాటుకుందా? అలా నాటుకునే పరిస్థితులు ఉన్నాయా? ఆసియా సమాజాల మధ్య సుదీర్ఘంగా కొనసాగిన ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి ఇప్పటి పరిస్థితుల్లో సాధ్యమవుతుందా? పాశ్చాత్య దేశాల ఆధిపత్యం సడలిపోతున్న నేపథ్యంలో ఆసియా దేశాల మధ్య ఒకనాటి వలసపాలనకు వ్యతిరేకంగా తలెత్తిన భావైక్యతా ధోరణులలో మిగిలింది ఎంత? ఉన్నదాంట్లో ఇప్పటికీ అభివృద్ధి చేయగలిగిన దెంత? మతం, భాష, జాతి ఆధారంగా యూరపులో ఏర్పడిన జాతి రాజ్య (నేషన్ స్టేట్) భావన రగిల్చిన దారుణాలను దాటి.. భిన్న భాషలు, మతాలు, సంస్కృతులను అవలంబించే ప్రజలను సమాన పౌరులుగా చూసే దృష్టి ఆసియాలో మళ్లీ బలంగా వేళ్లూనుకుంటుందా? లేక మైనారిటీలను అణచివేసి ఏక జాతి ప్రాబల్య రాజ్యాలను స్థాపించిన యూరపు తరహా చరిత్ర ఆసియాలోనూ పునరావృతం అవుతోందా? ఈ ప్రశ్నలన్నీ ఎంతో కీలకమైనవి.

ఆసియాలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వీటికెలాంటి జవాబులు ఇవ్వగలమన్నదే గాక భవిష్యత్తు పరిణామాలను స్థూలంగా సూచిస్తూ... ప్రముఖ చరిత్రకారుడు సుగత బోస్ 'ఏషియా ఆఫ్టర్ యూరోప్' పేరుతో ఇటీవలే ఒక పుస్తకాన్ని వెలువరించారు. సుగత బోస్ అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న చరిత్రకారుడే కాదు... ప్రత్యక్ష రాజకీయాల్లోనూ అనుభవాన్ని గడించారు. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు (2014–2019) ఎన్నికయ్యారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ పెద్దన్నకు మనవడైన సుగతది బెంగాల్‌లో పేరున్న రాజకీయ కుటుంబం. సుగత బోస్ తల్లి కృష్ణబోస్ కూడా మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. క్రియాశీల రాజకీయాల్లో ఉండి తిరిగి చరిత్ర అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా అమెరికాలో కృషిచేయటం రాజకీయాల్లో అరుదనే చెప్పాలి.



జాతీయ ప్రయోజనాల పేరుతో చైనా ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద పోకడలు, భారత్‌లో బలపడుతున్న ఏక మతాధిపత్య ఉన్మత్తత, పలుచోట్ల పెచ్చరిల్లుతున్న అతివాద ఇస్లాం రాజకీయాలు ఆసియా ఐక్య భావనకు ప్రమాదంగా మారాయి. 1800లకు ముందు ఆసియాలో ఏక కేంద్ర ఆధిపత్య నాగరికత లేదు. భిన్న కేంద్రాల నాగరికతల మధ్య ఇచ్చిపుచ్చుకోవటాలు ఉండేవి. ఒక రాజ్యం లోపల కూడా అధికారం భిన్నస్థాయిల్లో వికేంద్రీకరణగా ఉండేది. ఈ చారిత్రక వాస్తవాన్ని ఆసియా దేశాలు గ్రహించి అడుగులు వేస్తేనే 21వ శతాబ్దం సుహృద్భావ ఆసియా శతాబ్దంగా మారుతుంది.



■ రాహుల్ కుమార్

ప్రపంచ వస్తుసేవల ఉత్పత్తిలో 1820ల నాటికి కూడా భారత్, చైనాల వాటా 50 శాతం ఉండేది. 1913 వచ్చేసరికి అది 18 శాతానికి పడిపోయింది. జపాన్ ఒక్కటే దీనికి కాస్త మినహాయింపు. ఆసియా అంతటా చవిచూసిన ఆ క్షీణత వ్యక్తుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. అంతకంటే ఎక్కువగా ఆసియా వాసులు అందరిలోనూ తీవ్ర ఆత్మన్యూనతకు కారణమైంది. యూరపు వాసులకంటే ఎంతో ప్రాచీన చరిత్రనూ నాగరికతనూ కలిగిన తమకెందుకీ దుస్థితి.. అన్న భావన ఆలోచనాపరులను కలచివేసింది. ఈ నేపథ్యం నుంచి ఆసియా దేశాల మధ్య ఐక్యత నెలకొనాలనే భావమే గాక, చారిత్రకంగా పెనవేసుకున్న వాణిజ్య బంధాలు, సంస్కృతుల్లోని సారూప్యతలపై మేధోమథనం మొదలైంది. 1904–1905 యుద్ధంలో రష్యాపై జపాన్ గెలవటం ఆసియాలో సృష్టించిన ప్రభావం అంతా ఇంతా కాదు. బాలగంగాధర్ తిలక్ మొదలుకుని ఎంతో మంది దాన్ని ఘనంగా స్వాగతించారు. ప్రత్యక్ష, పరోక్ష వలస పాలనతో ఆసియా వాసులు పోగొట్టుకున్నవన్నీ క్రమేపీ సాధించగలరన్న భరోసాని ఆ యుద్ధం ఎంతో కొంత కలగచేసింది. 1917 నాటి రష్యను విప్లవం జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని ప్రకటించటం ఆసియా ప్రజలను బాగా ప్రభావితం చేసింది. వలసపాలనలో మగ్గుతున్న ప్రజలకు మార్క్సిస్టు ఆలోచన సామ్రాజ్యవాదంపై కొత్త చూపును కల్పించింది. 1890ల నుంచి 1950ల చివరి వరకూ ఆసియా–ఆఫ్రికాల మధ్య సంఘీభావం, స్నేహం, సహకారం కోరుకుంటూ... ఎన్నో చర్చలు, సమావేశాలు, పర్యటనలు ఎడతెరిపి లేకుండా సాగాయి. పరస్పరం ఇచ్చిపుచ్చుకునే సహకార దేశాల సమాహారంగా ఆసియా ఖండాన్ని ఊహించటం, భావించటం మొదలైంది. ఆ ఊహకూ, ఆ భావనకూ మూలాలను, వాటిని వినిపించిన నేతలు, మేధావులు, కళాకారుల కృషిని ప్రధానంగా సుగత బోస్ విశ్లేషించారు. ఈ మొత్తం పరిణామంలో.. ఆసియా ఆకాంక్షలకు భిన్నంగా జపాన్ సామ్రాజ్యవాద విధానంతో సమీప దేశాలను ఆక్రమించటం ఒక విపరీతంగానే మిగిలిపోయింది. రవీంద్రనాథ్ టాగోర్ అయితే .. యూరపు దేశాల గుడ్డి అనుకరణ ప్రభావానికి లోనై జపాన్ చేసిన దారుణంగా దాన్ని పరిగణించారు. జపాన్ నుంచి స్ఫూర్తి– విరక్తి రెండూ ఏకకాలంలో కలుగుతోందన్న భావాన్ని టాగోర్ వ్యక్తపరిచారు.

1950ల నాటికి ఆసియాలోని చాలా దేశాలకు ప్రత్యక్ష వలసపాలన నుంచి విముక్తి కలిగింది. 1955లో ఇండొనేషియాలో బాండుంగ్ సమావేశంలో ఆసియా–ఆఫ్రికా దేశాలు పరస్పర సహకారం గురించి, పరోక్ష వలసపాలనను ఎదుర్కోవల్సిన అవసరాన్ని గురించి చాలా మాట్లాడాయి. ఆ తర్వాత కొద్దికాలానికే ఆసియా దేశాల మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయి. అమెరికా–రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం విభేదాలను బాగా పెంచింది. వలసపాలకులు తమ అవసరాల కోసం ఆసియా దేశాల సరిహద్దులను అసంబద్ధంగా నిర్ణయించటం శాపమై భారత్–చైనాల మధ్య యుద్ధానికి కారణమైంది. జాతి ప్రయోజనాల పేరుతో.. వలసపాలకులు గీసిన పటాల్లో (మ్యాప్స్) నిర్దేశించిన సరిహద్దుల కోసం పట్టువిడుపుల్లేకుండా వ్యవహరించటం.. వలస పాలన వారసత్వంగా వచ్చిన విపరీత కేంద్రీకృత పాలనను యథాతథంగా స్వీకరించి మైనారిటీల ఆకాంక్షలనూ వెనుకబడిన ప్రాంతాలనూ విస్మరించటంతో చాలా చోట్ల ఏదో ఒక స్థాయిలో అంతర్యుద్ధాలు, యుద్ధాలు ఆసియా ఖండాన్ని కుదిపివేశాయి.

ఇదంతా ఎందుకు జరిగింది? ఆసియా ఐక్యభావన ఏమైపోయింది? పరస్పర సహకార భూమిగా ఆసియా ఖండాన్ని ఊహించటం కాల్పనిక భావనేనా? వాస్తవికతకు దూరమైన భావుకతగానే దీన్ని పరిగణించాలా? సుగత బోస్ అభిప్రాయం ప్రకారం అంతగా నిరాశపడాల్సిన అవసరం లేదు. రెండు ప్రపంచ యుద్ధాలకూ అంతకు ముందు మరెన్నో వినాశనాలకూ కారణమైన యూరపు రాజ్యాలు.. పరస్పరం సహకారానికి యూరోపు యూనియన్‌గా సంఘటితమై ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆసియా దేశాల మధ్య అలాంటి ఏర్పాటు ఎప్పటికీ సాధ్యం కాదని చెప్పేయలేం! ఉప్పునిప్పుగా ఉన్న భారత్–చైనా సంబంధాలకూ ఇదే వర్తిస్తుంది. అందుకు కావాల్సిన స్ఫూర్తిని.. ఆసియా మేధావులు, నాయకులు, సాహిత్యవేత్తలు, కళాకారులు చేసిన కృషి నుంచి ఎంతైనా పొందొచ్చు. దీనికి తోడు 1979 నుంచి ఆసియా దేశాల మధ్య వ్యాపార సంబంధాలు బాగా బలపడుతున్నాయి. ఆసియా అంతర్జాతీయ వాణిజ్యంలో 50 శాతానికి పైగా ఖండంలోని దేశాల మధ్యనే జరుగుతోంది.. భవిష్యత్తులో ఇదింకా పెరగనుంది. దీనికి భిన్నమైన మరొక పరిణామం కూడా జరుగుతోంది. అమెరికా, యూరపులు తమ చుట్టూ రకరకాల గోడలను కట్టుకుంటూ ఆసియా తాకిడిని అడ్డుకోటానికి ప్రయత్నిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ లాంటి నేతల వైఖరులే దీనికి నిదర్శనం.

ఆర్థిక శాస్త్రానికి ఆద్యుడైన ఆడంస్మిత్ 250 ఏళ్ల క్రితం భవిష్యత్తుకు సూచికగా ఒక వ్యాఖ్యానం చేశారు. విజేత యూరపు రాజ్యాలు, పరాజిత పాశ్చాత్యేతర రాజ్యాల మధ్య ఒకనాటికి రాజ్యాధికారపరంగా సమతూకం ఏర్పడుతుందనీ, అప్పుడు సమానత్వం ప్రాతిపదికగా ప్రపంచ మార్కెట్ పనిచేస్తుందని చెప్పటమే దాని పరమార్థం. ప్రత్యక్ష వలసపాలన సమసిపోయినా అదిప్పటికీ పూర్తిగా సాధ్యమైందని చెప్పలేం. బలహీన రాజ్యవ్యవస్థలు ఉన్నచోట పేద దేశాల వనరులను కొల్లగొట్టటం ఆగలేదు. జాతీయ ప్రయోజనాల పేరుతో చైనా ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద పోకడలు, భారత్‌లో బలపడుతున్న ఏక మతాధిపత్య ఉన్మత్తత, పలుచోట్ల పెచ్చరిల్లుతున్న అతివాద ఇస్లాం రాజకీయాలు ఆసియా ఐక్య భావనకు ప్రమాదంగా మారాయి. 1800లకు ముందు ఆసియాలో ఏక కేంద్ర ఆధిపత్య నాగరికత లేదు. భిన్న కేంద్రాల నాగరికతల మధ్య ఇచ్చిపుచ్చుకోవటాలు ఉండేవి. ఒక రాజ్యం లోపల కూడా అధికారం భిన్నస్థాయిల్లో వికేంద్రీకరణగా ఉండేది. ఈ చారిత్రక వాస్తవాన్ని ఆసియా దేశాలు గ్రహించి అడుగులు వేస్తేనే 21వ శతాబ్దం సుహృద్భావ ఆసియా శతాబ్దంగా మారుతుంది. దానికి భిన్నంగా గుడ్డి అనుకరణ దృష్టితో యూరోపు మార్గం తొక్కితే రక్తసిక్త చరిత్ర పునరావృతం అవుతుంది!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సదస్సు

గత నెలలో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు యం.ఆర్.పి.ఎస్ చేసిన మూడు దశాబ్దాల ఉద్యమ పోరాట విజయం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని ఈ తీర్పు స్పష్టం చేసింది. అయితే ఈ వర్గీకరణ ఎలా చేయాలనే అంశానికి సంబంధించి ఎలాంటి తీర్పూ ఇవ్వలేదు. మార్గదర్శకత్వం కూడా చేయలేదు. పైగా ఈ కేసుకు సంబంధంలేని అంశంలోకి వెళ్లి ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని చెప్పింది. ఇది తీవ్ర అన్యాయమైనది. కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాగేసుకున్న చందంగా మొత్తం రిజర్వేషన్లకే ఎసరుపెట్టే మార్మికత ఈ తీర్పులో దాగి ఉంది. ఈ రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ఒక పాలసీని గైడ్ చేసి అమలు చేయమని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాల్సిన సుప్రీంకోర్టు కేంద్రాన్ని మినహాయించి రాష్ట్రాలపైకి విభజన అమలును నెట్టడం అంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలలో రిజర్వేషన్లను నిరాకరించడమే. ఇలా చేయడం తగదు. ఈ తీర్పు నేపథ్యంలో మరోమారు మాల సోదరులు వర్గీకరణ వ్యతిరేక పోరాటాన్ని కొనసాగించే అవకాశం ఉంది. డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ బోధించిన సామాజిక న్యాయ సిద్ధాంతానికి లోబడి ఎటువంటి ప్రయత్నాన్నైనా ఆపాలి. మాదిగ సోదరులు కూడా సంయమనాన్ని పాటించాలి. ఇప్పటికైనా అన్ని వర్గాల మేధావులు, నాయకత్వాలు కూర్చొని ఒక న్యాయమైన పరిష్కారాన్ని రూపొందించుకోవాలి. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై తీర్పును స్వాగతిస్తున్నాం. క్రీమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. కుల జన గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించకపోవడాన్ని తప్పుబడుతున్నాం. ఈ సందర్భంగా నేటి మధ్యాహ్నం ఒంటిగంటకు దళిత మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరగనున్నది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో బత్తుల వెంకన్న అధ్యక్షతన జరిగే ఈ సభకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్య అతిథి. ప్రొ. కాశీం, వైకె., డా. ఎం.ఎఫ్ గోపీనాథ్, సాదు మాల్యాద్రి ప్రధానవక్తలు.

–బహుజన మహాసభ రాష్ట్ర కమిటీ, తెలంగాణ

మున్నేరు బీభత్సానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందా?

ఖమ్మం నగరాన్ని ముంచెత్తిన మున్నేరు వరద అటు పాలకులకు, ఇటు ప్రజలకు ఎన్నో పాఠాలను చెప్పింది. ఒక్క రోజులో 20 వేల మందిని నిరాశ్రయులను చేసి, రూ.200 కోట్ల నష్టాన్ని మిగిల్చింది. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు నిలువెల్లా వణికించింది. దిద్దుబాటు చర్యలు తీసుకోకుంటే ఖమ్మం నగర మనుగడకు ముప్పు తప్పదనే హెచ్చరికను జారీ చేసింది. మున్నేరు వరద బీభత్సం కేవలం ప్రకృతి విపత్తు మాత్రమే కాదు, అది స్వయంకృతం కూడా. చెరువులు, కుంటలు, ఏర్లను కబ్జా చేసి వాటిల్లో ఇండ్లు కట్టుకోవడం, ఆనక వర్షాకాలంలో అవి మునకకు గురైన తర్వాత గగ్గోలు పెట్టడం, సహాయక చర్యల పేరుతో ప్రభుత్వాలు కోట్లు వెదజల్లడం కొన్నేళ్లుగా రొటీన్ ప్రక్రియగా మారిపోయింది. హైదరాబాద్‌లో 'హైడ్రా' ఏర్పాటైన తర్వాత జలవనరుల ఆక్రమణల బాగోతాలు ఇంకా స్పష్టంగా బయటపడుతున్నాయి.

ఖమ్మంలో మున్నేరుదీ ఇదే పరిస్థితి. ఇది నదిని పోలిన వాగు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 16 మండలాల్లో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6 మండలాల్లో ఇది విస్తరించి ఉంది. ఖమ్మంలో చినుకు పడకున్నా, ఎగువన ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే.. ఖమ్మంలో మున్నేరు ఉప్పొంగుతుంది. ఖమ్మం నగరానికి దక్షిణ భాగంలో దాదాపు 13 కి.మీ. ప్రయాణం సాగించి చింతకాని, ముదిగొండ మండలాల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. కీసర వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఖమ్మం నగరంలో మున్నేరు నదికి ఇరువైపులా అనేక కాలనీలు విస్తరించి వున్నాయి. వర్షాకాలంలో ఉప్పొంగే మున్నేరు.. మిగతా కాలాల్లో పిల్ల కాలువలా ప్రవహిస్తుంది.

గత 25 ఏళ్ల ప్రవాహ ఉధృతి లెక్కలను పరిశీలించినప్పుడు మున్నేరు ఖమ్మం వద్ద ఏటా సగటున 33 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుంది. అయితే ఈ ఏడాది ఎగువన కురిసిన భారీ వర్షాలతో అనూహ్యంగా 36 అడుగుల ఎత్తులో పోటెత్తడం, అదే సమయంలో ఖమ్మం నగరంలో 15 సెం.మీ. వర్షం కురవడంతో వరద సునామీలా విరుచుకుపడింది. నదికి ఇరువైపులా కిలోమీటరు మేర వరదనీరు నగరంలోకి చొచ్చుకువెళ్లింది. మునుపెన్నడూ ఎరుగని ప్రాంతాలు కూడా వరద తాకిడికి లోనయ్యాయి. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో 18 డివిజన్లు పూర్తిగా వరద తాకిడికి గురయ్యాయి. మరో 5 డివిజన్లు పాక్షికంగా వరదపోటుకు లోనయ్యాయి. దాదాపు 24 కాలనీల్లో జనం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 6వేల ఇండ్లు మునకకు గురయ్యాయి. 20వేల మంది నిరాశ్రయులయ్యారు. విలువైన వస్తువులు వరదపాలు కాగా, వేలాదిమంది బడుగుల ఆవాసాలు ధ్వంసమయ్యాయి. కాలనీల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు పూర్తిగా పాడైపోయాయి. వరద తాకిడికి గురైన ఒక్కో ఇంటికి సగటున రూ.2లక్షల వరకు నష్టం జరిగినట్టు అంచనా.

ఖమ్మం నగరంలోని మున్నేరు నదీ తీరాన్ని పరిశీలించినప్పుడు ఇరువైపులా పేదల ఇళ్లు పెద్దసంఖ్యలో కనిపిస్తాయి. మున్నేరు పొంగినప్పుడల్లా వరద నీరు ఇంట్లోకి రావడం వీరికి దశాబ్దాలుగా అనుభవమే. ఆర్థిక స్తోమత లేక వీరు అక్కడే జీవించడానికి అలవాటుపడ్డారు. వాస్తవానికి మున్నేరుకు ఇరువైపులా వున్న బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధం. నది మధ్య భాగం నుంచి 50 మీటర్ల వరకు నిర్మాణాలు నిషిద్ధం. కానీ అనేక సంవత్సరాల క్రితమే బఫర్‌జోన్‌లో వేలాది ఇండ్లు వెలిశాయి. వీటిలో అత్యధికం పేద, దిగువ మధ్య తరగతి వర్గాలకు చెందినవే. ఎలాంటి అనుమతులు లేకుండా చేసిన ఈ నిర్మాణాలకు అనంతర కాలంలో మునిసిపల్ కార్పొరేషన్ వారు ఇళ్ల నెంబర్లు కేటాయించారు. ఆయా వీధుల్లో డ్రెయినేజీలు, రోడ్లు నిర్మించారు. కరెంటు సరఫరాను అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఇండ్లల్లో జీవిస్తున్నవారు అక్కడి నుంచి కదలడానికి సుముఖంగా లేరు. ఇదే అదనుగా ఆర్థిక స్థితిమంతులు కూడా భారీ భవనాలు నిర్మించుకున్నారు. ఇలా కిలోమీటర్ల పొడవునా నదికి ఇరువైపులా నిర్మాణాలు చోటుచేసుకోవడంతో మున్నేరు వరద తాకిడి అనివార్యమైంది.

ప్రకృతి విపత్తులు ఊహించని స్థాయిలో ఉంటాయని చెప్పడానికి ఖమ్మం మున్నేరు వరద విలయమే సాక్ష్యం. ప్రవాహ స్థాయిని అధికారులు ఒక విధంగా అంచనా వేయగా, ఇప్పుడది అంచనాను మించిపోయింది. ఈ వరదల నుంచి ఖమ్మం నగరాన్ని రక్షించడానికి నిర్మించతలపెట్టిన రక్షణగోడలను తాజా విలయం ప్రశ్నార్థకం చేసింది.



ప్రకృతి విపత్తులు ఊహించని స్థాయిలో ఉంటాయని చెప్పడానికి ఖమ్మం మున్నేరు వరద విలయమే సాక్ష్యం. ప్రవాహ స్థాయిని అధికారులు ఒక విధంగా అంచనా వేయగా, ఇప్పుడది అంచనాను మించిపోయింది. ఈ వరదల నుంచి ఖమ్మం నగరాన్ని రక్షించడానికి నిర్మించతలపెట్టిన రక్షణగోడలను తాజా విలయం ప్రశ్నార్థకం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.690 కోట్ల అంచనా వ్యయంతో 8 కి.మీ. పొడవునా నదికి ఇరువైపులా 33 అడుగుల ఎత్తు, 3.3 మీటర్ల వెడల్పుతో గోడ నిర్మించడానికి నిర్ణయించి ఆర్నెల్ల క్రితం పనులు కూడా ప్రారంభించారు. మున్నేరు ప్రవాహం సగటున 30 అడుగుల మేర ఉంటోందన్న అంచనాతో రక్షణ గోడలకు శ్రీకారం చుట్టారు. అయితే మొన్నటి ప్రవాహం 36 అడుగుల పైనే ఉండటంతో అధికారులు నివ్వెరపోయారు. ఇప్పుడు పునరాలోచనలోపడ్డారు. రక్షణ గోడల రీడిజైన్‌పై అధ్యయనం చేసే బాధ్యతను నిపుణుల కమిటీకి అప్పగించారు. తాజా వరద పోటుతో రక్షణగోడలు ఏ మేరకు ఖమ్మం నగరాన్ని రక్షిస్తాయనేది ప్రశ్నగా మారింది. ఒకవేళ రక్షణ గోడలు నిర్మించినా.. వరదతో మున్నేరు ఉప్పొంగుతుంటే ఖమ్మం నగరంలోని వర్షపు నీరు మున్నేరులో ఎలా కలుస్తుందని, బ్యాక్‌వాటర్ సమస్యతో నగరంలోని కాలనీలు జలమయం కావా.. అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలను నిపుణులు సూచిస్తున్నా అవి ఏ మేరకు ఆచరణలో ఫలితాలను ఇస్తాయో తెలియదు. వరదల సమయంలో తీవ్రంగా చర్చకు వచ్చే మున్నేరు రెస్క్యూ అంశాలు ఆ తర్వాత మరుగున పడిపోవడం రివాజుగా మారింది.

మున్నేరు వరదల విలయంలో చిక్కుకోవడం ఖమ్మం నగరానికి తరుచూ అలవాటుగా మారినా, శాశ్వత పరిష్కారాలు మాత్రం ఇప్పుడప్పుడే కనిపించే పరిస్థితులు లేవు. ఈ నదీతీరం నుంచి ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి శాశ్వత పునరావాస చర్యలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ అది అంత సులభం కాదు. మున్నేరు తీరంతో ఇక్కడి ప్రజల బతుకులు ముడివేసుకొని వున్నాయి. పేదరికం, బతుకుదెరువు, స్థానికత, అస్తిత్వం, సౌలభ్యాలు లాంటి అంశాలు వాటిల్లో ముఖ్యమైనవి. ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైనవారు మళ్లీ అక్కడికే వెళ్లవద్దని, మెరక ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరదబాధితులకు చర్వితచరణంగా చెబుతున్నారు. కానీ వారి నుంచి అంత సానుకూల స్పందన కనిపించడంలేదు.

మున్నేరు అక్రమ నిర్మాణాలను రాజకీయ నేతలు ఓట్ల కోసం వాటిని ప్రోత్సహించగా, అధికారులు అవినీతి యావలో నిద్ర నటించారు. మున్నేరుతో సహవాసం చేసే వారికి వరద విలయాలూ ప్రళయాలూ తమ జీవనంలో ఒక భాగంగా మారినట్టు కనిపిస్తుంది. కటిక చీకటిలో వరద ముంచెత్తినా రెస్క్యూ బృందాలు రాకముందే ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ఎవరికి వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ప్రాణాలు నిలుపుకుంటూ ఇక్కడ జనం బతకడానికి అలవాటుపడిపోయారని చెప్పడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏమి కావాలి!? రక్షణ గోడల గురించి, ప్రత్యామ్నాయ శాశ్వత పునరావాస చర్యల గురించి వారు ఆలోచించడం లేదు. వారి దృష్టంతా ఇప్పుడు తమ జీవితాలను తిరిగి ఎలా మొదలుపెట్టాలనే దానిపైనే ఉంది. ముమ్ముందు ఖమ్మం నగరానికి మున్నేరు ఎలా పరిణమిస్తుందో కాలమే చెప్పాలి.

■ శంకర్‌రావు శెంకేసి
(సీనియర్ జర్నలిస్టు)





'స్టేషన్'లో టెన్షన్!

'ఫిరాయింపు'లపై చర్యలకు హైకోర్టు ఆదేశాలతో సర్వత్రా ఉత్కంఠ

- కోర్టు తీర్పుతో ఉపఎన్నికపై అన్ని పార్టీల్లో విస్తృత చర్చ
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- హస్తం కండువా కప్పుకొన్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం
- డివిజన్ బెంచ్‌ను అప్పీలు చేసే యోచనలో ఎమ్మెల్యేలు
- హీటెక్కుతున్న ఓరుగల్లు రాజకీయాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గెలిచిన తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోపు చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సూచించింది. దీంతో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో పాటు దానం నాగేందర్‌పై ఫిరాయింపుల చట్టం ప్రకారం చర్యలుంటాయని ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి. ఈ క్రమంలో సదరు ఎమ్మెల్యేలు డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేసేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధం కావడంతో పాటు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు. ఫిరాయింపులపై చర్యలకు హైకోర్టు ఆదేశించిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని స్టేషన్‌ఘనపూర్, భద్రాచలం ఎమ్మెల్యేలు ఉండటం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా సీనియర్ నేత అయిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా పార్టీ మారిన నేపథ్యంలో 'స్టేషన్' ఘనపూర్ నియోజకవర్గంలో టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంప్..

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం శ్రీహరి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన శనిగపురపు ఇందిరపై విజయం సాధించారు. అయితే ఈ ఏడాది మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తన కుమార్తె కడియం కావ్యను వరంగల్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దించేందుకు కడియం శ్రీహరి ప్రయత్నాలు చేశారు. మార్చి 14వ తేదీన నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య పేరును గులాబీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే అనూహ్యంగా కడియం శ్రీహరి పార్టీలో తమకు ఎవరూ సహకరించటం లేదని, లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ కావటం ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటూ తన కుమార్తెతో పాటు మార్చి 28వ తేదీన బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. మరుసటి రోజే సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కడియం అనుకున్నట్లుగానే తన కుమార్తె కడియం కావ్యకు వరంగల్ ఎంపీగా టికెట్ ఇప్పించుకుని.. గెలిపించుకుని, తన వారసురాలిని రాజకీయ ప్రవేశం చేయించారు. ఇక ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలు ప్రస్తుతం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఇక్కడి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తొలుత బీఆర్ఎస్‌లో కీలక నేత. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే 2023లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు తెల్లం వెంకట్రావు కూడా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. నామినేషన్ల సమయంలో మనసుమార్చుకుని తిరిగి గులాబీ గూటికి చేరి భద్రాచలం టికెట్ దక్కించుకుని విజయం సాధించారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవటంతో పాటు తన గురువు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో తెల్లం కూడా క్రమంగా కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో పార్టీ మారిన కడియం శ్రీహరితో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

హైకోర్టు ఆదేశాలతో ఉత్కంఠ

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని, లేదంటే తామే సుమోటాగా స్వీకరించి చర్యలు తీసుకుంటామని హైకోర్టు సోమవారం అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయటం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అయితే కోర్టు ఆదేశాలపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు సన్నద్ధం అవుతున్నారు. కోర్టు ఆదేశాలకు సంబంధించిన కాపీలు అందలేదని, రాగానే న్యాయ నిపుణులతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కీలక నేతగా ఉన్న కడియం శ్రీహరి స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం నుంచి పాతినిధ్యం వహిస్తుండగా హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాజకీయ ప్రాధాన్యత పెరిగింది. కాగా, ఓరుగల్లులో హైకోర్టు తీర్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ నేతలు మాత్రం హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కాబట్టి, డివిజన్ బెంచ్‌కు, సుప్రీం కోర్టు వరకు వెళ్లవచ్చునని, అంతేకాకుండా స్పీకర్ నిర్ణయం కూడా కీలకం కావటంతో ప్రతిపక్షాలు ఊహించిందేదీ జరగదని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాత్రం స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉపఎన్నికలు ఖాయమని, హైకోర్టు ఆదేశాలు హర్షణీయమని ప్రకటనలు చేస్తున్నారు.



తెల్లం వెంకట్రావు
ఎమ్మెల్యే, భద్రాచలం

స్టేషన్‌లో ఢీ అంటే ఢీనే

స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గానికి ఉపఎన్నికలు వచ్చినా.. రాకపోయినా కడియం శ్రీహరి బలమైన ప్రత్యర్థిని నిలిపేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరక ముందే, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌కు

మిగతా 7వ పేజీలో..

న్యాయ నిపుణులతో చర్చిస్తున్నాం..

- కడియం శ్రీహరి, ఎమ్మెల్యే

"హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కాపీలు ఇంకా అందలేదు. కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నాం. వారి సలహాల మేరకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం. సింగల్ జడ్జి తీర్పే కాబట్టి, డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయాలని అనుకుంటున్నాం. అవసరమైతే సుప్రీం కోర్టు వరకు వెళ్లే అవకాశాలున్నాయి. స్పీకర్ కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే బీఆర్ఎస్ నేతలు అతిగా స్పందించటం సిగ్గు చేటు. 2014 నుంచి 2023 వరకు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు ప్రోత్సాహించి చేర్చుకున్న బీఆర్ఎస్ ఫిరాయింపులపై మాట్లాడటం సిగ్గు చేటు. టీడీపీ, వైసీపీ, సీపీఐ శాసనసభా పక్షాలను విలీనం చేసుకున్న నీచ చరిత్ర బీఆర్ఎస్‌ది. హైకోర్టు తీర్పుతో ఏదో అయిపోయిందని, అప్పుడే ఉపఎన్నిక వచ్చిందనేలా సంబరాలు చేసుకోవటం బీఆర్ఎస్ దిగజారుడు తనానికి నిదర్శనం. ఏదీ ఏమైనా న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది."



కాళోజీకి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి

- జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 9 : ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు ఆయన జయంతి సందర్భంగా ఓరుగల్లు ఘన నివాళులర్పించింది. ఒకవైపు వర్షం పడుతున్నా లెక్కచేయకుండా హనుమకొండలోని కాళోజీ కాంస్య విగ్రహానికి వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, పి.ప్రావీణ్యతో పాటు అనేక మంది జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో, బీఆర్ఎస్ జిల్లా కార్యాల యంలో ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్‌తో పాటు వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ తదితర నాయకులు నివాళులర్పించారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కాళోజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఆయన సాహిత్యాన్ని విద్యా ర్థులకు వివరించారు. మర్కజీ పాఠశాలలో పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ డాక్టర్ కె.వాసు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వల్స పైడి, శ్రీనివాస్‌రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, పద్మావతి, రమాదేవి, వేణుగోపాల్, కిరణ్‌కుమార్, కాంతయ్య, వీరస్వామి తదితర ఉపాధ్యాయులు కాళోజీ జీవిత చరిత్రను వివరించారు. కాళోజీ ఫౌండేషన్ పక్షాన ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు, పందిళ్ల అశోక్, తదితరులు కాళోజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కాకతీయ విశ్వ విద్యాలయంలో కూడా కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కూడా కాళోజీ జయంతి వేడుకలు జరిగాయి.

కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించిన కాళోజీ కుటుంబ సభ్యులు

బాలసముద్రం : హనుమకొండ బాలసముద్రంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కాళోజీ కళాక్షేత్రాన్ని సోమవారం కాళోజీ నారాయణరావు కుటుంబసభ్యులు సందర్శించారు. కాళోజీ పేరుతో అతిపెద్ద కళాక్షేత్రం నిర్మించడం పట్ల కాళోజీ మనువడు సంతోష్ దంపతులు హర్షం వ్యక్తం చేశారు. వారి వెంట సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, కవులు వీఆర్ విద్యార్థి, ఆగపాటి రాజ్‌కుమార్, పీ.శ్రీనివాసరావు, తాటిచెర్ల రవి, హోమియో వైద్యుడు వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ కళాక్షేత్రం వద్ద కాళోజీ కుటుంబసభ్యులు

సమస్యల పట్ల చిన్నచూపు వద్దు

- పరిష్కరించి ప్రజల్లో నమ్మకం కలిగించాలి
- ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్య



వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 9 : ప్రజావాణి సమస్యలను చిన్నచూపు చూడొద్దని... ప్రజావాణికి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు నమ్మకం కలిగించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులకు సూచించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం వర్షంలోనూ బాధితులు వచ్చి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఓపికగా వారి సమస్యలు విని సంబంధిత అధికారులను పిలిచి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల నుంచి ప్రజావాణికి 92 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి అధికంగా 11 దరఖాస్తులు వచ్చాయి. తర్వాత పరకాల ఎంపీడీవో కార్యాలయానికి 7, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 6, వ్యవసాయ కార్యాలయానికి, ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయానికి, పరకాల ఆర్డీవో కార్యాలయానికి 5 చొప్పున, ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయానికి, ఎంజీఎం ఆసుపత్రికి 4చొప్పున దరఖాస్తులు రాగా మిగతా శాఖలకు ఒకటి, రెండు, మూడు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. సమస్యలపై కలెక్టరేట్ ప్రజావాణికి వచ్చే బాధితులకు వెంటనే న్యాయం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమస్యలు పరిష్కరిస్తేనే అధికారులు, ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ నారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

- ఆర్థిక సంఘ సమావేశంలో మేయర్ సుధారాణి



ఆర్థిక సంఘం సమావేశంలో పాల్గొన్న గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 9 : వరంగల్ నగర అభివృద్ధికి 16వ ఆర్థిక సంఘం నుంచి రూ. 4500 కోట్లు కేటాయించాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. సోమవారం హైదరాబాద్ ప్రజా భవన్‌లో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్న సమావేశంలో మేయర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ అభివృద్ధి చెందే ప్రాంతంగా ముందు వరుసలో ఉందని వరంగల్ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. వరంగల్ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని గుర్తు చేశారు. వరంగల్ నగరంలో ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లేకపోవడంతో ప్రజారోగ్యం, పారిశుధ్యంపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. రూ.4000 కోట్ల అంచనాల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ కోసం డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించామన్నారు. అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రతీ సంవత్సరానికి వెయ్యి కోట్లు అభ్యర్థిస్తున్నామన్నారు. బయోమైనింగ్ ప్లాంట్ స్థాపన కోసం రూ.1000 కోట్లు అవసరం ఉందన్నారు. ఆర్థిక సంఘం సహకరిస్తే వరంగల్ నగరాన్ని మరింత సుందరీకరిస్తామన్నారు.

ఈ సమావేశంలో ఫైనాన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీడీఎంఏ గౌతం, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పలు జిల్లాల మేయర్లు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

రాంనగర్, సెప్టెంబరు 9 : హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌పై అసెంబ్లీ స్పీకర్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పీకర్ వద్ద ఉన్న పిటీషన్లపై విచారణ జరిగిందని, సుదీర్ఘ చర్చల అనంతరం నాలుగు వారాల్లోపు ఈ పిటీషన్‌పై స్పీకర్ చర్య తీసుకోవాలని లేదంటే తాము జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హైకోర్టు తెలిపిందన్నారు. 1985లో రాజీవ్ గాంధీ 52వ షెడ్యూల్ సవరణ ద్వారా పార్టీ మారే వారిపై అనర్హత వేటు వేయాలని చట్టం తెచ్చిందని, 39 ఏళ్ల క్రితం తెచ్చిన చట్టంలోని లొసుగులు ఉండటం కొందరికి ఉపయోగకరంగా మారిందన్నారు. హైకోర్టు నిర్ణయం మేరకు స్పీకర్ ఎవరి మాటలు వినకుండా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వినోద్‌కుమార్ సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, జోరిక రమేశ్, చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమల్లో కాంగ్రెస్ విఫలం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- 'పాలకుర్తి'లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి
- జనగామ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



- 7లో..



లిక్కర్ మాఫియా

- అధిక లాభాల కోసం అడ్డదారులు
- బెల్ట్ షాపులకు మద్యం తరలింపు
- దృష్టి సారించని పోలీస్, ఎక్సైజ్ శాఖలు
- టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి బెల్టు దందా





వరంగల్ సాకరాసికుంటలో పట్టుకున్న మద్యం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 9 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లిక్కర్ మాఫియా అధిక లాభాల కోసం నయా దందాకు తెరలేపింది. లిక్కర్ షాపుల యజమానులు వారి పరిధిలోని పలు బెల్ట్ షాపుల నిర్వాహకులతో ఒప్పందం చేసుకుని దందాను కొనసాగిస్తున్నారు. మరికొన్ని చోట్ల లిక్కర్ షాపుల యజమానులే వారి మనుషులతో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అధిక లాభాల కోసం ఈ దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. కమిషనరేట్ పరిధిలోని పలు గ్రామాలతో పాటు వరంగల్‌లోని పలు కాలనీల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. లిక్కర్ షాపులకు మించి కొన్ని బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. బెల్ట్‌షాపుల్లో 24గంటలు మద్యం అందుబాటులో ఉంటుంది. మద్యం ధరలు మాత్రం లిక్కర్ షాపులకంటే అధికంగా ఉన్నాయి. రూ.150 ఉన్న బీరు రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తుంటారు. బ్లెండర్ స్ప్రైడ్ రూ.1600 వరకు ఉంటే బెల్ట్ షాపులో రూ.2000 వరకు తీసుకుంటారు. టీచర్స్ బ్లాక్ డాగ్ ఫుల్ బాటిల్ మద్యం షాపులో రూ.2200 వరకు ఉంటే బెల్ట్ షాపులో రూ.3వేల వరకు తీసుకుంటారని తెలిసింది. ఇలా బెల్ట్ షాపుల నిర్వాహకులు లిక్కర్ యజమానులతో చేసుకున్న ఒప్పందం మేరకు ఇష్టమున్న ధరలకు విక్రయిస్తుంటారని సమాచారం. బెల్ట్ షాపుల్లో విక్రయించే మద్యం ధరలకు అడ్డూ అదుపు లేకపోవడం విశేషం. వీరి దందాతో కూలీ చేసుకునే మద్యం ప్రియులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కాగా, బెల్ట్ షాపులపై దాడులు అనేవే జరుగవు. ఒకవేళ జరిగినా లిక్కర్ యజమానులు చూసుకుంటారనే ఆరోపణలున్నాయి.

దృష్టి సారించని పోలీస్, ఎక్సైజ్ శాఖలు

కమిషనరేట్ పరిధిలో విచ్చలవిడిగా బెల్ట్ దందా సాగుతున్నా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పోలీస్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది బెల్ట్ షాపులపై దాడులు చేసి లిక్కర్ స్వాధీనం చేసుకున్న ఘటనలు వేళ్ల మీద లెక్కించవచ్చు. ఈ రెండు శాఖల అధికారులకు లిక్కర్ మాఫియా నెలవారీగా కానుకలు అందిస్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వారు బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి చూడరనే ప్రచారం ఉంది. కమిషనరేట్ పరిధిలో బెల్ట్‌షాపులపై దాడులు చేసిన ఘటనలు సైతం టాస్క్‌ఫోర్స్ చేసినవే కావడం విశేషం. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసినప్పుడు పట్టుకున్న మద్యం నిల్వలు మొత్తం గమనిస్తే ఏ స్థాయిలో దందా సాగుతుందో గమనించవచ్చు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో పలు చోట్ల పట్టుకున్న మద్యం కేవలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నదే

మిగతా 8వ పేజీలో..

ఎంజీఎం మహిళా ఉద్యోగిపై దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

వరంగల్ మెడికల్/మట్టెవాడ, సెప్టెంబరు 9 : ఎంజీఎం ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ శానిటేషన్ మహిళా వర్కర్ సుమలతపై మరో మహిళా దాడి చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. సోమవారం మధ్యాహ్నాం సందడిగా ఉన్న సమయంలో బాధిత మహిళను గొలుసుతో కట్టేసేందుకు ప్రయత్నించిన సంఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నాం 1.30 గంటల సమయంలో విధులకు హాజరయ్యే క్రమంలో సుమలత బయోమెట్రిక్ వద్దకు చేరుకుంది. అదే సమయంలో ఎంజీఎంలో పనిచేసే ఓ యూనియన్ లీడర్ ఆలకుంట్ల రాజమ్మ అనే మహిళ సుమలతపై దాడికి దిగింది. గొలుసుతో కట్టేసేందుకు ప్రయత్నించింది. బాధిత మహిళా సెల్‌ఫోన్ పగలగొట్టి తీవ్రంగా గాయపర్చింది. బాధిత మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, విధులకు హాజరవుతున్న సుమలతపై దాడి జరగడాన్ని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

ఓరుగల్లు కళా శిఖరాల కార్యవర్గం ఎన్నిక

వడ్డెపల్లి, సెప్టెంబరు 9: ఓరుగల్లు కళా శిఖరాలు వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా జూపాక శివ, ప్రధాన కార్యదర్శిగా వాంకుడోత్ రమేష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల్లో కళాకారులు దారా దేవేందర్, డాక్టర్ వెన్నెల శ్రీనాథ్, వాజిద్ హుస్సేన్, పులుకుర్తి రాజేందర్, తాళ్ల సునీల్, గోల్కొండ బుచ్చన్న, కొండ సారంగపాణి, దేవునూరి వేణు, ఇనుగుర్తి మధు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌లో రక్తదాన శిబిరం

సుబేదారి, సెప్టెంబరు 9: హనుమకొండ సుబేదారి క్రాస్ రోడ్డులోని రెడ్‌క్రాస్‌లో ఎస్ఎస్ఎస్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు గుజ్జారి శ్రీధర్‌బాబు కుమారుడు యశోరాం పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ ఫౌండేషన్ వరంగల్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగవెల్లి నరేంద్ర ఆధ్వర్యంలో రక్తదాతలకు హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

రుణమాఫీకి రేషన్‌కార్డు లింకుపెట్టొద్దు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

ఐనవోలు, సెప్టెంబరు 9: రెండు లక్షల రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు లింకుపెట్టకుండా పాస్‌బుక్ ఆధారంగా మాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేసి, రైతు భరోసాడబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుటు ధర్నా నిర్వహించి డీటీ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎదుట రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రేషన్‌కార్డు లింకు పెట్టి కుటుంబానికి ఒకటి రుణమాఫీ చేస్తామని చెప్పడం రైతులను మోసంచేయడమేనన్నారు. రేషన్‌కార్డు కాకుండా పాస్‌పుస్తకాన్ని పరిగణలోకి తీసుకొని బుక్ పై రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సహాయం (రైతు బంధు) రైతు భరోసా సంవత్సరానికి ఎకరానికి రూ.15వేలు ఇస్తామని వానాకాలం పంటకు ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రూ.2లక్షల రుణమాఫీతోపాటు రైతు భరోసాను అందించి చిత్తశుద్ధిని చాటుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఏవో కార్యాలయంలో ఏవోను కలిసి రైతులను బ్యాంకులు, ఏవో కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు కొంకాల నారాయణరెడ్డి, గెండుకారి మహేందర్, మడిగ నాగరాజు, గుండెకారి బాబురావు, దీకొండ ఉప్పలయ్య, కొంకాల కవిత, గోపాల్‌రావు, చిన్న మహేందర్, శ్రీధర్, రాజిరెడ్డి, మోహన్‌రావు, రాజేందర్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మట్కా నిర్వాహకుడి అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 9 : ఖిలా వరంగల్‌కు చెందిన కె.హరీష్ అనే వ్యక్తి గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొర్రెకుంట ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో రూ.5 వేలు స్వాధీనం చేసుకుని నిర్వాకుడిని అదుపులోకీ తీసుకున్నారు. నిందితుడుని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం గీసుగొండ పోలీసులకు అప్పగించడం జరిగిందని పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 9 : ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటన్ మిల్లులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఎనమిది మంది పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించంగా ఒకరు పరారీ కాగా మిగతా ఏడుగురిని స్థానిక పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించడం జరిగింది. వారి నుంచి రూ.15వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

నకిలీ రిపోర్టర్లపై కేసు నమోదు


నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 9: రిపోర్టర్లమని చెప్పి టిప్పర్ డ్రైవర్‌ను బెదిరించి డబ్బులు లాక్కున్న ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ పీ సత్యనారాయణ రెడ్డి సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూశాయంపేటకు చెందిన వంగ సాయికృష్ణ, వరంగల్ గణేష్ నగర్‌కు చెందిన మహేష్, వరంగల్ కొత్తవాడ ఆటో నగర్‌కు చెందిన సందీప్, గణేష్ ఆదివారం సాయంత్రం న్యూ శాయంపేట శివారు రైల్వే ట్రాక్ సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో టిప్పర్ వెళ్తుండగా ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని తాము రిపోర్టర్లు, హ్యూమన్ రైట్స్ ఆఫీసర్లమని చెప్పి బెదిరించి అతడి జేబులో ఉన్న రూ. 400 లాక్కొని, డ్రైవర్ ఫోన్ పే నుంచి రూ. 1500 సాయికృష్ణ ఫోన్‌కు పంపించుకున్నారు. ఓనర్‌కు డ్రైవర్ ఫోన్ చేసి విషయం తెలపడంతో లారీ ఓనర్ సురేష్‌రావు కొంతమందిని తీసుకొని అక్కడికి వెళ్లాడు. వారిరాకను గమనించిన సాయికృష్ణ, మహేష్, సందీప్, గణేష్ అక్కడి నుంచి పారిపోయారు. సురేష్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు గాలిబ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 9: పోగొట్టుకున్న పర్సులోని నగదు, న్యూజీలాండ్ కరెన్సీ, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను బాధితుని తండ్రికి హనుమకొండ పోలీసులు సోమవారం అప్పగించారు. సీఐ వై. సతీష్ కథనం ప్రకారం. భూపాలపల్లికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు వారం రోజుల క్రితం హనుమకొండ చౌరస్తాలో పర్సును పోగొట్టుకున్నాడు. ఓ వ్యక్తికి పర్సు దొరకగా పోలీసులకు అప్పగించాడు. కాగా, పర్సులోని ఆధారాల ఆధారంగా అడ్రస్ తెలుసుకొని అతడి తండ్రికి పర్సులోని నగదు 23,440, కరెన్సీ, క్రెడిట్ కార్డ్స్ అప్పగించినట్లు సీఐ తెలిపారు.

న్యాయశాస్త్రంలో సుజాతకు డాక్టరేట్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9 : కాకతీయ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం పరిశోధకురాలు సుజాత టీసీ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి సుజాతకు సోమవారం డాక్టరేట్ ప్రకటించారు. 'ఇన్స్టిట్యూషన్ ఆఫ్ మ్యారేజ్ ఇన్ ఇండియా అండ్ మ్యాట్రిమోనియల్ రేమిడిస్ : ఏ స్టడీ విత్ రేఫరెన్స్ నాన్ రేసిడెంట్ ఇండియా (ఎన్ఆర్ఐ)మ్యారేజిస్ ఇన్ ఇండియా ' అనే అంశంపై న్యాయశాస్త్ర విభాగం డీన్, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్ పర్యవేక్షణలో సుజాత టీసీ పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. సుజాత టీసీ సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయశాస్త్ర కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ (పార్టుటైం)గా విధులు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రంలో అత్యుత్తమ ఇంజనీరింగ్ కళాశాలగా కేయూ

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9: రాష్ట్రంలోనే అత్యుత్తమ ఇంజనీరింగ్ కళాశాలగా కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపు పొందిందాని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. సోమవారం కేయూ క్యాంపస్‌లోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల 15వ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అత్యుత్తమ ఫలితాలతో కళాశాల ముందుకుసాగుతోందని చెప్పారు. కళాశాల విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందారని అభినందించారు. కళాశాల పూర్వ విద్యార్థులను, ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ మాట్లాడుతూ.. 2009లో నాలుగు బ్రాంచ్‌లతో షురూవైన 7 బ్రాంచ్‌లకు చేరిందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను మెమెంటోలతో సన్మానించారు.



పోరు తల్లి.. ప్రజాపోరాట స్ఫూర్తి

- భూస్వామ్యవ్యవస్థపై తిరగబడిన ఐలమ్మ
- ఉద్యమ నారి, తెలంగాణ తల్లిగా కీర్తి

నేడు ఐలమ్మ వర్ధంతి



ఐలమ్మ స్మారక స్థూపం

పాలకుర్తి, సెప్టెంబరు 9 : ఐలమ్మ ఆ పేరే ఒక ఉద్యమం. ప్రజాపోరాటానికి స్ఫూర్తి. అనేక పోరాటాలకు ప్రేరణగా నిలిచిన ఐలమ్మ తెలంగాణ తల్లిగా కీర్తినందుకుంది. నిజాం హయాంలో నియంతృత్వ పాలనపై తిరుగుబాటు చేసి.. భూ పోరాటాన్ని నిర్వహించి విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి ముచ్చెమటలు పట్టించిన చరిత్ర ఆమెది. వీర తెలంగాణ రైతాంగ విప్లవోద్యమంలో ఆమె వీరోచిత పోరాటాన్ని బడుగుజీవుల వేనోళ్ల గుర్తుంచుకుంటారు. అలాంటి ఉద్యమనారి ఐలమ్మ మరణించి 39ఏళ్లవుతున్నా ప్రజల మధ్య మాత్రం ఆమె బతికే ఉంది. సెప్టెంబర్ 10న జనగామ పోరుబిడ్డ చాకలి ఐలమ్మ వర్ధంతి సభలను తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక, మహిళ సంఘాలు నిర్వహించనున్నాయి.

మెట్టినగడ్డపై నుంచే పోరుబాట..

ఐలమ్మ పుట్టింది చాకలి కులంలో. కులవృత్తి చేసుకొని దొరలకు వెట్టి చేసి బతికే కుటుంబాల్లో ఐలమ్మ కుటుంబం ఒకటి. ఐలమ్మ ప్రస్తుత వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురంలో జన్మించింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి ఐలమ్మ కోడలుగా వచ్చింది. ఆమె వచ్చేనాటికి బానిస బతుకులు తప్ప ప్రశ్నించే రోజులు లేవు. కుల వృత్తిపై ఆధారపడి ఐదుగురు కొడుకులను, ఒక కూతురును పోషించుకునే పరిస్థితి లేకపోవడంతో ఐలమ్మ కుటుంబం వ్యవసాయం చేయాలని నిర్ణయించుకుని.. పాలకుర్తిలో మల్లంపల్లి మక్తేదారు కొండల్‌రావుకు చెందిన భూమిని కౌలుకు తీసుకొంది. ఈ క్రమంలో ఒక కుటుంబ బాధ్యత తెలిసిన మహిళగా కొండల్‌రావు తల్లి జయప్రదదేవి ఐలమ్మకు అండగా నిలిచి భూమిని కౌలుకు ఇచ్చారు. దాంతో ఐలమ్మ కుల వృత్తితో పాటు భర్త నర్సయ్య, అప్పటికే ఎదిగిన కొడుకులు సోమయ్య, లచ్చయ్య, ముత్తిలింగయ్య, లక్ష్మీనర్సయ్య, ఉప్పలయ్య, ఐలమ్మ భర్త నర్సయ్యకు ఒక తమ్ముడు సోమల్లయ్యతో కలిసి వ్యవసాయంలో విజయం సాధించి ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న నేపథ్యంలో భూస్వాముల నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. స్థానిక పోలీస్ పటేల్ వీరమనేని శేషగిరిరావుతో ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. ఐలమ్మ కౌలుకు తీసుకున్న భూమిలోకి వెళ్లాలంటే పోలీస్ పటేల్ భూముల్లోంచే వెళ్లాల్సి రావడంతో తొలుత తన పొలంలో పని చేశాకే తమ భూముల్లో పని చేసుకోవాలని శేషగిరిరావు వారిని ఆదేశించాడు. దాన్ని ధిక్కరించి మరీ ఐలమ్మ పంట సాగు చేసింది. ఇదే సమయంలో దొరలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలు చూసిన ఐలమ్మ కుటుంబం కమ్యూనిస్టుపార్టీలో చేరింది. సంఘం పేరుతో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఐలమ్మ చురుగ్గా పాల్గొనేది. ఇది చూసిన శేషగిరిరావు విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి ఐలమ్మపై ఫిర్యాదు చేశాడు. ఐలమ్మ వల్ల పాలకుర్తిలో ఉద్యమం బలపడుతోందని, స్థానికులైన జీడి సోమనర్సయ్య లాంటి యువకిశోరాలు దొరలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని తెలిపాడు. దీంతో ఐలమ్మను, పార్టీని విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు చేశారు. ఈ క్రమంలోనే 1945లో శివరాత్రి ఉత్సవాల సమయంలో పాలకుర్తిలో సభను పెట్టాలని కమ్యూనిస్టులు నిర్ణయించగా.. అది సక్సెస్ అయితే తమకు నూకలు చెల్లుతాయని, తమ ఆధిపత్యానికి గండి పడుతుందని గ్రహించిన దేశ్‌ముఖ్ గూండాలను పురమాయించాడు. వారు పాలకుర్తి వీధుల్లో తిరుగుతూ కమ్యూనిస్టు నాయకుడైన ఆరుట్ల రాంచంద్రారెడ్డిని చంపుతామని బహిరంగంగా హెచ్చరించారు. కమ్యూనిస్టు నాయకులు తమ సభకు, నాయకులకు రక్షణ కల్పించాలని కోరినా పోలీసులు నిరాకరించారు. తగిన బందోబస్తు లేదని చెప్పి దేశ్‌ముఖ్‌కు అనుకూలంగా వ్యవహరించారు. దీంతో పాలకుర్తిలో ఓ చోట సభ ప్రారంభం కాగనే దేశ్‌ముఖ్ గూండాలు అల్లరి సృష్టించారు. ఆరుట్లపై దాడికి దిగేలోపే ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఆ గూండాలపై ప్రతిదాడికి దిగి వారిని తరిమికొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆరుట్లను జాగ్రత్తగా మారు వేషంలో వావిలాలకు పంపారు. తమ అనుచరులను చంపే ప్రయత్నం చేశారని దేశ్‌ముఖ్ కుట్ర చేసి కేసు పెట్టించాడు. నాయకులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ నేపథ్యంలోనే ఐలమ్మ పండిస్తున్న భూమిని, పంటను కాజేయాలని దేశ్‌ముఖ్ తప్పుడు పత్రాలు సృష్టించి బెదిరించాడు. అప్పటికే ఐలమ్మ భర్త నర్సయ్య, కొడుకులు సోమయ్య, లచ్చయ్య కుట్ర కేసులో జైల్లో ఉన్నారు.



ఆనాటి విస్నూరు పోలీస్‌స్టేషన్ భవనం

భూస్వాముల ఎత్తులకు పైఎత్తులు..

ఒంటరిగా ఉన్న ఐలమ్మను దెబ్బతీస్తే అటు ఐలమ్మ కుటుంబం ఇటు కమ్యూనిస్టు ఉద్యమం దెబ్బతింటుందని భూస్వాములు ఎత్తులు వేశారు. ఐలమ్మ ధైర్యంతో ముందడుగేసి కమ్యూనిస్టు నాయకుల్ని కలిసింది. తమ భూమి సంబంధించిన వివాదాన్ని చెప్పింది. నల్లగొండ జిల్లా నాయకత్వం సీరియస్ తీసుకొని భూమి రక్షించేందుకు ప్రణాళిక రూపొందించారు. పాలకుర్తికి వచ్చి ఐలమ్మకు, స్థానిక పార్టీకి రక్షణగా అగ్రనాయకత్వం నిలిచింది. పాలకుర్తి ఆర్గనైజర్ చకిలం యాదగిరిరావు, జిల్లా పార్టీ కార్యదర్శి దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, బీంరెడ్డి నర్సింహరెడ్డి, ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డిలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, వలంటీర్లు పాలకుర్తికి చేరుకున్నారు. ఐలమ్మ ఇంట్లోనే ఉంటూ ఆ ఇంటిని పార్టీ కార్యాలయంగా మార్చారు. దేశ్‌ముఖ్ ఎత్తుగడలను పసిగడుతూ వచ్చారు. 1945 నవంబర్ నెలలో ఐలమ్మ భూమిలో పండిన ధాన్యాన్ని దోచుకురమ్మని గుండాలను పాలకుర్తికి పంపాడు. భూమిలో అడుగుపెట్టిన ఆ గుండాలను ఆంధ్ర మహాసభ నాయకత్వం సమిష్టిగా ఎదుర్కొంది. వారిని తరిమివేసి పంటను కోసి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. బీంరెడ్డి నర్సింహరెడ్డి లాంటి నాయకులు సైతం ధాన్యబస్తాలను భుజాలపై మోశారు. పారిపోయిన గుండాలు దేశ్‌ముఖ్‌కు విషయం చెప్పడంతో పోలీసులను పంపించి నాయకుల్ని అరెస్ట్ చేయించాడు. ఆ నాయకులను చిత్రహింసలకు గురిచేశారు.

నివాళి అర్పించనున్న పలువురు..

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 9 : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.



విస్నూరు గడి

ఐలమ్మ ఇల్లే ఉద్యమ కేంద్రం

దేశ్‌ముఖ్ ఎన్ని ఎత్తులు వేసిన ఓటమి పాలవ్వక తప్పలేదు. పాలకుర్తి గ్రామంపై దాడులు చేయించాడు. ఐలమ్మ ఇంటిని దోచారు. కార్యకర్తల ఇళ్లకు నిప్పు పెట్టారు. ఐలమ్మ కూతురు సోమనర్సమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారు దేశ్‌ముఖ్ గూండాలు. అనేక దాడులు, దౌర్జన్యాలను ఎదుర్కొని నిలబడ్డారు. ఐలమ్మ పోరాటం ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారి పోరాటాలు ఉధృతమై భూస్వాములు పట్టణాల బాట పట్టారు. ఐలమ్మ ఇల్లే కేంద్రంగా ఉద్యమ విస్తరణ జరిగింది. ఐలమ్మ కొడుకులు దళ కమాండర్లుగా ఎదిగారు. ఐలమ్మ భూపోరాటంతో సాయుధ పోరాటం జరిగింది. వేలాది ఎకరాలు భూములు ప్రజలకు పంచడంతో గ్రామ స్వరాజ్యాలు ఏర్పడ్డాయి. ఐలమ్మ ఉద్యమానికి కొండంత అండగా నిలబడి చరిత్రలో కమ్యూనిస్టు ఐలమ్మగా నిలిచిపోయింది. ఐలమ్మ వృద్ధాప్యంతో 90ఏళ్ల వయస్సులో సెప్టెంబర్ 10న కన్ను మూయగా.. ఆమె మరణాంతరం పాలకుర్తిలో స్మారక భవనం, స్మారక స్థూపం నిర్మితమయ్యాయి. 2015 సెప్టెంబరు 10న ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని ఉమ్మడి వామపక్ష పార్టీలు ఆవిష్కరించాయి. 2022లో అప్పటి ప్రభుత్వం పాలకుర్తిలో రోడ్డు విస్తరణలో భాగంగా చౌరస్తాలోని ఐలమ్మ విగ్రహాన్ని తీసి 2023లో ఆగస్టులో తాత్కాలిక గద్దె నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ పూర్తి కాలేదు. అయితే స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి శాశ్వత గద్దె నిర్మాణం చేపట్టేందుకు రూ.5లక్షలతో స్లాబ్ నిర్మాణంతో పాటు రెయిలింగ్, స్టీలుతో మెట్ల నిర్మాణం పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జయంతి రోజు నాటికి ఈ గద్దె నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఇక మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

- టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు
- సీఎం బొమ్మ నేసిన కార్పెట్ బహూకరణ



సీఎంకు కార్పెట్ అందిస్తున్న వెంకటేశ్వర్లు

ఆటోనగర్, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, వరద బాధితులకు సాయంగా చేయాలని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ నాంపల్లిలోని లలిత కళాతోరణం హాల్‌లో చేనేత నూతన పథకాల ఏర్పాటు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై చేనేతలకు పలు పథకాలు అమలు చేశారు. ఈ మేరకు వరంగల్ కొత్తవాడకు చెందిన టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు చేనేత విభాగం నాయకులతో కలిసి కొత్తవాడలో చేనేత కార్మికులు సీఎం బొమ్మతో నేసిన కార్పెట్‌ను సీఎంకు బహూకరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేతన్నలు నేసిన కార్పెట్స్, బెడ్‌షీట్స్ వంటివి నిల్వ పేరుకుపోయాయని, వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి వరద బాధితులకు అందించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్, చేనేత నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'స్టేషన్'లో టెన్షన్!

5వ పేజీ తరువాయి

రాజీనామా చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అయితే అనూహ్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం రాజయ్యను పార్టీలో చేర్చుకోక పోగా, కడియం శ్రీహరి కుమార్తెకు టికెట్ ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ టికెట్ రేసులో భంగపడిన రాజయ్యను కడియంపై రాజకీయంగా దండెత్తేందుకు తిరిగి గూలాబీ గూటికి చేర్చుకున్నారు. ఎంపీ ఎన్నికల్లో రాజయ్యను స్టార్ క్యాంపెనయిర్‌గా వాడుకు న్నారు. స్టేషన్‌కు ఉప ఎన్నికలు వస్తే రాజయ్యనే తమ అభ్యర్థి అని ఎంపీ ఎన్నికల ముందే బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. అయితే బీఆర్ఎస్‌కు దీటుగా కడియం శ్రీహరి తొలి నుంచి రాజకీయ వ్యూహాలు అమలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా శ్రీహరి ఇటీవలకాలంలో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. శుభ, అశుభకార్యక్రమాలకు వెళ్లి పలకరిస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండటమే కాకుండా, అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రజల్లోకి చొచ్చుకపోతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తన కుమార్తె కావ్యకు అత్యధిక మెజార్టీ కూడా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచే రావడంతో తాను పార్టీ మారడాన్ని ప్రజలు మద్దతు ఇచ్చారనే ధీమాలో ఉన్నారు. మొత్తానికి హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఓరుగల్లు పాలిటిక్స్ శరవేగంగా వేడెక్కుతున్నాయి.

ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ బోటనీ హెడ్‌గా శ్రీధర్‌రావు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9 : సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బోటనీ విభాగంగా ఇన్‌చార్జ్ హెడ్‌గా డాక్టర్ శ్రీధర్‌రావు నియామితులయ్యారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి హెడ్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌రావును వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌కు మార్‌లోథ్, డాక్టర్ లక్ష్మారెడ్డి, జే.చందూలాల్, డాక్టర్ శ్రీనివాస్, సద్గుణ, మౌనిక, వేణు, సమత, కొమురయ్య, సతీశ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, హరికుమార్, కె.రాజేందర్ అభినందించారు.

కొన్ని రద్దు.. కొన్ని దారి మళ్లింపు

- గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటి, సింగరేణి, డోర్నకల్ ప్యాసింజర్ రైలు సర్వీసుల నిలిపివేత
- ఈనెల 23 నుంచి అక్టోబరు 8 వరకు అమలు
- కృష్ణా, ఎల్‌టిటి, సాయినగర్‌షిర్డీ, శాలిమార్, కోణార్క్ వరంగల్‌కు రాకుండా మళ్లింపు

గిర్మాజిపేట, సెప్టెంబరు 9 : విజయవాడ-న్యూఢిల్లీ మార్గంలోని వరంగల్-హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌లు - కాజీపేట ఎఫ్ క్యాబిన్ మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా ఈనెల 23 నుంచి అక్టోబరు 8 వరకు ఈ మార్గంలో వరంగల్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సోమవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. భద్రాచలం- బల్లార్ష సింగరేణి ఎక్స్‌ప్రెస్ ఈనెల 26 నుంచి అక్టోబరు 8 వరకు, సికింద్రాబాద్-గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి అక్టోబరు 9 వరకు, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి అక్టోబరు 9 వరకు, విజయవాడ-సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఈనెల 25 నుంచి అక్టోబరు 7 వరకు, కాజీపేట-డోర్నకల్-విజయవాడ-కాజీపేట-డోర్నకల్ ప్యాసింజర్ రైళ్లు ఈనెల 25 నుంచి అక్టోబరు 7 వరకు రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే తెలిపింది.

వరంగల్ రాకుండా మళ్లింపు

ఆదిలాబాద్- తిరుపతి- ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈనెల 24 నుంచి అక్టోబరు 2 వరకు వరంగల్ రాకుండా సికింద్రాబాద్, పంగిడిపల్లి, గుంటూరు మీదుగా తిరుపతికి దారి మళ్లించారు. విశాఖపట్టణం- ముంబాయి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 24 నుంచి అక్టోబరు 2 వరకు గుంటూరు- విజయవాడ, పింగిడిపల్లి, సికింద్రాబాద్‌కు వెళ్తుంది. కాకినాడ-సాయిషిర్డినగర్ ఈనెల 29 నుంచి అక్టోబరు 7 వరకు విజయవాడ, గుంటూరు, పంగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్ వెళ్తుంది. కోణార్క్ ఎక్స్‌ప్రెస్, శాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లు కూడా ఈనెల 28 నుంచి అక్టోబరు 6 వరకు విజయవాడ, గుంటూరు, పంగిడిపల్లి మీదుగా సికింద్రారాబాద్ వెళ్తుందని దక్షిణమధ్య రైల్వే తెలిపింది.

రుణమాఫీ అమల్లో కాంగ్రెస్ విఫలం

- 'పాలకుర్తి'లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- జనగామ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



పాలకుర్తి నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

జనగామ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతు రుణమాఫీ అమల్లో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రైతులందరికీ రూ. 2లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం 40శాతం మందికి కూడా మాఫీ చేయలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. పాలకుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరుతూ సోమవారం ఆయన జనగామ కలెక్టరేట్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి విలేకరులతో మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. అదేవిధంగా ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, ఇళ్లు కూలిపోయిన బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. పాలకుర్తి ఆసుపత్రిని రూ. 17.50 కోట్లతో 30 నుంచి 50 పడకలకు పెంచుతూ తమ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశామని గుర్తు చేసిన ఆయన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ఇంత వరకు పనులు మొదలుపెట్టలేదన్నారు. ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం ఉన్న పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, వల్మిడి శ్రీ సీతారామ ఆలయం, బమ్మెర గ్రామాన్ని టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తూ రూ.25కోట్లతో టూరిజం హోటల్‌ను నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, దాని నిర్మాణ పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదన్నారు. అదే విధంగా రూ.14కోట్లతో పోతన ప్రాంగణం పనులను ప్రభుత్వంలో ప్రారంభించామని, కానీ అవి ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. నియోజకవర్గంలోని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం కోసం తమ హయాంలో కొడకండ్లలో రూ.61కోట్లతో మినీ టెక్స్‌టైల్ పార్కును మంజూరు చేశామని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్కు పనులను ప్రారంభించలేదని విమర్శించారు.

ఆ మూడు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయం

పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్పందించిన ఆయన పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని, ఈ ఆదేశాలను స్పీకర్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఆ మూడు నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తాయని, మూడు స్థానాలనూ బీఆర్ఎస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2805	2805
పల్లికాయ (సూక)	5270	4500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	8882	6750
పెసళ్లు	6912	4552
పత్తి	7700	5500
పసుపు (కాడి)	12399	10000
పసుపు (గోల)	12222	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18200	14000
వండర్‌హాట్ ఏసీ	15500	13000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

బ్రీత్ ఎనలైజర్ సరిగా పనిచేయడం లేదని ఆరోపణ

బాలసముద్రం, సెప్టెంబరు 9: వరంగల్-2 డిపోలో బ్రీత్ ఎనలైజర్ సరిగా పనిచేయడం లేదని ఆర్టీసీ డ్రైవర్లు సోమవారం ఆరోపించారు. కడిశలకుంటకు ఆర్టీసీ ఆర్డినరీ బస్సు నడుపుతున్న రాజుకు ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వీ ప్రభాకర్ బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేశారు. ఆల్కహాల్ 66 శాతం రావడంతో రాజుకు అధికారులు డ్యూటీ కేటాయించలేదు. అలాగే డ్రైవర్ బీ సాంబరాజును సోమవారం పీసీ ప్రభాకర్ బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేయడంతో ఆల్కహాల్ 44 శాతం రావడంతో అతడికీ డ్యూటీ ఇవ్వలేదని తెలిపారు. బ్రీత్ ఎనలైజర్ సరిగా పని చేయడం లేదని ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులు వరంగల్-2 డిపో గేటు వద్ద ఆందోళన చేపట్టారు. డ్రైవర్లు సాంబరాజు, రాజును ఆర్టీసీ అధికారుల సూచనలతో వరంగల్‌లోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేస్తే జీరో వచ్చినట్లు డ్రైవర్లు తెలిపారు. ఈ విషయంపై వరంగల్-2డిపో మేనేజర్‌ను వివరణ కోరగా బ్రీత్ ఎనలైజర్ మిషన్ ఈ నెల 3న హైదరాబాద్‌లోని ఆ కంపెనీలో పరిశీలించి తీసుకువచ్చినట్లు మిషన్ ప్రాబ్లం లేదని తెలిపారు.

ప్రమాదాన్ని నివారించిన రైల్వే ఉద్యోగులకు జీఎం సత్కారం



సికింద్రాబాద్‌లో రైల్వే ఉద్యోగులను అవార్డులతో అభినందిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

కేసముద్రం, సెప్టెంబరు 9 : కేసముద్రం మండలం ఇంటికన్నె, మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య ఇటీవలె పలుచోట్ల భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రైల్వేట్రాక్‌లను సకాలంలో గుర్తించి పెద్ద ప్రమాదాన్ని నివారించినందుకు ఆరుగురు ఉద్యోగులకు 'సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్' అవార్డులను అందజేశారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైలు నిలయంలో సోమవారం భద్రతా సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్ ఈ అవార్డులను అందజేసి సత్కరించారు. అవార్డులు అందుకున్న వారిలో నెక్కొండ, మహబూబాబాద్ ట్రాక్‌మెన్‌లు జి.మోహన్, బి.జగదీష్, కె.కృష్ణ, బ్రిడ్జ్‌మెన్ బి.జైల్‌సింగ్, పీవే జేఈ వి.సైదానాయక్, పీడబ్ల్యూ ఎస్ఎస్ఈ పి.రాజమౌళిలు ఉన్నారు.

అడవిలో పోలీస్..

- 30 రోజులకు సరిపడా నిత్యావసర వస్తువుల పంపిణీ
- దొరవారి తిమ్మాపురం ఆదివాసీలకు చేయూత

గూడూరు, సెప్టెంబరు 9: దట్టమైన అడవులు.. నడుద్దామన్నా.. దారి లేదు.. ఎడతెరిపి లేని వర్షాలు ఐనా.. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు.. ఎక్కుతూ.. దిగుతూ.. అడవి బిడ్డల దగ్గరకు చేరుకుని నిరుపేద ఆదివాసీల ఆకలి తీర్చడానికి శ్రమిస్తున్నారు గూడూరు సీఐ బాబురావు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వాగులు పొంగి పొర్లుతుండడంతో ఆదివాసీలకు నిత్యావసర వస్తువులు, సామగ్రి కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోయింది. తినడానికి తిండిలేక ఆకలితో అలమటిస్తున్నారు. నిరుపేదలు ఆకలితో అలమటించకుండా ఉండేందుకు కంకణం కట్టుకున్నారు. దొరవారి తిమ్మాపురం ఆదివాసీలకు స్వయంగా కూరగాయల మూటలు మోసుకుంటూ పది కిలోమీటర్ల మేర నడుస్తూ ఆదివాసీల ఆకలి తీర్చారు. 30 రోజులకు సరిపడా నిత్యావసరాలను అందించారు.

ఆదివాసీలకు అండగా పోలీసులు..

జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూడూరు మండలం మట్టేవాడ శివారు దొరవారి తిమ్మాపురం గ్రామానికి చుట్టుపక్కల ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహించడంతో బాహ్య సమాజంతో రాకపోకలు స్తంభించిపోయాయి. నిత్యావసరాలు లభించకపోవడంతో ఆకలితో అలమటిస్తున్న గ్రామస్థుల పరిస్థితి తెలుసుకున్న గూడూరు సీఐ బాబురావు వెంటనే తన సర్కిల్ పరిధిలోని గూడూరు, కొత్తగూడ, గంగారం ఎస్సైలు గిరిధర్ రెడ్డి, కుషకుమార్, రవికుమార్‌లు సిబ్బందితో కలిసి రెండు ట్రాక్టర్ల సాయంతో అడవిలో పది కిలోమీటర్ల మేర వెళ్తుండగా మూడుసార్లు బురదలో ట్రాక్టర్ దిగబడింది. అయినా వెనుదిరగకుండా మరో ట్రాక్టర్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీయించి గ్రామానికి చేరుకున్నారు. సుమారు 30 కుటుంబాలకు 30 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు కూరగాయలను అందించారు.



ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ బాబురావు

పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన ఆదివాసీలు

ఆకలితో అలమటిస్తున్న తమకు నిత్యావసరాలు అందించిన గూడూరు సీఐ బాబురావుతో పాటు పోలీసు సిబ్బందికి దొరవారి తిమ్మాపురం ఆదివాసీలు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నపిల్లలు పాలు లేక అల్లాడుతున్నారని, కొందరి ఇళ్లలో బియ్యం తడిసిపోయాయని, వండుకోవడానికి కూరగాయలు, నిత్యావసరాలు ఏమి లేకపోవడం తో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆదివాసీలు తెలిపారు. ఇలాంటి కష్ట సమయంలో దేవుడిలా ఆదుకున్న పోలీస్ శాఖ సహాయాన్ని తాము ఎప్పటికి మరిచిపోలేమని కన్నీటి పర్యంతమయ్యారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శంభునిపేట, సెప్టెంబరు 9 : నగరంలోని రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్, హిందీ, గణితం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 12 సాయంత్రంలోగా కళాశాలలో దరఖాస్తులను అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశానుసారం నలుగురు అతిథి అధ్యాపకుల నియామకాలను చేపట్టామన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో పీజీ చేసి ఉండాలని, సెట్, నెట్, స్లేట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యముంటుందన్నారు.

పెద్ద మోరీపై నుంచి రాకపోకలు ప్రారంభం

వాహనాల రాకపోకలతో నయీంనగర్‌కు పూర్వవైభవం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 9 : ఆరు నెలల కింద కరీంనగర్-హనుమకొండ ప్రధాన రహదారిలోని నయీంనగర్ పెద్దమోరీపై నిలిచిపోయిన రాకపోకలు ఎట్టికేలకు తిరిగి సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. వర్షాకాలంలో ప్రతీసారి బ్రిడ్జి కింది నుంచి వరద నీరు సరిగ్గా ప్రవహించక వర్షాకాలంలో సమీప కాలనీలు ముంపునకు గురయ్యేవి. రహదారిపై నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించేవి. దీంతో ఏప్రిల్ 5న పాత బ్రిడ్జిని కూల్చివేసి కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టారు. ఈ క్రమంలో రాకపోకలను నిలిపివేసి వాహనాలను దారి మళ్లించారు. దీంతో పలువురు వాహనదారులు, వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నెల 9 న వరంగల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బ్రిడ్జిని ప్రారంభించాలనే ఆదేశాలు అధికారులకు అందడంతో అధికారులు, స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నిత్యం పనులను పర్యవేక్షిస్తూ బ్రిడ్జిని వేగంగా పూర్తి చేశారు. అనివార్య కారణాలతో సీఎం టూర్ వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం 9న ప్రారంభించాలని అధికారులు నిర్ణయం తీసుకోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి టూర్ వాయిదా పడినప్పటికీ సోమవారం నుంచి వాహనాల రాకపోకలకు ప్రారంభించడంతో తిరిగి నయీంనగర్‌కు పూర్వవైభవం వచ్చింది. బ్రిడ్జికి ఇరువైపులా, డివైడర్స్ మధ్యలో కుడా, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలకుండీలు, మొక్కలు వాహనదారులు, బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు బ్రిడ్జి కిందినుంచి సాఫీగా ప్రవహించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



బ్రిడ్జిపై నుంచి కొనసాగుతున్న రాకపోకలు



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 9 : జిల్లాలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం. రాజేంద్రప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శ్యాంసుందర్ సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ.. కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.


కమిషనర్‌ను సన్మానిస్తున్న శ్యాంసుందర్


వాహన సేవలో పాల్గొన్న భక్తులు

త్రిముఖ గణపతిగా దర్శనం

▸▸ రుద్రేశ్వరుడికి అశ్వవాహన సేవ ▸▸ వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 9 : వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి వేడుకల పర్వం సోమవారం మూడో రోజుకు చేరుకుంది. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ గణపతిని త్రిముఖ గణపతిగా శోభాయమానంగా అలంకరింప చేసి నైవేద్యం సమర్పించి నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఆలయ ప్రాంగణంలో అశ్వవాహనంలో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు వాహన సేవ నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కంజుల మహేష్ బాబు ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం గణపతి నవగ్రహ హోమం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. గంగ్రాతి రాజు, పులి రజినీకాంత్, దరిగే అశోక్, చంద్రశేఖర్, కాశీ విశ్వనాథ లింగాచారి తదితర భక్తులు సేవలందించారు. ఆలయ ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు.

ఆర్థిక సంఘం చైర్మన్‌ను కలిసిన మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 9 : హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌ను నగర మేయర్ గుండు సుధారాణి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు మేయర్ శాలువా కప్పి అభినందించారు. మేయర్‌తో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉన్నారు.


ఆర్థిక సంఘం చైర్మన్‌ను సన్మానిస్తున్న మేయర్ సుధారాణి

గణేష్ మండళ్లకు బహుమతులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 9: వరంగల్ దర్శన్ ఆధ్వర్యంలో ఉత్తమ వినాయకులకు ప్రత్యేక అవార్డులను ఇవ్వనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ పెండెం రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అలంకరణ, విగ్రహ వైవిధ్యం, గణేష్ మండళ్లు, తొమ్మిదిరోజుల పాటు నిర్వహించే ప్రత్యేక సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని అవార్డులను అందజేస్తామన్నారు. వివరాలకు సెల్ నంబర్ 93901 11828లో సంప్రదించాలని కోరారు.

కాళోజీ రచనలు భావితరాలకు స్ఫూర్తి

▸▸ కలెక్టర్ ప్రావీణ్య
▸▸ నివాళులర్పించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 9 : కాళోజీ నారాయణరావు రచనలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్ట జంక్షన్‌లో ఉన్న కాళోజీ విగ్రహానికి సోమవారం కలెక్టర్ ప్రావీణ్య కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కాళోజీ రచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కాళోజీ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర భాషా సాంస్కృతిక దినోత్సవంగా ప్రకటించి సముచితస్థానం కల్పించిందన్నారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ నేటితరం యువత కాళోజీ నారాయణరావును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● వడ్డేపల్లి : హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతితో పాటు తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు లక్ష్మీకాంతం, రామా రత్నమాల, శ్రీనివాస్, రాజేశ్వరి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● ఐనవోలు : ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన వేడుకల్లో జిల్లా కమ్యూనిటీ మొబిలిజేషన్ అధికారి(సీఎంవో) బోయినపల్లి రాధ, మండల నోడల్ అధికారి పి. ఆనందం హాజరై ఉపాధ్యాయులతో కలిసి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎ. వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం టి. వెంకటేశ్వర్‌రావు, విద్యావారధి జిల్లా అధ్యక్షుడు భీమళ్ల సారయ్య, ఉపాధ్యాయులు లక్ష్మి, విజయ, బ్రహ్మచారి, సీఆర్పీ రాజ్‌కుమార్, రేవతి, కుమార్ పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్ : సామాజిక సమస్యలపై నిక్కచ్చిగా పాలకులపై అక్షరాయుధాలను సంధించి కీర్తిగడించిన వ్యక్తి ప్రజాకవి కాళోజీ అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం నక్కలగుట్ట కార్పొరేట్ ఆఫీస్‌లో కాళోజీ చిత్రపటానికి సీఎండీ, ఇన్‌చార్జి డైరెక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి డైరెక్టర్స్ బి. అశోక్‌కుమార్, టి. సదర్‌లాల్, వి. తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్, సీజీఎంలు కె. తిరుమల్‌రావు, రాజుచౌహాన్, కె. కిషన్, రవీంద్రనాథ్, అశోక్, బికంసింగ్, జీఎంలు మాధవ్‌రావు, మల్లికార్జున్, దేవేందర్, నాగప్రసాద్, వేణుబాబు, అన్నపూర్ణ, కంపెనీ సెక్రటరీ వెంకటేశం పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్ : బల్దియా కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డితో పాటు అధికారులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ట్యాక్సీ విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, హెచ్‌వో రమేష్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్ లింగం, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బల్దియా అధికారులు

● కేయూ క్యాంపస్ : కేయూ పరిపాలన భవనంలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాళోజీ స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఆర్ట్స్ విభాగం డీన్, తెలుగు విభాగాధిపతి, బీవోఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి, డాక్టర్ బి.దీపాజ్యోతి, డాక్టర్ ఆర్.మేఘనరావు, ఆడిట్ ఆఫీసర్ లింగంపల్లి రాము, ఏఆర్ సీహెచ్.ప్రణయ్‌కుమార్, పీఆర్‌ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సుబేదారిలోని మహిళా కళాశాలలో..


కాళోజీకి నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, దేశపతి శ్రీనివాస్


బీఆర్‌ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న వినోద్‌కుమార్, నాయకులు

సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ పీజీ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. కవిత నేతృత్వంలో కాళోజీ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.మధుశ్రీ పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్ : కేయూ తెలుగు విభాగం సెమినార్ హాల్‌లో కాళోజీ 110వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాటాడారు. నేటి సమాజం తెలుగు భాషను మరిచిపోవద్దని, తెలంగాణ భాషను బతికించుకోవాలని పిలుపునిచ్చారు. కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ టీ మనోహర్ మాట్లాడుతూ.. కాళోజీ కవిత్వం అందరిలో నిత్య చైతన్యం నింపుతున్నారని అన్నారు. కేయూ సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, డాక్టర్ కుంట ఐలయ్య, డాక్టర్ స్వర్ణలత, తెలుగు విభాగం అధ్యాపకులు చిర్రరాజు, మంథని శంకర్ పాల్గొన్నారు.

● రాంనగర్ : బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, జనార్ధన్‌గౌడ్, పులి రజనీకాంత్, చింతల యాదగిరి, జోరిక రమేశ్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్‌తో పాటు వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● హసన్‌పర్తి : అన్యాయాలపై పోరాటమే కాళోజీ జీవితాశయమని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాళోజీ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కర్నాకర్‌రెడ్డి, సిబ్బంది కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


టీపీసీసీ అధ్యక్షుడికి బొకే ఇస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు

మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 9 : టీపీసీసీ నూతన సారథి మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు ఈవీ శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మానవ వనరులే కీలకం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9 : దేశ అభివృద్ధిలో మానవ వనరులే కీలకమని కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతి ప్రొఫెసర్ పెద్దమల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎంహెచ్‌ఆర్‌ఎం విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కోర్సు ప్రాజెక్టు వర్క్ పూర్తైయింది. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఆర్‌ఎం విభాగం విద్యార్థులకు వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. వ్యవస్థ ఉన్నతికి మానవ వనరులే క్రియాశీలక పాత్ర పోషిస్తారని మానవ వనరుల విద్యార్థులకు మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. సీనియర్ ప్రొఫెసర్, బీవోఎస్ చైర్మన్ తోపుచర్ల యాదగిరిరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవడం మానవ వనరుల రంగంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి దోహదపడుతోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ వడ్డేపల్లి మోహన్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ తేజావత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వద్ద వాటర్ ప్లాంట్ ప్రారంభం

వరంగల్ లీగల్, సెప్టెంబరు 9 : జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కక్షిదారుల కోసం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం పదికోర్టుల భవన సముదాయంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రావు తన సొంత డబ్బులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

ఈ వాటర్‌ప్లాంట్ కార్యక్రమాన్ని వరంగల్, హనుమకొండ జిల్లాల జడ్జిలు నిర్మల, సీహెచ్. రమేష్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తీగల జీవన్‌గౌడ్, ముదసర్ అహ్మద్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లాదె రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

హనుమకొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి ముసురుతో కూడిన ఒక మోస్తరు వర్షం పడింది. రాత్రి జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ముసురు పడడం మొదలైంది. పలు చోట్ల సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దామెర, శాయంపేట, హనుమకొండ, ఆత్మకూరు మండలాల్లోనే కాస్త ఎక్కువ వర్షం పడింది. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతమే నమోదైంది. వర్షం వల్ల పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో గత 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. శాయంపేట మండలంలో అత్యధికంగా 15.8 మి.మీ, ఆత్మకూరు మండలంలో 15.1 మి.మీ, హనుమకొండలో 13.3 మిమీ వర్షపాతం నమోదు కాగా, భీమదేవరపల్లిలో 3.5 మిమీ, వేలేరులో 2.8 మి.మీ, ఎల్కతుర్తిలో 6.2 మిమీ, కమలాపూర్‌లో 5.5 మిమీ, హసన్‌పర్తిలో 9.7 మిమీ, ధర్మసాగర్‌లో 4.4 మిమీ, కాజీపేటలో 6.4 మిమీ, ఐనవోలులో 5.2మిమీ, పరకాలలో 5.9 మిమీ, నడికుడలో 8.3 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి 7.8 మిమీ వర్షపాతం రికార్డయింది.

మావో పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

బాలసముద్రం, సెప్టెంబరు 9: మావో పోరాట స్ఫూర్తితో ఉద్యమించి హక్కులు సాధించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అన్నారు. సోమవారం హనుమకొండ బస్టాండ్ వద్ద మావో 48వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ ఏడు దశాబ్దాల పార్లమెంటరీ పాలనలో ప్రభుత్వాలు ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని ఆరోపించారు. అసమానతలను లేని సమాజాన్ని స్థాపించుకోవాలని పిలుపునిచ్చారు.

లిక్కర్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

కావడం గమనార్హం. గంజాయి నివారణకు చర్య లు, బెల్ట్ దందాను అరికడుతానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. గంజాయి నివారణకు నడుం బిగించిన పోలీస్ శాఖ బెల్ట్ దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకోకుంటే సీఎం లక్ష్యం నెరవేరడం కలగానే మిగిలిపోతుంది.

టాస్క్‌ఫోర్స్ పట్టుకున్న మద్యం వివరాలు

- గతనెల 15న సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లిలో బెల్ట్ షాపులో రూ.77వేల మద్యం స్వాధీనం. నిర్వాహకుడు రాజ్‌కుమార్‌పై కేసు నమోదు.
- గతనెల 15న మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో సాకరాశికుంటలో బెల్ట్ షాపులో రూ.2 లక్షల 86వేల మద్యం స్వాధీనం. నిర్వాహకుడు రాజుపై కేసు నమోదు.
- గతనెల 15న సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లిలో బెల్ట్ షాపులో రూ.50వేల మద్యం స్వాధీనం. నిర్వాహకురాలు రమాదేవిపై కేసు నమోదు.
- మే 1న రఘునాథపల్లి మండలం కొడూరులో బెల్ట్ షాపులో రూ.6వేల మద్యం స్వాధీనం. నిర్వాహకురాలు మంగమ్మపై కేసు నమోదు.
- మే 3న కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంజారాకాలనీలో బెల్ట్ షాపులో రూ.8వేల మద్యం స్వాధీనం. నిర్వాహకురాలు లక్ష్మిపై కేసు నమోదు.
- మే 10న కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపూజీనగర్‌లో బెల్ట్ షాపులో రూ.66వేల మద్యం స్వాధీనం. నిర్వాహకుడు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు.
- మే 10న గీసుగొండలో బెల్ట్ షాపులో రూ.25 వేల మద్యం స్వాధీనం. నిర్వాహకుడు రాకేష్‌పై కేసు నమోదు.
- మే 26న మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలోని సాకరాశికుంటలో బెల్ట్ షాపులో రూ. లక్ష 95వేల మద్యం స్వాధీనం. నిర్వాహకురాలు సృజనపై కేసు నమోదు.

సిద్ధం గణేష్ జయంతి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 9 : హనుమకొండ సుబేదారిలోని డాల్ఫిన్ రెస్టారెంట్, బేకరీ నిర్వాహకుడు సిద్ధం రాజయ్య కుమారుడు గణేష్ జయంతిని పురస్కరించుకుని సుబేదారిలోని బేకరీ కాంప్లెక్స్ వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గణేష్ కుటుంబ సభ్యులు రాజయ్య, విజయ, సాయి సూర్యవంశీ, తేజస్విని, సునయన, శ్రీధర్, శ్వేత, మురళీ, రూపారాణి, కిరణ్, పద్మ, సహజ్, స్వరాళి, స్ఫూర్తి, సిరి, శ్రేష్ఠ, సాయితో పాటు బంధు మిత్రులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న గణేష్ కుటుంబ సభ్యులు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

▸▸ అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి
▸▸ బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 9 : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమాన్ని బల్దియా అధికారులు నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే రాలేదు. దీంతో అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తు స్వీకరించిన తర్వాత వెంటనే విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ఇంజనీరింగ్ - 17, హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 03, టౌన్‌ప్లానింగ్ - 28 మొత్తం 54 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ట్యాక్సీ విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్, వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావులతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

● హనుమకొండ 4వ డివిజన్ మాదిరెడ్డికుంటలో అక్రమ నిర్మాణాలను బల్దియా అధికారులు ఫిబ్రవరిలో కూల్చివేశారు. కూల్చి వేసిన రేకులు, చెత్తా చెదారాన్ని అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలించాలని కాలనీకి చెందిన సలేంద్ర రాజమణి అధికారులకు ఫిర్యాదు చేశారు.

● వరంగల్ 40వ డివిజన్‌లోని ఉర్సు చెరువులో చాలా కాలంగా గుర్రపు డెక్క పెరిగి గణపతి నిమజ్జనానికి ఇబ్బందిగా ఉందని వెంటనే గుర్రపు డెక్కను తొలగించాలని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవీందర్ ఫిర్యాదు చేశారు. ఉర్సు చెరువులో సమారు 450 గణేశ్ విగ్రహాలను ప్రతీయేట నిమజ్జనం చేస్తారని, ప్రస్తుతం చెరువు అధ్వానంగా ఉందన్నారు. నిమజ్జనానికి కావాల్సిన క్రేన్లు, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

● హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల వద్దకు చాలా రోజులుగా చెత్త బండి రాకపోవడంతో తీవ్రమైన చెత్త సమస్య ఉందని కళాశాల సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేశారు.

● గ్రేటర్ 2వ డివిజన్ గుండ్లసింగారం ఇందిరమ్మ కాలనీలో ప్రధాన కాలువలో పిచ్చిమొక్కలు పెరగడం వల్ల మురుగు నీరు ఎక్కడపడితే అక్కడ నిలిచి పోతుంది. దీనిపై స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక సీపీఎం నాయకుడు తిరుపతి అధికారులకు ఫిర్యాదు చేశారు.

హెల్త్ వెల్త్

ఉదయమే ఉసిరి తింటే?

ఉసిరితో ఒరిగే ప్రయోజనాల గురించి మనందరికీ తెలిసిందే! అయితే ఉసిరిని పరగడుపున తింటే వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు, పెద్దపేగు ఆరోగ్యం కూడా క్షేమగ్గా ఉంటుంది. ఉసిరితో అందే ఇంకొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...

- విటమిన్ సి సమృద్ధిగా దొరికే ఉసిరిని పరగడుపున తింటే వ్యాధులతో పోరాడే వ్యాధినిరోధకశక్తి పెరగడంతో పాటు, సీజనల్ రుగ్మతలైన జలుబు, దగ్గులు కూడా దరి చేరకుండా ఉంటాయి.
- ఉసిరి జీర్ణరసాలను ప్రేరేపించి, పేగుల ఆరోగ్యాన్ని పెంచుతుంది. దాంతో జీర్ణశక్తి పెరగడంతో పాటు, పోషకాల శోషణ కూడా మెరుగవుతుంది. మలబద్ధకం కూడా వదులుతుంది.
- ఉసిరిలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సిలు, చర్మానికి బిగుతునిచ్చే కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దాంతో చర్మం మీద ముడతలు తొలగి చర్మం నునుపుగా మారుతుంది.
- చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దాంతో గుండె జబ్బులు దరి చేరకుండా ఉంటాయి. ఉసిరితో అధిక రక్తపోటు అదుపులో కొస్తుంది.
- మెటబాలిజం పెరిగి, శరీరంలోని విషాలు బయటకు వెళ్లిపోయి శరీర బరువు కూడా అదుపులోకొస్తుంది. ఉసిరిలోని పీచు ఆకలిని అదుపులో ఉంచి, అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరకుండా నియంత్రిస్తుంది.
- రక్తంలోని చక్కెర మోతాదులు క్రమబద్ధమై మధుమేహులకు ప్రయోజనాన్ని అందిస్తుంది. అలాగే మధుమేహ సంబంధ ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ పొందాలన్నా, పరగడుపున ఉసిరి తినాలి.
- యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగిన ఉసిరి తింటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి.
- ఉసిరి శరీరంలోని విషాలను హరిస్తుంది. కాబట్టి కాలేయం ఆరోగ్యంగా ఉండాలనుకుంటే ఉదయాన్నే ఉసిరి తినాలి.



మీకు తెలుసా?

రక్త శుద్ధి సులువే!

రక్తంలో ఇన్‌ఫెక్షన్లు ఆరోగ్యాన్ని గుల్ల చేస్తాయి. రోగ కారకాలు రక్తంలోకి చొరబడినా, ఎప్పటికప్పుడు నశించి ఆరోగ్యం క్షేమంగా ఉండాలంటే అందుకు తోడ్పడే పదార్థాలతో రక్తాన్ని శుద్ధి చేసుకుంటూ ఉండాలి. అందుకోసం...

- **బీట్‌రూట్:** యాంటీఆక్సిడెంట్లు, నైట్రేట్స్ కలిగి ఉండే బీట్‌రూట్ రక్తాన్ని డిటాక్సిఫై చేసి, నైట్రిక్ యాసిడ్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. దాంతో రక్తనాళాలు విప్పారి, రక్తప్రసరణ మెరుగవుతుంది.
- **వెల్లుల్లి:** సల్ఫర్ కాంపౌండ్స్‌ను కలిగి ఉండే వెల్లుల్లి సహజసిద్ధ రక్తశుద్ధి గుణాలను కలిగి ఉంటుంది. అదనపు కొవ్వులను రక్తం నుంచి తొలగించి, విసర్జించేలా చేయడం ద్వారా రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులను తగ్గిస్తుంది.
- **నిమ్మ:** విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు కలిగి ఉండే నిమ్మ సహజసిద్ధ రక్తశుద్ధికి సహాయపడుతుంది. రక్తంలోని వ్యర్థాలను తొలగించి, కాలేయ డిటాక్సిఫికేషన్‌కు తోడ్పడుతుంది. కాబట్టి తరచూ నిమ్మరసాన్ని ఆహార పదార్థాలకు జోడిస్తూ ఉండాలి.
- **పసుపు:** పసుపులోని కుర్క్యుమిన్ శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ. ఈ యాంటీఆక్సిడెంట్ రక్తాన్ని డిటాక్సిఫై చేసి, కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది.
- **దానిమ్మ:** రక్తాన్ని శుద్ధి చేసే ఏకైక పండు ఇది. దీన్లోని యాంటీఆక్సిడెంట్స్ అయిన ప్యూనికలాజిన్స్, విటమిన్ సిలు శరీరాన్ని ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి తప్పిస్తాయి. రక్తశుద్ధికి దోహదపడతాయి. రక్తప్రసరణను మెరుగు పరుస్తాయి.
- **ఆకుకూరలు:** బచ్చలి కూర, కేల్, ఇతరత్రా ఆకుకూరలన్నింట్లో పత్రహరితం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలోని విషాలను బయటకు వెళ్లగొట్టి ఆక్సిజన్ మోతాదులను పెంచుతుంది. ఫలితంగా రక్తం శుద్ధి అవుతుంది.



కేన్సర్ కేర్

బయాప్సీ భయం వద్దు

కేన్సర్ చికిత్స గురించి ఎన్నో అపోహలు ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది 'బయాప్సీ'. కేన్సర్ ట్యూమర్ నుంచి ముక్క తీసి పరీక్షిస్తే, మిగతా అవయవాలకు కేన్సర్ వ్యాపించే ముప్పు ఉంటుందన్నది అపోహ మాత్రమేననీ, సమర్థమైన కేన్సర్ చికిత్సకు బయాప్సీ తోడ్పడుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.



"బయాప్సీ సమయంలో కేన్సర్ కణితి నుంచి చిన్న కణజాలాన్ని సేకరించి, మైక్రోస్కోప్ కింద పరీక్షించి, అది కేన్సర్ అవునో, కాదో నిర్థారిస్తారు. ఈ ప్రక్రియ ఎంతో సురక్షితమైనది, చిన్న కోతతో పూర్తయిపోతుంది. పరీక్షలో భాగంగా కణితి దగ్గరకు చేరుకుని, సూదితో గుచ్చి లేదా కోసి చిన్న ముక్కను సేకరిస్తారు కాబట్టి, అలా చేయడం వల్లే కేన్సర్ వ్యాపిస్తుందనే అపోహ సర్వత్రా స్థిరపడిపోయింది."

బయాప్సీ భయంతో కేన్సర్ చికిత్సను వాయిదా వేసే వాళ్లున్నారు. ఆ పరీక్షతో, పక్కనున్న అవయవాలకు కేన్సర్ వ్యాపిస్తుందనే భయంతో బయాప్సీతో పని లేని చికిత్సను ఆశ్రయించే వాళ్లూ ఉన్నారు. అయితే బయాప్సీ గురించి సరైన అవగాహన లోపించడం వల్లే ఈ భయాలు పెరిగిపోతున్నాయి. బయాప్సీ అంటే ఏంటి? ఎందుకు చేస్తారు? ఆ పరీక్షతో ఉపయోగాలేంటో తెలుసుకుంటే, బయాప్సీ చుట్టూ ఆవరించి ఉన్న భయాలు, అపోహలన్నీ అర్థం లేనివనే విషయం తెలిసిపోతుంది. అన్నిటికంటే ముందు బయాప్సీ గురించి తెలుసుకుందాం!

బయాప్సీ అంటే?

బయాప్సీ సమయంలో కేన్సర్ కణితి నుంచి చిన్న కణజాలాన్ని సేకరించి, మైక్రోస్కోప్ కింద పరీక్షించి, అది కేన్సర్ అవునో, కాదో నిర్థారిస్తారు. ఈ ప్రక్రియ ఎంతో సురక్షితమైనది, చిన్న కోతతో పూర్తయిపోతుంది. పరీక్షలో భాగంగా కణితి దగ్గరకు చేరుకుని, సూదితో గుచ్చి లేదా కోసి చిన్న ముక్కను సేకరిస్తారు కాబట్టి, అలా చేయడం వల్లే కేన్సర్ వ్యాపిస్తుందనే అపోహ సర్వత్రా స్థిరపడిపోయింది. కణితిని ఇలా కదిలించడం వల్ల దాన్లోని కేన్సర్ కణాలు ఇతర శరీర అవయవాలకు విస్తరిస్తాయనే నమ్మకం పెరిగిపోయింది. కానీ బయాప్సీలతో కేన్సర్ వ్యాపిస్తుందనే శాస్త్రీయ ఆధారాలేవీ లేవు. నిజానికి బయాప్సీలు కేన్సర్ మెటాస్టాసిస్ (ప్రధాన కణితి నుంచి శరీరంలోని ఇతర అవయవాలకు కేన్సర్ వ్యాపించడం) ముప్పును పెంచవని అధ్యయనాల్లో వెల్లడైంది. రొమ్ము కేన్సర్ పెరుగుదల లేదా వ్యాప్తి మీద బయాప్సీ ప్రభావం ఏమాత్రం ఉండదనే పరిశోధకుల అధ్యయనాలు జోర్నల్ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీలో ప్రచురితమయ్యాయి. అదే విధంగా, ఊపిరితిత్తుల ట్యూమర్ల బయాప్సీలు కేన్సర్ వ్యాప్తికి దోహదపడవనే మరొక అధ్యయనం కూడా జోర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్‌లో ప్రచురితమైంది.

బయాప్సీ ఎందుకు?

కచ్చితమైన వ్యాధి నిర్థారణకూ, చికిత్స ప్లానింగ్‌కూ బయాప్సీలు అత్యవసరం. మైక్రోస్కోప్ కింద కణజాల నమూనాను పరిశీలించడం ద్వారా, కేన్సర్ రకం, దశ, తత్వాలను కనిపెట్టవచ్చు. నిర్దిష్ట లక్షణాలు కలిగిన కేన్సర్‌కు తగిన



ప్రభావవంతమైన చికిత్సా ప్రణాళికను రూపొందించడానికి ఈ సమాచారం కీలకం. బయాప్సీ చేయనప్పుడు, తగిన సమాచారం వైద్యుల దగ్గర ఉండదు. కాబట్టి వైద్యులు కేన్సర్ చికిత్సకు సంబంధించిన కచ్చితమైన నిర్ణయాలను తీసుకోలేరు. నిజానికి కొన్ని కేసుల్లో బయాప్సీలు కణితికి సంబంధించిన విలువైన సమాచారాన్ని అందించి, కేన్సర్ వ్యాప్తిని అరికట్టడానికి కూడా తోడ్పడతాయి. ఉదాహరణకు, కణితి చుట్టుపక్కల కణజాలాలకు వ్యాపించకుండా, ఒక ప్రదేశానికే పరిమితమై ఉందనే విషయం బయాప్సీలో బహిర్గతమైతే, వైద్యులు సర్జరీ ద్వారా ఆ కణితిని సమూలంగా తొలగించగలుగుతారు. దాంతో కేన్సర్ శరీరంలోని ఇతర అవయవాలకు వ్యాపించకుండా ఉండడమే కాకుండా, రోగి వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశాలు కూడా పెరుగుతాయి.

బయాప్సీలతో కేన్సర్ వ్యాప్తి చెందుతుందనడానికి ఆధారాలు లేకపోయినప్పటికీ, కొందరు రోగుల్లో ఈ నమ్మకం లోతుగా నాటుకుపోయింది. దాంతో అనవసరపు ఆందోళన, భయాలు పెరిగి, వ్యాధి నిర్థారణ, చికిత్సలు ఆలస్యమవుతున్నాయి. రోగుల్లో బయాప్సీకి సంబంధించి ఎలాంటి భయాలు, ఆందోళనలు, అనుమానాలున్నా, వాటిని వైద్యులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ఈ భయాలను పోగొట్టి, సురక్షితమైన, లాభదాయకమైన బయాప్సీ గురించిన కచ్చితమైన సమాచారాన్ని వైద్యులు అందించడం ద్వారా రోగులు చికిత్సపరంగా సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

వైద్యుల ప్రమేయం

బయాప్సీ ప్రక్రియలో వైద్యులు ఎంతో ఆచితూచి వ్యవహరిస్తారు. కణితి నుంచి కణాలు బయటకు వచ్చేయకుండా, కణితి పగిలిపోకుండా, చితికిపోకుండా ఆ ప్రక్రియ మొత్తాన్నీ ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేస్తారు. పొత్తికడుపు కేన్సర్ మాదిరిగా కణితి పగిలిపోయే ముప్పు ఉందని గ్రహిస్తే, ఇబ్బందులు తలెత్తకుండా ఉండడం కోసం రెట్టింపు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తారు. బయాప్సీలు కేన్సర్ చికిత్సలో కీలకమైన సమాచారాన్ని అందించి, సమర్థమైన చికిత్సను అంచనా వేయగలిగే అవకాశాన్ని కల్పిస్తాయి. ఫలితంగా చికిత్సా ఫలితం కూడా మెరుగ్గా ఉంటుంది. కాబట్టి బయాప్సీ గురించిన అనుమానాలు, భయాలను వైద్యులను అడిగి నివృత్తి చేసుకుని నిర్భయంగా కేన్సర్ చికిత్సను కొనసాగించడం అన్ని విధాలా శ్రేయస్కరం.



డాక్టర్ ఎస్. నిఖిల్ ఘడ్యాల్ పాటిల్
సీనియర్ మెడికల్ ఆంకాల జిస్ట్ అండ్ హెమటో ఆంకాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ,
హైదరాబాద్.

రంగును బట్టి రుగ్మత

మూత్రం రంగు, వాసనలు శరీరంలో దాగిన సమస్యలకు సంకేతాలు. కాబట్టి మూత్రం మీద ఓ కన్నేసి ఉంచి, మార్పులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

ఒంట్లో నీళ్లు తగ్గడం: మూత్రం దుర్వాసనకు ప్రధాన కారణం శరీరంలో నీళ్లు తగ్గడం. శరీరంలో నీటి శాతం తగ్గితే, మూత్రం పరిమాణం కూడా తగ్గుతుంది. దాంతో విసర్జకాల గాఢత పెరిగి, మూత్రం పచ్చగా మారి, దుర్వాసన వెలువడుతుంది. ఈ సమస్య తొలగాలంటే నీరు ఎక్కువగా తాగాలి. సాధారణంగా ఉదయం మూత్రం కొంత పచ్చగానే ఉంటుంది. ఇందుకు కారణం రాత్రంతా నీళ్లు తాగకుండా ఉండడమే! అయితే రోజంతా ఇలాగే ఉంటే మాత్రం డీహైడ్రేషన్ బారిన పడతాం! కాబట్టి మూత్రం రంగును బట్టి ఎప్పటికప్పుడు తాగే నీటి మోతాదు పెంచాలి.

కెఫీన్ పెరగడం: తరచుగా కాఫీ తాగే అలవాటు ఉంటే ఒంట్లో చేరుకునే కెఫీన్ కారణంగా మూత్రం రంగు మారుతుంది, దుర్వాసన వెదజల్లుతుంది. ఇది అనారోగ్యకరం కాకపోయినా జీర్ణ వ్యవస్థ సక్రమంగా పని చేయాలంటే కెఫీన్ వాడకం తగ్గించాలి. మద్యపానం వల్ల కూడా మూత్రం రంగు మారుతుంది. సాధారణం కంటే ఎక్కువగా మూత్ర విసర్జన చేయవలసి వస్తూ ఉంటుంది. మద్యం కూడా హానికారకమే కాబట్టి మానేయడమే మేలు.

బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్: బ్యాక్టీరియా వల్ల లేదా మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా మూత్రం దుర్వాసన వస్తుంది. ఇవే కారణాలైతే సాధ్యమైనంత త్వరగా వైద్యులను సంప్రతించి వ్యాధినిర్థారణ పరీక్షలు చేయించుకోవాలి. ఫలితాలనుబట్టి వైద్యులు తగిన చికిత్స సూచిస్తారు. ఒకవేళ పరీక్షా ఫలితాల్లో ఎలాంటి అనారోగ్య సమస్య కనిపించకపోతే సమతులాహారం, సరిపడా నీరు తీసుకుంటూ సమస్యను తొలగించుకోవచ్చు.

సమతులాహార లోపం: నైట్రేట్స్, ఫాస్ఫేట్స్ మూత్రానికి ముదురు రంగును ఇస్తాయి. ఆహారంలో కొన్ని పోషకాలు లోపించడం మూలంగా ఈ మూలకాలు మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతూ ఉంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే పోషకభరిత ఆహారం తీసుకోవాలి. ఫలితంగా జీర్ణప్రక్రియ మెరుగుపడి పోషక నష్టం జరగకుండా ఉంటుంది.

మధుమేహం: మధుమేహుల మూత్రం గాఢమైన వాసన కలిగి ఉంటుంది. ఇలాంటి దుర్వాసన ఉంటే, చక్కెర స్థాయులు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయని అర్థం. ఇప్పటికే మధుమేహులు కాకపోయి ఉంటే, ఈ సూచననుబట్టి త్వరలో మధుమేహం బారిన పడుతున్నారని గ్రహించాలి. వెంటనే వైద్యులను కలిసి రక్తపరీక్ష చేయించుకుని మధుమేహం పరిస్థితిని తెలుసుకోవాలి.

రంగులు చెప్పే సంగతులు!

మూత్రం లేత పసుపు రంగులో, వాసన లేకుండా ఉండడం నిండైన ఆరోగ్యానికి సూచన. అయితే అంతర్గత సమస్యల కారణంగా మూత్రం ముదురు పసుపు మొదలు, వేర్వేరు రంగులను సంతరించుకుంటూ ఉంటుంది. ఈ రంగులనుబట్టి కారణాన్ని అంచనా వేయవచ్చు.

లేత పసుపు: తగినంత నీరు తాగుతున్నారని అర్థం.

ముదురు పసుపు: మూత్రం ఎంత పచ్చగా ఉంటే అంత ఎక్కువగా డీహైడ్రేషన్‌కు గురయ్యారని అర్థం.

గోధుమ రంగు: మూత్రంలో పాత రక్తం కలిసిందని అర్థం. కాలేయం ఇన్‌ఫెక్షన్‌కు సూచనగా కూడా భావించవచ్చు.

ఎరుపు లేదా గులాబీ రంగు: కొత్తగా రక్తం మూత్రంలో కలుస్తోందనడానికి సూచన. ఇన్‌ఫెక్షన్, మూత్రపిండాల సమస్య లేదా కేన్సర్ రుగ్మతల్లో ఈ లక్షణం కనిపిస్తుంది.

నీలం, ఆకుపచ్చ మొదలైన రంగులు: కొన్ని రకాల మందులు, ఆహారంలో కలిపే రంగుల వల్ల మూత్రం ఈ రంగులు సంతరించుకుంటుంది.

మూత్రంలో...

- మూత్రంలో 95% నీరు, 5% ఘన రూపాలు ఉంటాయి.
- బిలియన్లకొద్దీ కణాలు శక్తిని ఖర్చు చేసే ప్రక్రియలో భాగంగా ఉత్పత్తయ్యే అంతిమ ఫలితం మూత్రం. రోజుకు కనీసం ఒకటి నుంచి ఒకటిన్నర లీటరు మూత్రం ఇలా ఉత్పత్తి అవుతూ విసర్జనకు గురవుతూ ఉంటుంది.
- మూత్రంలో మూలకాలు, కణాలు, స్ఫటికాలు, కఫం, బ్యాక్టీరియా కూడా ఉంటాయి.
- రక్తంలో, మూత్రంలో వేర్వేరు పరిమాణాల్లో ఒకే రకమైన మూలకాలు ఉంటాయి.
- అమ్మోనియా, సల్ఫేట్, ఫాస్ఫేట్, క్లోరైడ్, మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం, సోడియం, క్రియాటినిన్, యూరిక్ యాసిడ్, యూరియాలు మూత్రంలో ఉంటాయి.

మూత్రనాళ ఇన్‌ఫెక్షన్!

ఈ వ్యాధికి 'ఇ కొలై' అనే బ్యాక్టీరియా కారణమే అయినా, తీవ్రత పెరగడానికి దోహదపడేది డీహైడ్రేషన్. తగినంత నీరు తాగకపోవడం వల్ల మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు మరింత తీవ్రమై మూత్రపిండాలను పాడు చేస్తాయి. కాబట్టి ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలిసి మందులు వాడుతూ, వీలైనంత ఎక్కువ నీరు తాగుతూ ఉండాలి. నీరు తాగడం వల్ల వెలువడే మూత్రం ద్వారా ఇన్‌ఫెక్షన్ తాలూకు సూక్ష్మక్రిములు బయటకు వెళ్లిపోయి, ఇన్‌ఫెక్షన్ అదుపులోకి వస్తుంది. ఈ రుగ్మతను వదిలించాలంటే...

- రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగాలి.
- ఎక్కువ సమయంపాటు మూత్రాన్ని ఆపుకోకూడదు.
- వదులైన, గాలి చొరబడే లోదుస్తులు ధరించాలి.

లక్షణాలు ఇవే!

- మూత్రవిసర్జన సమయంలో మంట, నొప్పి.
- తరచుగా మూత్రవిసర్జన చేయవలసి రావడం
- అతి స్వల్ప పరిణామంలో మూత్రం రావడం
- మూత్రం దుర్వాసన, రక్తం కనిపించడం
- మూత్రం ముదురు చాక్లెట్ రంగులో ఉండడం
- పురుషుల్లో పురీషనాళం భాగంలో, మహిళల్లో కటి భాగంలో నొప్పి
- నడుము నొప్పి
- వాంతులు
- తల తిరుగుడు.

మూత్ర సమస్యలు



రంగును బట్టి నీరు!

మూత్రం రంగును బట్టి మనం తీసుకుంటున్న నీరు సరిపోతుందో లేదో తెలుసుకోవచ్చు. వేసవిలో డీహైడ్రేషన్‌కు గురవకుండా ఉండాలంటే మూత్రం రంగును పరిశీలించుకుంటూ ఉండాలి. ఈ పట్టిక అందుకోసమే....

- మీ మూత్రం ఈ రంగులో ఉంటే మీరు సరిపడా నీరు తాగుతున్నారని అర్థం. ఇకముందు కూడా ఇదే అలవాటును కొనసాగించండి.
- ఫర్వాలేదు. అయినా తీసుకుంటున్న నీటికి మరొక గ్లాసు నీళ్ల జత చేస్తే డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశమే ఉండదు.
- నీళ్లు తాగే సమయం ఆసన్నమైందని అర్థం. మూత్రం ఈ రంగులో ఉంటే మరో గంటలోపు కనీసం అర లీటరు నీరు తాగాలి. ఎండలో ఉన్నట్లయితే, ఒక లీటరు తప్పనిసరిగా తాగాలి.
- మీరు మీ శరీరాన్ని వెంటనే హైడ్రేట్ చేయాలి. నీడ పట్టున ఉంటే కనీసం అర లీటరు, ఎండలో ఉంటే ఒక లీటరు నీరు వెంటనే తాగాలి.
- మీ శరీరంలో నీటి శాతం పడిపోయిందని మూత్రం చెబుతోంది. వెంటనే కనీసం రెండు లీటర్ల నీరు తాగాలి. మీ మూత్రం ఎరుపు లేదా గోధుమ రంగుకు మారితే వెంటనే వైద్యులను సంప్రతించండి.

తెలుసుకుందాం

దోమల దాడి కొందరి మీదే ఎందుకు?

డెంగు, వైరల్ ఫీవర్స్ దంచి కొడుతున్నాయి. ఈ జ్వరాలకు కారణమయ్యే దోమల బెడద కొందరికి విపరీతంగా ఉంటుంది. దోమలు కొందర్నే ఎంచుకుని మరీ కుడుతూ ఉంటాయి. ఇలా ఎందుకో తెలుసుకుందాం!

మగ దోమలు పూల మకరందాన్ని ఆహారంగా ఎంచుకుంటే ఆడదోమలు మానవ రక్తంలోని నిర్దిష్ట ప్రొటీన్లను ఆహారంగా తీసుకుంటూ గుడ్లను పెడుతూ ఉంటాయి. కాబట్టి ఆడ దోమల కాటు నుంచి ఎవరూ తప్పించుకోలేరు. అయితే దోమలు కొందర్నే కుడుతూ ఉండడానికి కొన్ని కారణాలున్నాయి. అవేంటంటే...

- **దుస్తులు:** తేలిక రంగు దుస్తులకు బదులుగా ముదురు రంగు దుస్తులు దోమలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. హాఫ్ స్లీవ్ చొక్కాలు, డ్రస్సులు, పొట్టి దుస్తులు వేసుకున్నప్పుడు దోమలు కుట్టడానికి వాటికి కావలసినంత ఉపరితలం దొరుకుతుంది. ఈడిస్ అనే డెంగూ కారక దోమ, కాళ్ల మీద కంటే చేతుల మీదే ఎక్కువగా కుడుతుంది. మలేరియా కారక దోమలైన అనాఫిలిస్‌లు, కాళ్ల మీద ఎక్కువగా కుడతాయి. కాబట్టి దోమలు విజృంభించే సీజన్‌లో ఒంటి నిండా లేత రంగు దుస్తులు వేసుకుంటూ ఉండాలి.
- **రక్త గ్రూపులు:** నిర్దిష్ట రక్తగ్రూపులు కలిగిన వాళ్లనే దోమలు ఎక్కువగా కుడతాయనే శాస్త్రీయ ఆధారాలున్నాయి. మరీ ముఖ్యంగా ఇతర రక్తగ్రూపులతో పోలిస్తే, 'ఒ' రక్తగ్రూపు దోమలను ఎక్కువగా ఆకట్టుకుంటుంది. నిర్దిష్ట రక్తగ్రూపులోని రసాయనాలు చర్మంలోకి విడుదలవుతూ దోమలను ఆకట్టుకోవడమే ఇందుకు కారణం.
- **శరీర తాపమానం:** ఆడ దోమల యాంటీనాలు వేడిని కనిపెట్టగలుగుతాయి. శరీర తాపమానాల్లో ఒక డిగ్రీ హెచ్చుతగ్గులను సైతం అవి ఎంతో దూరం నుంచే పసిగట్టగలుగుతాయి. కాబట్టి శరీరంలో ఎక్కువ ఉష్ణం జనించే తత్వం కలిగిన వాళ్ల దోమల్ని ఎక్కువగా ఆకట్టుకుంటారు. ఊబకాయులు, క్రీడాకారులు, మెటబాలిజం ఎక్కువగా ఉండేవారి శరీరాల్లో వేడి ఎక్కువగా జనిస్తూ ఉంటుంది. వీళ్ల తేలికగా దోమ కాటుకు గురవుతూ ఉంటారు.
- **శ్వాస కీలకం:** వదిలే గాలిలో కార్బన్‌డయాక్సైడ్ మోతాదు కూడా దోమలను ఆకర్షిస్తుంది. మెటబాలిజం ఎక్కువగా ఉన్నవాళ్ల వదిలే గాలిలో కార్బన్ డయాక్సైడ్ కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దోమలు వాళ్లనే ఎక్కువగా కుడతాయి.
- **చమట:** ప్రతి మనిషి శరీరం మీదా హానికారకం కాని బ్యాక్టీరియా ఉంటుంది. అలాగే ప్రతి వ్యక్తి విడుదల చేసే చమట కూడా ప్రత్యేకమైన వాసనను,



గుణాలనూ కలిగి ఉంటుంది. కొంతమంది స్వేదంలోని రసాయనాల వాసనలు ఆడ దోమలను ఎక్కువగా ఆకట్టుకుంటాయి.
- **గర్భిణులు:** ప్రెగ్నెన్సీలో విడుదలయ్యే హార్మోన్లు మెటబాలిజంను, శరీర వేడిని పెంచుతాయి. ఈ రెండూ ఆడ దోమలను ఆకర్షించేవే! చివరి నెలల్లో గర్భిణుల శ్వాస వేగం, తీవ్రతలు పెరుగుతాయి. దాంతో వదిలే గాలిలో కార్బన్‌డయాక్సైడ్ మోతాదు కూడా పెరుగుతుంది. ఫలితంగా ఆడ దోమలు గర్భిణులను ఎక్కువగా కుడుతూ ఉంటాయి.
- **మద్యం:** మద్యంతో శరీర తాపమానం పెరుగుతుంది. మెటబాలిజం పెరిగి, చమట పడుతుంది. ఇవన్నీ ఆడ దోమలను ఆకర్షించేవే!

ఫుడ్ ఫ్యాక్ట్

బాదం తొక్కు తీయాలా?

బాదం తోలుతో తినొచ్చా, తోలు తీసి తినాలా? ఈ విషయంలో మనకు అనుమానాలుంటాయి. ఎలా తినడం ఆరోగ్యకరమో తెలుసుకుందాం!

తొక్కుతో ప్రయోజనాలు

తొక్కుతో కలిపి తింటే పీచు అందుతుంది. ఈ అదనపు పైపొరలో యాంటీఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. బాదం పైపొరలోని పాలీఫినాల్స్, ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి మన శరీరానికి రక్షణ కల్పించి, కణాలను కాపాడతాయి. పీచుతో రక్తంలోని చక్కెర మోతాదులు స్థిరంగా ఉంటాయి. ఫలితంగా శక్తి తగ్గకుండా ఆకలి పెరగకుండా ఉంటుంది.



తొక్కు తీసి తింటే?

తేలికగా జీర్ణమవుతాయి. తోలు తీసినప్పుడు, పీచు మోతాదు తగ్గుతుంది కాబట్టి తేలికగా శోషణ చెందుతాయి. నానబెట్టి, తోలు తీసిన బాదంలో టానిన్స్ ఉండవు కాబట్టి తేలికగా జీర్ణమవుతాయి. కాబట్టి పెద్దలు బాదం నానబెట్టి, తొక్కు తొలగించి, మిగతా వాళ్లు తొక్కుతో బాదం తినొచ్చు. పీచు ఎక్కువగా కావాలనుకునే వాళ్లు తొక్కు తీయకుండా తినాలి. తేలికగా జీర్ణం కావాలనుకునేవాళ్లు నానబెట్టి తొక్కు తీసి తినాలి.

కొన్ని ఆవిష్కరణలు ప్రపంచ గతినే మార్చివేస్తాయి. అలాంటి ఆవిష్కరణలుగా నిప్పు, చక్రం, ఆవిరి యంత్రాలు, కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి వాటిని పేర్కొనవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాయి. కానీ మరో అయిదారేళ్లలో అందుబాటులోకి రాబోతున్న 6జీ టెక్నాలజీ పనిలో మానవ ప్రమేయాన్ని అసాంతం తగ్గించనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీ మానవ-రోబో సమన్వయంతో పనులు చక్కబెట్టడానికి వీలుకల్పిస్తుండగా, రాబోతున్న 6జీ టెక్నాలజీ కృత్రిమ మేధకు మరింత వేగాన్ని అందించి అనేక రంగాల్లో మానవ ప్రమేయాన్ని దాదాపు శూన్యం చేయనుంది. ఉదాహరణకు స్వయంచోదక వాహనాలు(డ్రైవర్‌లెస్ కార్లు)ను చెప్పుకోవచ్చు.

- ఈ అధునాతన 6జీ సాంకేతికతను అందిపుచ్చుకుని అందరికన్నా ముందుగా ప్రపంచ విపణిలో మార్కెట్ అవకాశాలను కొల్లగొట్టడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా రంగంలోకి దిగింది. 2030 నాటికల్లా 6జీ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి గల సాధ్యాసాధ్యాల పరిశీలన, సూచనల నిమిత్తం ఎ.కె.తివారీ అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.
- తదనంతరం '6 మూలస్తంభాల వ్యూహంతో 6జీ విజన్'ను తదుపరి '6జీ మిషన్'ను భారత టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రవేశపెట్టడమే కాక అంతర్జాతీయ పరస్పర సహకారం నిమిత్తం భారత్ 6జీ అలయెన్స్(బీ6జీఏ)ను కూడా ఏర్పాటు చేసింది. ఈవిధమైన కార్యాచరణల నేపథ్యంలో అసలు 6జీ టెక్నాలజీ అంటే ఏమిటి? ప్రస్తుత తరం 5జీ టెక్నాలజీతో పోల్చిన ఏవిధంగా మెరుగైనది? 6జీ సాంకేతికత కోసం జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలేమిటి? అన్న కోణంలో పరిశీలన జరపాల్సి ఉంది.

6జీ అంటే?

- వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీని దాని పరిణామ క్రమం ఆధారంగా వివిధ జనరేషన్లుగా విభజించి పేర్కొంటారు. ఈవిధంగా ఇప్పటివరకూ 1 నుంచి 5 తరాలు అందుబాటులోకి రాగా, మరింత అభివృద్ధి చెందిన తరంగా రాబోతున్న తదుపరి తరాన్ని 6వ తరం గా పేర్కొంటున్నారు.



6G టెక్నాలజీ భారత్ సంసిద్ధత

5జీతో పోల్చితే 6జీ ఏవిధంగా మెరుగైనది?

- వేగపరంగా 5జీ ఒక మిల్లీ సెకన్(1000 మైక్రో సెకన్లు)లో 20 గిగాబైట్ల డేటాను అందిస్తుంది. అదే 6జీ 1 మైక్రో సెకన్‌లో వెయ్యి గిగాబైట్ల(ఒక టెరాబైట్) డేటాను అందిస్తుంది. అంటే 6జీ సాంకేతికత వేగంలో 5జీ కన్నా వెయ్యిరెట్లు మెరుగైనది.
- అదేవిధంగా లేటెన్సీ అనగా నెట్‌వర్క్‌లోని ఒక పాయింట్ నుంచి మరో పాయింట్‌కు సమాచారం(డేటా) చేరడానికి పట్టే సమయం(జాప్యం)ను, 5జీతో పోల్చిన 6జీ విపరీతంగా తగ్గిస్తుంది. 5జీలో ఈ లేటెన్సీ 5 మిల్లీ సెకన్లు కాగా, 6జీతో 'అల్ట్రాలో లేటెన్సీ(అతి తక్కువ జాప్యం)' సాధ్యపడి ఒక మైక్రో సెకనుకు ఈ జాప్యం పరిమితం అవుతుందని అంచనా. ఇంతవరకూ ఉపయోగించని 'టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలను 6జీ సాంకేతికతలో వినియోగించనుండటంతో అల్ట్రాలో లేటెన్సీ సాధ్యం కానుంది. టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలు విద్యుదయస్కాంత వర్ణ పటంలో పరారుణ తరంగాలు, మైక్రోవేవ్ తరంగాల మధ్య ఉంటాయి. చాలా సూక్ష్మంగానూ, సున్నితంగానూ ఉండే ఈ తరంగాలు భారీస్థాయిలో డేటాను వేగంగా చేరవేయగలవు.
- 5జీ సాంకేతికత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'ను ప్రవేశపెట్టడానికి సహకరించి, మానవుల నుంచి యంత్రానికి కమ్యూనికేషన్‌ను సాధ్యం చేసింది. ఈ పునాదిపై మరింత విస్తృతీకరించిన 6జీ సాంకేతికత మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్‌ను(యంత్రాల మధ్య సమాచార బదిలీ) సాధ్యపరిచింది. ఇది చాలా వేగంగా జరిగే కమ్యూనికేషన్ కావడంతో మానవ మెదళ్లు గ్రహించగలవు.

6జీ టెక్నాలజీ ద్వారా రానున్న మార్పులు

1. కమ్యూనికేషన్ల పరంగా: నెట్‌వర్క్ స్లైకింగ్ ప్రక్రియ ద్వారా విస్తృత నెట్‌వర్క్‌లను అతి చిన్న ప్రత్యేక నెట్‌వర్క్‌లుగా విభజించడం వల్ల వివిధ రకాల సమాచార రద్దీని ప్రాధాన్యతల ఆధారంగా విభజించి నిర్వహించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా సమాచార ప్రసారంలో విస్తృతస్థాయిలో భద్రత లభిస్తుంది. ఎన్‌క్రిప్షన్, హోలో గ్రాఫిక్ కమ్యూనికేషన్, మెరుగైన కృత్రిమమేధ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీల ద్వారా మరింత భద్రతతో పాటు స్పష్టత, నిజ సమయ సమాచార బదిలీ(రియల్ టైమ్ డేటా ట్రాన్స్‌ఫర్) సాధ్యమవుతాయి. మరింత వేగంగా ఫైల్ డౌన్ లోడింగ్, వెబ్‌సెర్ఫ్, వర్చువల్ రియాలిటీ, సమాచార మార్పిడి సాధ్యమవుతాయి.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

2. రవాణారంగం: వేగం, లేటెన్సీల పరంగా, మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, త్రీడీ సాంకేతికతలతో ఈ 6జీ టెక్నాలజీ తీసుకువచ్చే మార్పుల కారణంగా స్వయంచోదిత వాహనాలు(డ్రైవర్ లెస్ కార్లు), ఎయిర్ ట్రాఫిక్ నియంత్రన; బుల్లెట్ ట్రైన్స్ వంటి రవాణారంగ అంశాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

3. స్మార్ట్ సిటీస్, గ్లోబల్ కనెక్టివిటీ: రియల్ టైమ్ మానిటరింగ్, గ్లోబల్ కనెక్టివిటీ(ప్రజలు, పరికరాలు, సిస్టమ్స్, వివిధ సంస్థల మధ్య నిరంతర అనుసంధానత) వల్ల ట్రాఫిక్ నుంచి, ఫ్రిజ్‌లో సరుకుల వరకూ అన్నిటి సమాచారం అప్రయత్నంగా బదిలీ అయిపోతున్నాయి. అనుసంధానతలు పెరగడం వల్ల పట్టణ-గ్రామ అంతరాలు తొలగిపోతాయి.

4. విద్య, పరిశోధన రంగాలు: విద్యార్థులకు విద్యారంగంలో ప్రపంచవ్యాప్త అనుసంధానత ఏర్పడుతుంది. వర్చువల్ క్లాసెస్, టీచర్స్, క్లాస్‌మేట్స్‌తోపాటు సమాచార విశ్లేషణ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్(అనుభవ పూర్వక అధ్యయనం) సాధ్యమవుతాయి. అదేవిధంగా అన్ని రంగాల్లో సంక్లిష్ట అంశాలపరంగా కూడా పరిశోధనకు అవకాశం ఏర్పడుతుంది. పరిశోధనల్లో వేగం సాధ్యమవుతుంది.

5. ఆరోగ్యరంగం: టెలీ మెడిసిన్, కృత్రిమమేధ మద్దతుతో క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా రోబోటిక్ పద్ధతిలో నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వేగం, వైద్యులతో అనుసంధానత మొదలైన సౌలభ్యాలు కలుగనున్నాయి.

6. వ్యవసాయ, వ్యాపార, ఆర్థిక రంగాలు: వ్యవసాయ, వ్యాపార రం గాల్లో డిమాండ్ - సప్లయ్ - ఉత్పత్తి నియంత్రణపరంగా తక్షణ సమాచార బదిలీ విస్తృతస్థాయిలో వివిధ వ్యవస్థల మధ్య జరిగి మార్కెట్లు విస్తరిస్తాయి. నష్టభయం తగ్గుతుంది. వేగవంతమైన కృత్రిమమేధతో నిర్ణయాలు, విశ్లేషణ, ఆచరణపరమైన జాప్యాన్ని నివారించవచ్చు. ఇవి సమిష్టిగా ఆర్థికవ్యవస్థ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

దిక్సూచి DIKSUCHI

7. అంతరిక్ష రంగం, రక్షణ రంగం, విపత్తు నిర్వహణ: అంతరిక్ష ప్రయోగాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోల్ ద్వారా వాహక నౌకలు, రోబోలు వంటి వాటిని తక్షణం నియంత్రిస్తూ వైఫల్యాలను తగ్గించవచ్చు. అత్యధిక రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలు ఖగోళ పరిస్థితుల, పదార్థాల విస్పష్ట అంచనాకు సహకరిస్తాయి. అదేవిధంగా సుదూర ఖగోళ అన్వేషణ సాధ్యమై దూరాన ఉన్న నక్షత్రాలు, గ్రహాల సమాచారం లభ్యమవుతుంది. మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్, వేగం వల్ల వివిధ రకాల భౌగోళిక పరిస్థితుల్లో, సరిహద్దుల్లో, యుద్ధ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ప్రయోజనకరం.

8. పర్యావరణం: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వల్ల ప్రయాణ అవసరాలు తగ్గి కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గుతుంది. అదేవిధంగా స్మార్ట్ సిటీస్, స్మార్ట్ మీటర్స్ వంటి వాటివల్ల విద్యుత్, నీరు వృథా తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో..)

నవ్య | చిత్రజ్యోతి



జాగ్రత్త సుమా!

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే తారల్లో రష్మిక మందన్న ఒకరు. అయితే ఆమె పోస్టులు పెట్టి నెల రోజులయింది. ఈ స్వల్ప విరామానికి గల కారణాన్ని ఆమె తాజాగా అభిమానులతో పంచుకున్నారు. "నెల క్రితం నాకు ఓ ప్రమాదం జరిగింది. ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదు. గాయం చిన్నదే. వైద్యుల సలహా మేరకు ఇంటిపట్టునే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాను. త్వరలోనే సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతాను. జీవితం చాలా విలువైంది. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండండి. రేపనేది ఉంటుందో లేదో తెలీదు. జాగ్రత్త సుమా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. రష్మిక ప్రస్తుతం 'పుష్ప 2', 'కుబేర', 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రాల్లో నటిస్తున్నారు.

అడ్వాన్స్ బుకింగ్స్‌లో దుమ్మురేపుతున్న దేవర



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారాస్థాయిలో పెంచాయి. 'దేవర పార్ట్ 1' ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సినిమా రిలీజ్ కాకముందే బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. నార్త్ అమెరికాలో ఈ చిత్రం ప్రీమియర్ షో టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయిపోయాయి. ఇప్పటికే 8 లక్షల డాలర్లను (25 వేల టిక్కెట్లు) అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో వసూలు చేసి దుమ్మురేపుతోంది. 'దేవర' చిత్రం ట్రైలర్ ఈ రోజు విడుదల కానుంది.

ఇన్ ప్రోగ్రెస్

నాటి మద్రాసు నేపథ్యంలో కాంత

రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కలిసి నిర్మించే 'కాంత' చిత్రం షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ జంటగా నటించే ఈ సినిమాకు సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. సముద్రఖని కీలక పాత్రధారి. రామానాయుడు



స్టూడియోలో తొలి క్లాప్ ఇచ్చి 'కాంత' చిత్రానికి శ్రీకారం చుట్టారు విక్టరీ వెంకటేశ్. 1950 నాటి మద్రాసు బ్యాక్‌డ్రాప్‌లో మానవ భాగోద్వేగాల లోతుల్ని ఆవిష్కరించే ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంటుందని దర్శకుడు చెప్పారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ 60వ సంవత్సరం సందర్భంగా స్పిరిట్ మీడియా కొత్త శకానికి నాంది పలుకుతూ తీస్తున్న సినిమా ఇదనీ రానా చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంత్ పొట్లూరి, రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు

విడిపోయిన జయం రవి దంపతులు



కోలీవుడ్ హీరో జయం రవి, ఆరతి జంట విడిపోయింది. తన భార్య ఆరతికి విడాకులు ఇస్తున్నట్లు జయం రవి ప్రకటించారు. 2009లో జయం రవి ఇరువైపు కుటుంబీకుల అంగీకారంతో ఆరతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వీరి వైవాహిక జీవితం 15 ఏళ్లపాటు సాఫీగా కొనసాగింది. కొద్ది నెలలకు ముందు ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో విడిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం జయం రవి తన విడాకుల విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. సినిమాల్లోనూ, నిజజీవితంలోనూ తాను ఎల్లప్పుడు పారదర్శకంగానే ఉంటానని, ఎలాంటి దాపరికాలకు తావులేదని భారమైన హృదయంతో ఓ చేదు విషయాన్ని చెప్పదలిచానని పేర్కొంటూ ఆరతితో వైవాహిక జీవితానికి స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తొందరపడి ఈ నిర్ణయం తీసుకోలేదని, ఆచితూచి, తనవారి సంక్షేమం దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని జయం రవి తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

మెరుపై వచ్చిండే..



'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో'ను మేకర్స్ విడుదల చేశారు. 'మెరుపై వచ్చిండే.. మడత పెట్టి వచ్చిండే.. మనసు పెట్టి వచ్చిండే' అంటూ సాగే ఈ హుషారైన మాస్ గీతంలో రజనీ సరసన మంజూ వారియర్ ఆడిపాడారు. అనిరుధ్ సంగీతం అందించిన ఈ పాటకు శ్రీనివాస మౌళి లిరిక్స్ అందించారు. నకాశ్ ఆజీజ్, అరుణ్ కౌండిన్య, దీప్తి సురేశ్ ఆలపించారు.

దసరాకి వస్తున్నాం



సుహాస్, సంగీర్తన జంటగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన 'జనక అయితే గనక' చిత్రం కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు. దసరా సందర్భంగా అక్టోబరు 12న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సందీప్‌రెడ్డి దర్శకుడు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ వీడియో విడుదల చేశారు. ఈ సినిమా ఓవర్‌సీస్ హక్కులు సొంతం చేసుకున్న సుహాస్‌కి అందరూ ఫోన్ చేసి రిలీజ్ ఎప్పుడు అని అడుగుతుంటారు. ఈ గోల భరించలేక సుహాస్ దిల్ రాజుకు ఫోన్ చేసి రిలీజ్ డేట్ గురించి అడగడం, 'మనది ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా కనుక దసరా సందర్భంగా అక్టోబర్ 12న విడుదల చేస్తున్నాం' అని చెప్పడం .. ఇలా ఆసక్తికరంగా ఆ వీడియో రూపొందించారు.

అన్ని ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రం



'క్రేజీ బాయ్' ఫేమ్ దిలీప్‌ప్రకాశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉత్సవం'. ప్రకాశ్‌రాజ్, రాజేంద్రప్రసాద్, నాజర్, రెజీన కసాండ్ర కీలక పాత్రలు పోషించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ నిర్మించారు. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దిలీప్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ఎంతో ఉన్నతమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం. ఇందులో కథనే హీరో. రంగస్థల కళాకారుల జీవితాలతో ముడిపడిన చిత్రమిది. ఎంతో అనుభవమున్న నటులు ఇందులో నటించారు. మంచి సందేశం, ప్రేమ కథ, వినోదంతో పాటు ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రమిది. అనూప్ రూబెన్స్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాకు బ్రహ్మ కడలి అందించిన ఆర్ట్ వర్క్ ప్రత్యేకాకర్షణ. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. నా నెక్ట్స్ సినిమా అదే తరహాలో ఉండబోతోంది'.

నా ఇంటి పేరు అది కాదు



నటిగా సెలక్టివ్ పాత్రలు ఎంచుకుని తన నటనతో అందరినీ ఫిదా చేస్తుంటారు నిత్యామేనన్. ఇటీవలే మీడియాతో ముచ్చటించిన ఆమె.. అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసే ఓ విషయాన్ని పంచుకున్నారు. "చాలా మంది నా ఇంటి పేరు మేనన్. నా స్వస్థలం కేరళ అనుకుంటారు. నిజానికి నా ఇంటి పేరు మేనన్ కాదు. నా పేరు ఎన్.ఎస్.నిత్య. ఎన్ అంటే మా అమ్మ నళిని. ఎస్ అంటే మా నాన్న సుకుమార్. మాది బెంగుళూరు. మా కుటుంబం మూడు తరాలుగా బెంగుళూరులోనే ఉంటోంది. మేమంతా ఇంటి పేరును గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతాం. మా కులమిదని చెప్పుకోవడం కూడా మాకు ఇష్టం ఉండదు. కేవలం న్యూమరాలజీ ఆధారంగా నా పేరు తర్వాత 'మేనన్' జతచేసుకున్నాను" అని చెప్పారు.

డబుల్ థ్రిల్‌తో...



శ్రీసింహ కోడూరి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019లో విడుదలై సూపర్ సక్సెస్ సాధించిన 'మత్తు వదలరా' సినిమాకు రెండో భాగం. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా శ్రీసింహ మీడియాతో మాట్లాడారు.

"మొదటి భాగంతో పోల్చితే ఇందులో చాలా మార్పులు జరిగాయి. రెండో భాగం ఒక డిఫరెంట్ థ్రిల్లర్‌గా ఎన్నో ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లతో అలరిస్తుంది. ఇందులో నేను, సత్య పోషించిన పాత్రలు డెలివరీ బాయ్స్ నుంచి స్పెషల్ ఏజెంట్స్‌గా మారే క్రమం ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. ఫరియా అబ్దుల్లా తనకు సరిపోయే పాత్రను ఇందులో పోషించారు. ఆమె ఓ పాట పాడటమే కాకుండా కొరియోగ్రఫీ కూడా అందించారు. ఈ సినిమా మొదటి భాగం కంటే డబుల్ థ్రిల్‌ను పంచుతుంది. ఈ మూవీ ఫ్రాంఛైజీని కొనసాగించే ఆలోచనల్లో ఉన్నాం" అని చెప్పారు.

మధ్యతరగతి మందహాసం



సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. దసరాకి ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. మధ్యతరగతి యువకుడి పాత్ర పోషిస్తున్న సుధీర్‌బాబు స్కూటర్ నడుపుతూ చిరునవ్వుతో స్కూల్ పిల్లలను పలకరిస్తూ కనిపించారు. ప్రేమ, అనుబంధాలకు అర్థం చెప్పే సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. ఈ నెల 12న టీజర్ విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఆర్ణ ఈ సినిమాలో కథానాయిక.

జాతకం పూర్తి



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా రూపొందుతున్న 'సారంగపాణి జాతకం' షూటింగ్ పార్ట్ పూర్తయింది. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'నాకు ఎప్పటినుంచో పూర్తి వినోదాత్మక సినిమా తీయాలనే కోరిక ఉంది. జంధ్యాలగారితో ఓ కామెడీ ఫిల్మ్ తీయాలనుకున్నాను కానీ కుదరలేదు. ఆ కోరిక ఇప్పుడు 'సారంగపాణి జాతకం' సినిమాతో తీరుతోంది. మనిషి భవిష్యత్ అతని చేతి రేఖల్లో ఉంటుందా, లేక అతని చేసే చేతల్లో ఉంటుందా అని ప్రశ్నకు జవాబు ఇచ్చే పూర్తి హాస్య రస చిత్రం ఇది. మా సంస్థలో రెండు విజయవంతమైన సినిమాలు చేసిన మోహనకృష్ణ వినోదభరితంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఖర్చు పరంగా, టెక్నికల్ పరంగానూ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా చేస్తున్నాం' అని చెప్పారు




యూత్, ఫ్యామిలీ ఆడియన్సే టార్గెట్



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ విడుదల చేశారు. విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వరద బాధితుల సహాయార్థం తన వంతు ఆర్థిక సహాయాన్ని చంద్రహాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రహాస్ మాట్లాడుతూ 'ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయాలని హీరోగా మారాను. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నాను. వాటిల్లో ఫస్ట్ మూవీ 'రామ్‌నగర్ బన్నీ'. అక్టోబరులో విడుదలవుతుంది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు.

సినిమాగా యండమూరి అంతర్ముఖం



ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ రాసిన నవలల్లో అగ్ర తాంబూలం అందుకొన్న 'అంతర్ముఖం' నవల ఇప్పుడు సినిమాగా రూపొందనుంది. భీమవరం టాకీసు పతాకంపై 117వ చిత్రంగా ఇది రూపొందుతుందని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. యండమూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. సీనియర్ ఛాయాగ్రాహకుడు మీర్ ఈ సినిమాకు పని చేస్తున్నారు. అలాగే అల్లాణి శ్రీధర్, నరసింహ నంది దర్శకత్వంలో రెండు సినిమాలు కూడా తీసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రామసత్యనారాయణ చెప్పారు.

మలయాళ హక్కులు కొన్నారు



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రం మలయాళ థియేట్రికల్ రైట్స్ హీరో దుల్కర్ సల్మాన్‌కు చెందిన వేఫరర్ ఫిల్మ్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ చూసి దుల్కర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'క' తెలుగు హక్కుల్ని నిర్మాత వంశీ నందిపాటి ఇప్పటికే పొందారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.

బిజినెస్

రూ. 2000 తగ్గిన వెండి ధర

న్యూఢిల్లీ: ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ.700 తగ్గి రూ.73,500కు దిగి వచ్చింది. కిలో వెండి ఏకంగా రూ.2,000 తగ్గుదలతో రూ.83,800 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒకదశలో 2,522.90 డాలర్లు, వెండి 28.44 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

మళ్లీ లాభాల్లోకి మార్కెట్

గతవారం వరుసగా 4 రోజులు నష్టపోయిన ఈక్విటీ మార్కెట్ సోమవా రం మళ్లీ లాభాల్లోకి మళ్లింది. సెన్సెక్స్ 375.61 పాయింట్ల వృద్ధితో 81,559.54 వద్ద ముగిసింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. నిఫ్టీ సైతం 84.25 పాయింట్లు పెరిగి 24,936.40 వద్ద స్థిరపడింది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు భారీ స్పందన

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.6,560 కోట్ల మెగా ఐపీఓకు భారీ స్పందన లభించింది. ఆఫర్ ప్రారంభ మైన నాలుగు గంటల్లోనే ఇష్యూ సైజుకు సమాన మైన బిడ్లు లభించగా.. ఇష్యూ తొలిరోజు పూర్తయ్యేస రికి 2.01 రెట్ల బిడ్లు దాఖలైనట్లు ఎన్ఎస్ఈ డేటా ద్వారా వెల్లడైంది.

- వెస్టర్న్ క్యారియర్స్ ఐపీఓ ఈనెల 13న ప్రారంభమై 18న ముగియనుంది.

2027 నాటికి మస్క్ ట్రిలియనీర్?

ప్రపంచంలో ఆ ఘనత సాధించనున్న తొలి వ్యక్తి

2028 నాటికి అదానీ, 2033 నాటికి అంబానీ

న్యూఢిల్లీ: కుబేరుల సంపద మరింత పెరిగి పోతోంది. విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా, స్పేస్ఎక్స్‌ల అధినేత ఎలాన్ మస్క్ సంపద 2027 నాటికి లక్ష కోట్ల డాలర్లకు చేరనుంది. ఇదే జరిగితే ప్రపంచ చరిత్రలో తొలి ట్రిలియనీర్‌గా (లక్ష కోట్ల డాలర్లు) మస్క్ రికార్డు సృష్టిస్తారు. ప్రస్తుత డాలర్-రూపాయి మారకం రేటు ప్రకారం ఆయన సంపద విలువ రూ.83.96 లక్షల కోట్లకు సమానం. అయితే ఇందుకోసం మస్క్ సంపద 2027 వరకు ఏటా సగటున 110 శాతం చొప్పున పెరగాల్సి ఉంటుందని 'ఇన్ఫార్మా కనెక్ట్ అకాడమీ' ఒక నివేదికలో తెలిపింది. మస్క్ ఇప్పటికే 23,700 కోట్ల డాలర్ల (సుమారు రూ.19.89 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా కొన సాగుతున్నారు.





అదే రేసులో అదానీ, అంబానీ

మన దేశానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు గౌతం అదానీ, ముకేశ్ అంబానీ కూడా ఈ స్థాయికి చేరేందుకు పోటీపడుతున్నారు. గౌతం అదానీ 2028 నాటికి, ముకేశ్ అంబానీ 2033 నాటికి ఈ స్థాయికి చేరే అవకాశం ఉందని ఆ సంస్థ అంచనా. అయితే ఇందుకోసం అదానీ సంపద ఏటా ప్రస్తుత వృద్ధిరేటు 123 శాతం చొప్పున పెరగాల్సి ఉంటుంది. గౌతం అదానీ ప్రస్తుతం 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.39 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచ కుబేరుల్లో 13వ స్థానంలో ఉన్నారు. ముకేశ్ అంబానీ 11,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.9.32 లక్షల కోట్లు) సంపదతో ప్రస్తుతం ఆసియాలో అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. ఇక 2035 కల్లా అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) కూడా లక్ష కోట్ల డాలర్ల స్థాయికి చేరి, ఆ స్థాయికి చేరిన తొలి బారత కంపెనీగా రికార్డు సృష్టించనుందని తెలిపింది.

రేస్‌లోని ఇతరులు

ఎలాన్ మస్క్, గౌతంఅదానీ, ముకేశ్ అంబానీలతో పాటు మరికొంత మంది ప్రపంచ పారిశ్రామికవేత్తలు కూడా వెనకా ముందుగా ట్రిలియనీర్ల జాబితాలో చేరే అవకాశం ఉందని 'ఇన్ఫార్మా కనెక్ట్ అకాడమీ' తెలిపింది. అమెరికా టెక్ దిగ్గజం ఎన్‌విడియా అధినేత జెన్సెన్ హువాంగ్, ఇండోనేషియా పారిశ్రామికవేత్త ప్రజోగో పంగెస్తు, ఫ్రెంచ్ వ్యాపారవేత్త బెర్నార్డ్ అర్నాల్ట్, ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఈ జాబితాలో చేరే అవకాశం ఉందని పేర్కొంది.

ఐఫోన్ 16 వచ్చేసింది..

- నాలుగు వేరియంట్లలో లభ్యం ● ప్రారంభ ధర రూ.79,900
- ఈ నెల 20 నుంచి విక్రయాలు ప్రారంభం



కపర్టినో(కాలిఫోర్నియా): ప్రపంచ టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ 16 సిరీస్‌ను ఆవిష్కరించింది. అమెరికా, కాలిఫోర్నియాలోని కపర్టినోలో ఉన్న యాపిల్ పార్క్‌లో సోమవారం నిర్వహించిన 'ఇట్స్ గ్లో టైమ్' కార్యక్రమంలో కొత్త ఫోన్లను లాంచ్ చేసింది. ఏ 18 బయోనిక్ చిప్, యాపిల్ ఇంటెలిజెన్స్, విజువల్ ఇంటెలిజెన్స్, చాట్‌జీపీటీ వంటి ఆధునిక సాంకేతికతలతోపాటు ప్రైవేట్ క్లౌడ్ కంప్యూట్, కెమెరా కంట్రోల్, 48 మెగాపిక్సెల్ ఫ్యూజన్ కెమెరా వంటి ఫీచర్లతో కూడిన ఐఫోన్ 16 నాలుగు వేరియంట్ల(ఐఫోన్ 16, 16 ప్లస్, 16 ప్రో, 16 ప్రో మ్యాక్స్)లో లభించనుంది. దీని ప్రారంభ ధర 799 డాలర్లు. ఈ నెల 13(శుక్రవారం) నుంచి ఐఫోన్లను బుక్ చేసుకోవచ్చని, 20వ తేదీ నుంచి విక్రయాలను ప్రారంభించనున్నట్లు యాపిల్ వెల్లడించింది. కంపెనీ కొత్త ఐఫోన్‌తోపాటు యాపిల్ వాచ్ 10 సిరీస్‌ను, ఎయిర్ పాడ్స్ 4ను సైతం లాంచ్ చేసింది.

వేరియంట్	సైజు	ప్రారంభ ధర	
	అంగుళాలు	డాలర్లు	రూ.
16	6.1	799	79,900
16 ప్లస్	6.7	899	89,900
16 ప్రో	6.3	999	1,19,900
ప్రో మ్యాక్	6.9	1,199	1,44,900

యాపిల్ వాచ్ సిరీస్ 10 : ఇప్పటివరకు అతిపెద్ద స్క్రీన్‌తో కూడిన యాపిల్ వాచ్ 10 సిరీస్‌ను 30 శాతం అధిక స్క్రీన్ ఏరియా, 40 శాతం అధిక బ్రైట్‌నెస్‌తో కూడిన డిస్‌ప్లేతో డిజైన్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. అంతేకాదు, సిరీస్ 9 వాచ్‌తో పోలిస్తే 20 శాతం బరువు తక్కువ. కొత్త సిరీస్ వాచ్ స్లీప్ అప్నియాపై ముందే హెచ్చరించగలదని కంపెనీ తెలిపింది. ఈ వాచ్ జీపీఎస్ వేరియంట్ ధర 399 డాలర్లు (రూ.46,900)గా ఉంది. కాగా, జీపీఎస్ ప్లస్ సెల్యులార్ వేరియంట్ రేటు 499 డాలర్లుగా ఉంది. అలాగే, యాపిల్ వాచ్ అల్ట్రా 2ను కూడా ఆవిష్కరించింది. దీని ధర 799 డాలర్లు. కొత్త వాచ్‌లను నేటి నుంచే బుక్ చేసుకోవచ్చని, ఈనెల 20 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది.

ఎయిర్‌పాడ్స్ 4 : కొత్త తరం ఎయిర్‌పాడ్స్ ప్రారంభ ధర 129 డాలర్లు (రూ.12,900)గా ఉంది. యాంటీ నాయిస్ క్యాన్సలేషన్ వేరియంట్ రేటు 179 డాలర్లు. అంతేకాదు, ఎయిర్ పాడ్స్ మ్యాక్స్ 549 డాలర్లకు లభించనుంది. హియరింగ్ ఎయిడ్ టెక్నాలజీతో కూడిన ఎయిర్‌పాడ్స్ ప్రో 2ను సైతం కంపెనీ లాంచ్ చేసింది. ఎయిర్‌పాడ్స్ 4ను నేటి నుంచే బుక్ చేసుకోవచ్చని, ఈనెల 20 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని సంస్థ వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,800 ▼	66,500 ▼	90,000 ▼
ముంబై	71,380 ▼	65,380 ▼	81,480 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	515
చిత్తూరు	553	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	89	విజయవాడ	108
వరంగల్	89	గుంటూరు	105
కరీంనగర్	89	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	89	చిత్తూరు	111
కర్నూలు	89	నెల్లూరు	111
విశాఖపట్నం	94	అనంతపురం	111
గోదావరి	108		

మార్కెట్లో కొత్త హ్యుండయ్ అల్కజార్

న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్స్ ఎస్‌యూవీ విభాగంలోని అల్కజార్ కొత్త వెర్షన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ కారు పెట్రోల్, డీజిల్ వెర్షన్లు రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. ఢిల్లీలో పెట్రోల్ వేరియెంట్ ధర రూ.14.99 లక్షలు కాగా డీజిల్ వేరియెంట్ ధర రూ.15.99 లక్షలు. కస్టమర్ డిమాండును ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి అంచనాలను మించి కార్లను తయారుచేస్తున్నామని కంపెనీ ఎండీ ఉన్‌సూ కిమ్ అన్నారు. మరింత మంది కొత్త కస్టమర్లను ఆకర్షించడం లక్ష్యంగా ఈ కారు ధరను నిర్ణయించామని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్ చెప్పారు. తమ కంపెనీ నుంచి అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ వ్యవస్థతో (ఏడీఏఎస్) వచ్చిన ఎనిమిదో కారు ఇదని ఆయన తెలిపారు.



స్పైస్‌జెట్ సమస్య పరిశీలిస్తున్నాం



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలిస్తున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఆ సంస్థ సక్రమంగా కార్యకలాపాలు చేపట్టేందుకు వీలుగా విమానయాన రంగం లో సమతూకం తీసుకురావాలనుకుంటున్నామని, ఆ నేపథ్యంలో సంస్థ సమస్యల పరిష్కారానికి చేయూత అందించాలనుకుంటున్నామని తెలిపారు. ఫిక్కి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందించారు. దేశీయ మార్కెట్లో డిమాండు పెరుగుతున్న దృష్ట్యా మరిన్ని విమానయాన సంస్థలు సర్వీసులు ప్రారంభించడానికి వెసులుబాటు కల్పించాలన్నది తమ ధ్యేయమని మంత్రి చెప్పారు.

'ఫిట్‌డే'లో మహేశ్ బాబు పెట్టుబడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు ఇన్వెస్టర్‌గా మారారు. తాజాగా హైదరాబాద్ కేంద్రంగా పని చేసే పోషకాహార ఉత్పత్తుల స్టార్టప్ కంపెనీ 'ఫిట్‌డే'లో పెట్టుబడి పెట్టారు. తన నేతృత్వంలోని జీఎంబీ ఎంటర్‌టెయిన్‌మెంట్ కంపెనీ ద్వారా ఆయన ఈ పెట్టుబడి పెట్టారు. అయితే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందీ వెల్లడించలేదు. ఫిట్‌డే మంచి పోషకాలతో ఆరోగ్యానికి దోహదం చేసే ఆహార ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్ చేస్తోంది. మహేశ్ బాబు తమ స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టడం తమ కంపెనీ చరిత్రలో ఒక ప్రధాన మైలు రాయి అని ఫిట్‌డే తెలిపింది. ఈ పెట్టుబడితో ఫిట్‌డే తన ఉత్పత్తులను జాతీయ స్థాయికి విస్తరించనుంది.

టీ-హబ్ 'ల్యాబ్2మార్కెట్'

23 స్టార్టప్‌ల ఎంపిక

న్యూఢిల్లీ: ల్యాబ్2మార్కెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ-హబ్ సోమవారం ప్రకటించింది. వినూత్న పరిశోధనల ద్వారా మార్కెట్‌కు అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు చేపట్టడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. ఈ ప్రోగ్రామ్‌లో పాలుపంచుకునేందుకు 200 దరఖాస్తులు రాగా, 23 స్టార్టప్‌లను ఎంపిక చేసినట్లు టీ-హబ్ వెల్లడించింది. పరిశోధకులు, ఆవిష్కర్తలు తమ ఆలోచనలకు వాణిజ్య రూపమిచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుందని టీ-హబ్ పేర్కొంది. వీరిని ఇండస్ట్రీ నిపుణులు పర్యవేక్షించడం, మార్గనిర్దేశం చేయడంతోపాటు ఆలోచనలను వ్యాపారీకరించడంతో ఎదురయ్యే సవాళ్ల పరిష్కరించడంలోనూ తోడ్పడనున్నట్లు తెలిపింది.

స్పోర్ట్స్



సిరియాదే టైటిల్

0- 3తో ఓడిన భారత్ ● ఇంటర్‌కాంటినెంటల్ కప్



మంత్రి పొంగులేటికి ఆటగాళ్ల పరిచయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సొంతగడ్డపై జరిగిన ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటవిపాలై అభిమానులను నిరాశపర్చింది. సోమవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన తమ రెండో మ్యాచ్‌ను సిరియాతో ఆడిన బ్లూ టైగర్స్ 0-3తో చిత్తుగా ఓడింది. అంతకుముందు మ్యాచ్‌లో 2-0తో మారిషస్‌ను చిత్తు చేసిన సిరియా ఆడిన రెండు మ్యాచ్‌లు నెగ్గి, ట్రోఫీని కైవసం చేసుకుంది. టీమిండియాతో మ్యాచ్‌లో ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన సిరియా అదే ఆధిపత్యాన్ని తుది వరకు చెలాయించింది. 7వ నిమిషంలోనే మొహమ్మద్, 77వ నిమిషంలో ఇరాన్‌డస్ట్, ఇంజ్యూరీ టైమ్‌లో పాబ్లో గోల్స్ సాధించారు.

ట్రోఫీ ప్రదానం చేసిన సీఎం రేవంత్..: విజేత సిరియా జట్టుకు సీఎం రేవంత్ రెడ్డి ట్రోఫీ ప్రదానం చేశారు. అంతకుముందు రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇరు జట్ల ఆటగాళ్లతో కరచాలనం చేసి, మ్యాచ్‌ను ప్రారంభించారు. ముగింపు వేడుకల్లో శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంకకు ఓదార్పు విజయం

నిస్సాంక అజేయ శతకం ● ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన చివరిదైన మూడో టెస్టులో శ్రీలంక 8 వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే సిరీస్‌ను మాత్రం ఆతిథ్య జట్టు 2-1తో గెలుచుకుంది. లంక బౌలర్లు ఇంగ్లండ్‌ను రెండో ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో 219 పరుగుల లక్ష్యంతో నాలుగో రోజు సోమవారం బరిలోకి దిగిన లంక జట్టులో నిస్సాంక (127 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. ఫలితంగా పర్యాటక జట్టు 2 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేయడంతో మరో రోజు ఉండగానే ఈ టెస్టును దక్కించుకుంది. ఇంగ్లండ్‌కు 62 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా ఫలితం లేకపోయింది. అలాగే ఇంగ్లిష్ గడ్డపై లంకకిది కేవలం నాలుగో టెస్టు విజయం మాత్రమే. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 325, లంక 263 పరుగులు చేశాయి.

వర్షం లేకున్నా ఆట రద్దు

కివీస్-అఫ్ఘాన్ ఏకైక టెస్టు

నొయిడా: తొలిసారిగా అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఏకైక టెస్టు మొదటి రోజు ఆట రద్దయ్యింది. సోమవారం ఇక్కడ వర్షం లేకపోయినా స్థానిక షహీద్ విజయ్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి చిత్తడిగా ఉండడంతో టాస్ కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. గత వారం రోజులుగా ఇక్కడ వర్షాలు కురుస్తున్నాయి. నీటిని తోడేసి మైదానాన్ని ఆరబెట్టేందుకు ఇక్కడ ఆధునిక సౌకర్యాలు లేకపోగా గ్రౌండ్ స్టాఫ్‌కు కూడా పెద్దగా అనుభవం లేదు. భవిష్యత్‌లో మరోసారి ఈ స్టేడియంలో ఆడేందుకు రాబోమని అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) పేర్కొంది.

పాప్ జోరు.. డీజే హోరు

ఘనంగా ముగిసిన పారాలింపిక్స్





ఫ్రెంచ్ పాప్‌స్టార్ శాంటా

పారిస్: ఎంత అద్భుతంగా ఆరంభమయ్యాయో అంతే ఘనంగా పారిస్ పారాలింపిక్స్ ముగిశాయి. పాప్ స్టార్ల పాటలు..డీజేల మ్యూజిక్‌తో స్టేడ్ డి ఫ్రాన్స్ ఊగిపోయింది. ఇక..168 దేశాల నుంచి సుమారు 4,400 మంది దివ్యాంగ అథ్లెట్లు తమ అసమాన ప్రతిభాపాటవాలతో 12 రోజులపాటు విశ్వవ్యాప్త క్రీడాభిమానులను అలరించారు. క్రీడల ముఖ్య నిర్వాహకుడు టోనీ ఎస్టాన్‌గ్వెట్ మాట్లాడుతూ..'ఈ క్రీడలు పది కాలాలపాటు అభిమానుల మదిలో మెదులుతూ ఉంటాయి' అని అన్నారు. పారిస్ మేయర్ అనె హిడాల్గో పారాలింపిక్ పతాకాన్ని అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) అధ్యక్షుడు ఆండ్రూ పార్సన్స్‌కు అందజేశారు. ఆయన దానిని తదుపరి క్రీడల ఆతిథ్య నగరం లాస్ ఏంజిల్స్ మేయర్ కరెన్ బాస్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా గాయని బ్రాడ్‌వే స్టార్ అలీ స్ట్రోకర్ అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించింది. అనంతరం కాలిఫోర్నియా బీచ్‌లో పారా స్కేట్‌బోర్డర్లు, వీల్ చెయిర్ అథ్లెట్లు ప్రదర్శించిన విన్యాసాలకు సంబంధించిన చిత్రాన్ని ప్రదర్శించారు. ముగింపోత్సవ టిక్కెట్ల అమ్మకాలపై నిర్వాహకులు తొలుత ఆందోళన చెందినా..దానిని పటాపంచలు చేస్తూ ఫ్యాన్స్ భారీగా స్టేడియానికి తరలొచ్చారు. 76 సంవత్సరాల ఫ్రెంచ్ మ్యూజిక్ దిగ్గజం జీన్ మైకేల్ ఆధ్వర్యంలో 20 మంది డీజేలు గంటపాటు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రేక్షకులను మరో లోకంలో విహరింపజేశాయి. ఫ్రాన్స్ పాప్ స్టార్ శాంటా పాటలకు ప్రేక్షకులు ఊగిపోయారు. ఆమె పాటలకు స్టెప్పులేస్తూ హోరెత్తించారు. కాగా..అక్షర క్రమంలో అథ్లెట్ల పరేడ్ జరిగింది. భారత్ తరపున ప్రీతి పాల్, హర్విందర్ త్రివర్ణ పతకాన్ని చేబూని ముందు నడిచారు.



మహిళల మారథాన్‌లో ప్రపంచ రికార్డు



ప్రపంచ రికార్డు ప్రదర్శనతో పారాలింపిక్స్‌కు తెరపడ్డాయి. మొరాకోకు చెందిన 29 ఏళ్ల ఫాతిమా ఎల్ ఇద్రిసీ మహిళల మారథాన్‌లో వరల్డ్ రికార్డును బద్దలుగొట్టింది. రెండు గంటల 48 నిమిషాల 36 సెకన్లలో గమ్యం చేరిన ఇద్రిసీ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఈక్రమంలో జపాన్ రన్నర్ మిసాటో 2020లో నెలకొల్పిన గత రికార్డును ఆరు నిమిషాల తేడాతో సవరించింది. మెరిమ్ (మొరాకో) రజతం, మిచిషిటా (జపాన్) కాంస్య పతకం నెగ్గారు.


ఎదురులేని సినర్

యూఎస్ ఓపెన్ టైటిల్ సొంతం

ఫైనల్లో ఫ్రిట్జ్ ఓటమి



న్యూయార్క్: టాప్ సీడ్ జానిక్ సినర్ ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో అదరగొట్టాడు. ఆదివారం రాత్రి జరిగిన యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఇటలీ ఆటగాడు సినర్ 6-3, 6-4, 7-5తో 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)ను వరుస సెట్లలో ఓడించి విజేతగా నిలిచాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన సినర్.. యూఎస్ ఓపెన్ నెగ్గిన తొలి ఇటాలియన్‌గా చరిత్ర సృష్టించాడు. టైటిల్ ఫైట్‌లో సినర్‌తో పోల్చితే ఫ్రిట్జ్ ఎక్కువ విన్నర్లు సంధించినా.. అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకొన్నాడు. తొలి సెట్ ఆరంభంలో నువ్వానేనా? అన్నట్టుగా ఇద్దరూ తలపడడంతో స్కోరు 3-3తో సమమైంది. అయితే, ఏడో గేమ్‌లో టేలర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినర్.. వరుసగా మూడు గేమ్‌లు గెలిచి తొలి సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. ఇక, రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో ఆసక్తి రేగింది. కానీ, 9వ గేమ్ నెగ్గిన జానిక్.. ఆ తర్వాతి గేమ్‌లో బ్రేక్ పాయింట్‌తో రెండో సెట్‌ను కూడా దక్కించుకొన్నాడు. మూడో సెట్‌లో టేలర్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. 3-3తో ఉన్న సమయంలో ఏడో గేమ్‌లో జానిక్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఫ్రిట్జ్.. ఆ తర్వాత గేమ్‌ను గెలిచి 5-3తో పైచేయి సాధించాడు. ఈ దశలో ఒక్కసారిగా దూకుడుపెంచిన సినర్ వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి.. చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొన్నాడు. రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడడంతో తీవ్ర ఇబ్బందులు, విమర్శలకు గురైన సినర్.. టోర్నీ ఆరంభంలో కొంత తడబడినా క్రమంగా పుంజుకొని గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు.



అక్టోబరు 18 నుంచి ప్రొ. కబడ్డీ లీగ్

హైదరాబాద్‌లో ఆరంభం

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ ఆరంభానికి హైదరాబాద్ వేదిక కానుంది. సోమవారం పీకేఎల్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మ్యాచ్‌లను మూడు నగరాల్లో నిర్వహించనున్నారు. దీంట్లో భాగంగా తొలి అంచె పోటీలు అక్టోబరు 18నుంచి నవంబరు 9 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుపనున్నారు. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్-బెంగళూరు బుల్స్ తలపడతాయి. ఆ వెంటనే రెండో మ్యాచ్‌యు ముంబా-దబాంగ్ ఢిల్లీ కేసీ మధ్య జరుగుతుంది. ఇక నొయిడాలో నవంబరు 10-డిసెంబరు1 వరకు రెండో అంచె పోటీలు.. పుణెలో డిసెంబరు 3-24 మధ్య మూడో అంచె పోటీలను నిర్వహించనున్నారు. ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు.

భారత్‌కు రెండో విజయం

- 1-5తో జపాన్ చిత్తు

హులున్‌బుర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. సోమవారం జపాన్‌తో జరిగిన ఏకపక్ష మ్యాచ్‌లో 5-1 తేడాతో నెగ్గింది. సుఖ్‌జీత్ రెండో నిమిషంలోనే ఫీల్డ్ గోల్‌తో ఖాతా తెరవగా.. 60వ నిమిషంలో తన రెండో గోల్ సాధించాడు. ఇక అభిషేక్ (3), సంజయ్ (17), ఉత్తమ్ సింగ్ (54) జట్టుకు మరో మూడు గోల్స్‌ను అందించారు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ తొలి మ్యాచ్‌లో చైనాను 3-0తో ఓడించింది.

వినేశ్, బజరంగ్ రాజీనామాల ఆమోదం

రైల్వే శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ: రాజకీయాల్లో చేరిన స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగట్, బజరంగ్ పూనియా తమ రైల్వే ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వీటిని వెంటనే ఆమోదించినట్టు నార్తర్న్ రైల్వే శాఖ పేర్కొంది. అలాగే ఈ ఇద్దరి విషయంలో మూడు నెలల నోటీస్ పీరియడ్‌ను కూడా ఎత్తివేసినట్టు తెలిపింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీరికి మార్గం సుగమమైంది. గతవారమే ఇద్దరు రెజ్లర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సీజన్‌కు ముందే జిన్నింగ్ మిల్లులు సిద్ధం చేయాలి

» కొనుగోలు కేంద్రాలు వారంలో 6 రోజులు పనిచేయాలి

» పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షలో మంత్రి తుమ్మల



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లోకి పత్తి వచ్చే సీజన్‌కు ముందుగానే జిన్నింగ్ మిల్లులను సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో అన్నారు. కొనుగోలు కేంద్రాలు వారంలో ఆరు రోజుల పాటు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కనిష్ఠ మద్దతు ధర, పత్తి సేకరణ మార్గదర్శకాల గురించి రైతులకు ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), కాటన్ అసోసియేషన్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో మంత్రి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర కాటన్ వెల్ఫేర్ కమిటీతో పాటు జిల్లా కమిటీల్లోకి కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు, రైతు ప్రతినిధులను కూడా చేర్చుకోవాలని సీసీఐ ప్రతినిధులకు సూచించారు. ఈ ఏడాది సాంకేతికంగా తీసుకువస్తున్న పేమెంట్ ట్రాకింగ్ సిస్టమ్, మొబైల్ యాప్‌లతో మిల్లర్లకు కొనుగోళ్లలో మరింత పారదర్శకతకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీసీఐ, కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

హామీల చర్చను మళ్లించేందుకే 'హైడ్రా'మాలు

» కాంగ్రెస్‌పై ప్రజల్లో విరక్తి..బీఆర్ఎస్ అవుట్ డేటెడ్: సంజయ్



భగత్‌నగర్, సెప్టెంబరు 9: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల నుంచి చర్చను మళ్లించేందుకు హైడ్రా పేరుతో డ్రామాలు మొదలు పెట్టిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక, వ్యతిరేకతను దారి మళ్లించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో విరక్తి మొదలైందని అన్నారు. హైడ్రా పేరుతో సామాన్యులను కూడా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట అక్రమంగా కట్టుకున్న భవనాలు, విల్లాలు, ఫాంహౌస్‌లను కూలిస్తే సమర్థించామని, ఇప్పుడు పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకునే షాపులను, పేదల ఇళ్లను కూలుస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. అక్రమ భవనాలకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో కడుతున్న ఇళ్లకు అనుమతి ఎందుకు ఇచ్చారని, ఇప్పుడెందుకు కూలుస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ అని, రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీకి నో ఎంట్రీ బోర్డు పెట్టాశారని అన్నారు.

మేం మిత్రపక్షమే.. అధికార పక్షం కాదు:కూనంనేని

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు తాము మిత్రపక్షమే కానీ, తమది అధికార పక్షం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌తో ఎన్నికల వరకే కలిసి పనిచేశామని చెప్పారు. "కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల్లో పోటీ చేశారు. మీరు కూడా ప్రభుత్వంలో భాగస్వాములే కదా. సమస్యలు ఎందుకు పరిష్కరించరు" అని చాలా మంది తమను అడుగుతున్నట్లు కూనంనేని తెలిపారు. "మేం ప్రభుత్వంలో భాగస్వాములం అయితే మా పార్టీ నేతలు మంత్రి పదవుల్లో ఉండేవాళ్లు. రెండు పార్టీల ఉమ్మడి ఎజెండా ఉండేది" అని ఆయన సమాధానమిచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వరదలను కేంద్రప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో మానవత్వంతో ఆదుకోవాల్సింది పోయి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విపత్తు నిధుల ఖర్చుల యూసీలు ముందుగా ఇవ్వాలని కోరడం దారుణమన్నారు. వరద బాధితులకు సాయం కోసం తమ ఎమ్మెల్యే(కూనంనేని) నెల వేతనం రూ.2.50 లక్షలను సీఎం సహాయ నిధికి విరాళంగా అందించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కూనంనేని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మరోవైపు, రాష్ట్రంలో వరద ప్రమాదం గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గం పేర్కొంది. ఎంబీ భవన్‌లో తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. .

రూ.కోటి విరాళమిచ్చిన... సైజన్ గ్రూపు, ఎన్‌సీసీ

» సీఎంకు చెక్కుల అందజేత



సీఎంకు కోటి రూపాయల చెక్కును అందజేస్తున్న ఎన్‌సీసీ లిమిటెడ్ ఎండీ రంగరాజు(కుడి)

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్)కి సైజన్ గ్రూపు, ఎన్‌సీసీ లిమిటెడ్ కంపెనీలు చెరో రూ. కోటి విరాళాన్ని అందజేశాయి. సోమవారం సైజన్ గ్రూపు యాజమాన్యం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి చెక్కును అందజేశారు. ఎన్‌సీసీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రంగరాజు సైతం కోటి రూపాయల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు.

సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ ఆనంద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ నూతన పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం నగర కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసిన సీవీ ఆనంద్.. రెండోసారి పోలీసు కమిషనర్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలి

» ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కార వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ(పబ్లిక్ హియరింగ్)లో వెల్లడైంది. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి 200 మందికిపైగా సామాన్యులు, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడం, ప్రజా సమాచారాన్ని తెలుసుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, పథకాలు అందడంలో జాప్యం తదితర కష్టాలపై వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న సమాచార హక్కు ఉద్యమకారుడు, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వ్యవస్థాపకుడు నిఖిల్ డే మాట్లాడుతూ.. రాజస్థాన్ తరహాలో తెలంగాణలోనూ జవాబుదారీ చట్టం అవసరమని సూచించారు. జ్యూరీ సభ్యులు మాట్లాడుతూ... నిర్ణీత కాల పరిమితితో కూడిన ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ అమలుచేయాలని సూచించారు. దీనిపై కార్యక్రమానికి హాజరైన ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్ తదితర అధికారులు స్పందించారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు హామీ ఇచ్చారు. రాజస్థాన్‌లోని జనసూచన పోర్టల్ తరహాలో ఇక్కడా సమాచార పోర్టల్ రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దివ్య దేవరాజన్ తెలిపారు.

కాళోజీయే నాకు స్ఫూర్తి: సీఎం రేవంత్

ప్రజాకవి జయంతి సందర్భంగా నివాళులు



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిన్న ప్రశ్నించే గొంతుకగా, నేడు ప్రజాపాలకుడిగా తనకు స్ఫూర్తి ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావేనని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా తన నివాసంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషా సాహిత్యానికి నారాయణరావు చేసిన సేవలను స్మరించుకున్నారు.

మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ - సీఎం

తెలంగాణలో భూ పోరాటానికి నాంది పలికిన వీరవనిత చిట్యాల ఐలమ్మ.. సెప్టెంబరు 10న ఆమె వర్ధంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్ నివాళులు అర్పించారు. సాయుధ పోరాటంలో పాలుపంచుకుని మహిళలను ఐక్యం చేశారని, బహుజన చైతన్యానికీ, మహిళా శక్తికి ప్రతీక చాకలి ఐలమ్మ అని కొనియాడారు.

ఆరోగ్య బీమాను చౌకగా అందించాలి

» అది ప్రభుత్వాల బాధ్యత.. జీఎస్టీ మండలి భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని, మిగతా వారికి 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క జీఎస్టీ మండలికి సూచించారు. ప్రజలందరూ తక్కువ ఖర్చుతో ఆరోగ్య బీమాను పొందేలా చేయడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ లభించాలంటే బీమా ప్రీమియంపై పన్ను మినహాయించాల్సి ఉంటుందని అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 54వ జీఎస్టీ మండలి సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టిపాల్గొన్నారు. గ్రూప్ బీమా, కుటుంబ బీమా పథకాలపై పన్నులను ఎంతమేర విధించాలన్న నిర్ణయంపై ఏర్పాటు చేసే మంత్రుల బృందంలో తాను ఉంటానని భట్టి చెప్పారు. జీఎస్టీకి కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌ను కూడా కలపాలన్నారు. ఈ విషయంలో కూడా మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

నేతన్నలకు గత ప్రభుత్వం చేసిందేం లేదు

ఎలక్షన్లు, కలెక్షన్లు చేసి తమదే త్యాగమంటున్నారు.. అసలు త్యాగమంటే కొండాలక్ష్మణ్ బాపూజీదే

» ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ పేరు

» ఈ ఏడాదికి తెలుగు అకాడమీలో క్లాసులు

» వచ్చే ఏడాది స్కిల్ వర్సిటీకి తరలిస్తాం

» ఐఐహెచ్‌టీ ప్రారంభోత్సవంలో సీఎం



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందిస్తున్న చేనేత కార్మికులు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొంత మంది రాజీనామా చేసి ఉప ఎన్నికలు తెచ్చి.. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లుచేసి తమదే త్యాగమని గొప్పగా చెప్పుకొంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి గత సర్కారుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు త్యాగమంటే కొండా లక్ష్మణ్‌బాపూజీదే అని తేల్చిచెప్పారు. సోమవారం ఇక్కడ లలితకళాతోరణంలో "ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)"ని మంత్రి తుమ్మలతో కలిసి సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. చేనేత అభయహస్తం పథకం లోగోను ఆవిష్కరించి, నేతన్నలకు థ్రిఫ్ట్ పథకం కోసం రూ.290 కోట్ల చెక్కును, ఐఐహెచ్‌టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తుంచుకుంటుందన్న రేవంత్.. ఐఐహెచ్‌టీకి ఆయన పేరు పెట్టుకుందామన్నారు. ఈమేరకు జీవో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్న కొండా లక్ష్మణ్ త్యాగాలకు.. కేసీఆర్ త్యాగాలకు మధ్య తేడా ప్రజలకు తెలుసన్నారు. త్యాగంలో ఆయన వారసులమని చెబుతున్న వారికి రూ.వేలకోట్ల ఆస్తులు ఎలావచ్చాయని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ స్థలం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రచార ఆర్భాటాలు తప్ప గత ప్రభుత్వం చేనేత కార్మికులకు చేసిందేమీ లేదని, వారి హయాంలో నేతన్నల జీవన విధానంలో ఎలాంటి మార్పులూ రాలేదని మండిపడ్డారు. "బతుకమ్మ చీరల ఆర్డర్లిచ్చి ఉపాధి కల్పించామంటున్నారు. సిరిసిల్ల నేతన్నలకు రూ.కోట్లల్లో బకాయిలు పెట్టివెళితే.. మేం అధికారంలోకి వచ్చాక వాటిని విడుదల చేశాం. రాజకీయాలకు అతీతంగా సిరిసిల్ల కార్మికులను ఆదుకున్నాం" అని గుర్తుచేశారు. బతుకమ్మచీరలు ఆగిపోయాయంటూ తమపై ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదన్న సీఎం.. గత ప్రభుత్వం అందజేసిన చీరలు మహిళలు కట్టుకునే స్థాయిలో నాణ్యంగా లేవని తెలిపారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలోని 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు నాణ్యమైనవి ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. తమకు రైతన్నలు ఎంత ముఖ్యమో.. నేతన్నలు అంతే ముఖ్యమని, వారినీ రుణ విముక్తులను చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల రుణ భారం రూ.30 కోట్ల దాకా ఉన్నట్టు తన దృష్టికి వచ్చిందని.. ఆ అప్పు తీర్చేందుకు తమ ప్రభుత్వం త్వరలోనే చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు జరిపి అన్ని విభాగాలనూ బలోపేతం చేస్తామన్నారు. పద్మశాలీలు రాజకీయ, సామాజిక రంగాల్లోనూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఏపీకి, ఒడిశాకు.. వెళ్లక్కర్లేదు

తెలంగాణ విద్యార్థులు ఐఐహెచ్‌టీ చేయాలంటే ఒడిశా, ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తెలంగాణలో ఆ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. ఈ అంశం తమ దృష్టికి వచ్చిన వెంటనే ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలంటూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తే.. వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల సమయం వృథా కాకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాదికి ఐఐహెచ్‌టీ తరగతులను నాంపల్లి తెలుగు అకాడమీలో నిర్వహిస్తామని.. విద్యార్థులకు ప్రతినెలా రూ.2500 స్కాలర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. ఐఐహెచ్‌టీని వచ్చే ఏడాది స్కిల్‌ఇండియా యూనివర్శిటీ ప్రాంగణంలోకి మారుస్తామని చెప్పారు.

కుల, చేతి వృత్తులవారు పేదరికం నుంచి బయటపడేందుకు కృషి: తుమ్మల

రాష్ట్రంలోని కుల, చేతివృత్తుల వారు ఉపాధి పొందేలా, ఆయా కుటుంబాలు పేదరికం నుంచి శాశ్వతంగా బయట పడేలా చేస్తామని.. చేనేత, జౌళి పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నల మాదిరిగానే నేతన్నలకూ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని.. వారి సమస్యల పరిష్కారానికి, వారి రుణాలు మాఫీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కొత్తతరానికి చేనేత రంగంలో నైపుణ్యం అందించేందుకు ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేశామన్న ఆయన.. సీఎం రేవంత్ ఆదేశాలతో కేవలం 10 రోజుల్లోనే ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించగలిగామన్నారు. నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం ఈ ఇన్‌స్టిట్యూట్ పనిచేస్తుందని తెలిపారు. ఆధునాతన పరిశోధన అవకాశాలను కల్పించడంలో భాగంగా ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయంగా ఎగుమతి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కాలుష్య రహితంగా గ్రీన్ ఫార్మా సిటీ

(మొదటిపేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. ఔషధ తయారీ కంపెనీలు, బయోటెక్, లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే ఈ సిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దాని నిర్మాణంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రీన్ ఫార్మా సిటీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు.. పేరొందిన ఫార్మా కంపెనీలు ఇప్పటికే ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని తెలిపారు. కంపెనీల ఏర్పాటుతోపాటు.. అక్కడ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)కి ప్రాధాన్యమిస్తామని, శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు.

భుజంగరావుపై మరో కేసు

ఖైతలాపూర్‌లో 340 ఎకరాల భూ దందా

» ఏసీపీగా ఉన్నప్పుడు నిందితులకు సహకారం

» బాధితులను భయపెట్టినట్లు ఆరోపణలు

» సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసిన బాధితులు

» రంగంలోకి ఈవోడబ్ల్యూ బృందాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక నిందితుల్లో ఒకరైన మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుపై మరో ఎఫ్ఐఆర్ నమోదైంది. భుజంగరావు ఏసీపీగా ఉన్నప్పుడు ఖైతలాపూర్‌లోని 340 ఎకరాల భూ దందాలో నిందితులకు సహకారం అందించారంటూ వచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తునకు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ)కు ఆదేశాలు జారీ చేశారు. మీర్ అబ్బాస్ అలీఖాన్ అనే వ్యక్తి తన తండ్రి నవాబ్ మీర్ హస్సేన్ అలీఖాన్‌కు వారసత్వంగా 340 ఎకరాల ఆస్తి సంక్రమించినట్లు సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 1952 నుంచి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ పత్రాలున్నాయని.. ఆ భూమి 1960 నుంచి తన తండ్రి స్వాధీనంలో ఉన్నట్లు వివరించారు. పదేళ్ల క్రితం ఎస్ఎస్ మొహియుద్దీన్, యాసీన్ శేఖర్, శ్రీనివాసరావు(ప్రైమ్ ప్రాజెక్ట్) తన తండ్రిని సంప్రదించినట్లు తెలిపారు. అప్పటికి తన తండ్రికి న్యాయపరమైన అంశాలపై అవగాహన లేకపోవడానికి తోడు ఆర్థిక కష్టాలను అనుకూలంగా మలచుకున్న ఈ ముగ్గురూ.. భాగస్వామిగా ఉంటే.. డెవలప్‌మెంట్ చేస్తామని నమ్మించినట్లు వివరించారు. నకిలీ దస్త్రాలను సృష్టించి, 340 ఎకరాలను కొట్టేయడానికి ప్రయత్నించారని, విషయం తెలుసుకున్న మీర్ హస్సేన్ అలీఖాన్ 2014లో కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ సమయంలో కూకట్‌పల్లి ఏసీపీగా ఉన్న భుజంగరావును నిందితులు కలిశారని, వారికి ఆయన అండగా నిలిచారని ఆరోపించారు. "ఈ క్రమంలో ఏసీపీ ఆదేశాలతో పోలీసులు మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేశారు. బాధించారు. కేసు నుంచి తప్పుకోవాలంటూ బెదిరించారు. ఈ వ్యవహారంలో భుజంగరావు కీలక పాత్ర పోషించారు" అని బాధితుడు సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులనే భయపెట్టి రాజీలో కూర్చోబెట్టాలని కూకట్‌పల్లి పోలీసులను భుజంగరావు ఆదేశించినట్లు చెప్పారు. తమను భయపెట్టి ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకున్నట్లు వివరించారు. 2020లో తన తండ్రి చనిపోయారని, ఆయన మరణ ధ్రువీకరణ పత్రాన్ని సైతం నకిలీది సృష్టించి, ఆస్తిని కొట్టేయాలని కుట్ర పన్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి గ్రీన్‌కో కంపెనీ ఎండీ చామలశెట్టి అనిల్ ఫండింగ్ చేశారని ఆరోపించారు. కేసును రీఓపెన్ చేస్తే.. భుజంగరావు అక్రమాలు వెలుగులోకి వస్తాయని సీపీకి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సీపీ.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయాలని ఈవోడబ్ల్యూని ఆదేశించారు. కూకట్‌పల్లి కేసును రీఓపెన్ చేసి, లోతుగా పరిశీలించి.. నిజానిజాలను నిగ్గుతేల్చాలని సూచించారు.

రాష్ట్రాల పన్ను వాటాను.. 50 శాతానికి పెంచండి

(మొదటిపేజీ తరువాయి)



ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాను కలిసిన పలు పార్టీల నేతలు

ప్రగతిశీల రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని వివరించాయి. ఇలా అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో ఒకే సూచనను చేయడాన్ని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగారియా అభినందించారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, తమ సిఫార్సుల విషయంలో ఆలోచన చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ కేంద్ర ఆర్థిక సంఘం సోమవారం ప్రజాభవన్‌లో వివిధ వర్గాలతో వరుస సమావేశాలను నిర్వహించింది. కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అర్వింద్ పనగారియా, కార్యదర్శి సభ్యులతోకూడిన బృందం తొలుత మునిసిపల్ కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీల మేయర్లు, చైర్మన్‌లతో సమావేశమైంది. అనంతరం గ్రామపంచాయతీల మాజీ సర్పంచులు, జడ్పీల చైర్‌పర్సన్లు, జడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సంఘ సభ్యులతో భేటీ అయ్యింది. ఆ తర్వాత పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు-- అలీఫ్, ఫిక్కీ, సీఐఐ ప్రతినిధులతో, సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించింది.

రాష్ట్ర ప్రభుత్వం తరపున సిరిసిల్ల రాజయ్య, టి.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇస్తున్న పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలి. 15వ ఆర్థిక సంఘం సూచించిన 41% కూడా రాష్ట్రానికి దక్కలేదు. కేవలం 31% మేర నిధులు వస్తున్నాయి. సెస్‌లు, సర్‌చార్జీల పేరుతో కేంద్ర ప్రభుత్వమే మిగతా నిధులను లాగేసుకుంటోంది" అని ఆరోపించారు. జనాభా నియంత్రణ, భౌగోళిక విస్తీర్ణం, అడవుల పెంపు, తలసరి ఆదాయం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటూ తెలంగాణను ప్రగతిశీల రాష్ట్రంగా గుర్తించాలన్నారు. జనాభా పరంగా 12వ స్థానంలో ఉన్న తెలంగాణ.. నిధుల కేటాయింపులో మాత్రం 18వ స్థానంలో ఉందని, ఇది చాలా అన్యాయమని వివరించారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలున్నాయని వివరించారు. "వీటిలో చాలా పంచాయతీలు నిధుల్లేక ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నాయి. 500 జనాభా ఉన్న ప్రతి తండాను, ఇతర గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం. మొత్తం 1,851 తండాలు, గ్రామాలను పంచాయతీలుగా అభివృద్ధి చేశాం. వీటికి ఎలాంటి ఆదాయ మార్గాలు లేవు. కొన్ని చిన్న గ్రామ పంచాయతీలకు కూడా నిధులు లేవు. ఇలాంటి తండాలు, చిన్న పంచాయతీలకు కేంద్రం నుంచి ప్రత్యేక గ్రాంటును కేటాయించేలా సిఫారసు చేయాలి" అని విజ్ఞప్తి చేశారు. దేశంలో గిరిజన జనాభా పరంగా తెలంగాణ 12వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఈ దృష్ట్యా ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా.. గిరిజన పంచాయతీలకు ప్రత్యేక గ్రాంటును కేటాయించాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్య రంగలో పలు మార్పులు చేపడుతున్నామని, జనాభాను నియంత్రిస్తున్నామని, ఇలాంటి ప్రగతిశీల రాష్ట్రానికి తప్పకుండా నిధులు పెంచాలని కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు విడుదల చేసే ముందు రాష్ట్ర ఆర్థిక సంఘాని(టీఎస్ఎఫ్‌సీ)కి సమాచారమివ్వాలని విన్నవించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీపీ) కిందకు వ్యవసాయ రంగాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తరచూ తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని, వీటిని ఎదుర్కొనడానికి ప్రత్యేక గ్రాంటును మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో పట్టణీకరణ పెరుగుతోందని, ఈ దృష్ట్యా సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రత్యేక నిధులివ్వాలని డిమాండ్ చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులివ్వండి: హరీశ్

15వ ఆర్థిక సంఘం స్పెసిఫిక్ స్టేట్, స్పెసిఫిక్ సెక్టార్ తదితర గ్రాంట్ల కింద రాష్ట్రానికి రూ.6,097 కోట్లు ఇవ్వాలని సిఫారసు చేసిందని, అయితే.. పైసా కూడా ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మొత్తం నిధులను విడుదల చేయాలని, రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర పన్నుల్లో వాటాను 50శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. 13వ ఆర్థిక సంఘం సిఫారసు ప్రకారం కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా 2.43 శాతంగా ఉండేదని, 14వ ఆర్థిక సంఘం నాటికి అది 2.133 శాతానికి తగ్గిందన్నారు. 15వ ఆర్థిక సంఘం దానిని 2.102 శాతానికి తగ్గించిందన్నారు. దీంతో రాష్ట్రానికి పన్నుల వాటా నిధులు తగ్గిపోయాయని అన్నారు. పన్నులు వసూలు చేయడంలో అగ్రస్థానంలో ఉంటే.. 2.5 శాతం వెయిటేజీని ఇస్తున్నారని, దీనిని 10 శాతానికి పెంచాలన్నారు. 1961లో కేంద్రానికి పన్నేతర రాబడి రూ.171 కోట్లు ఉంటే, 2024-25లో అది రూ.5.46 లక్షల కోట్లకు పెరిగిందని, ఈ దృష్ట్యా పన్నేతర రాబడిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, నిర్వహణ కోసం రూ.2350 కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సూచిస్తే.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. మిషన్ భగీరథకు రూ.20 వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద విపత్తు సహాయ నిధి కింద కేంద్ర రాష్ట్రాల వాటా 75:25గా ఉందని, దీనిని 90:10గా మార్చాలని కోరారు.

విపత్తుల నిర్వహణకు అదనపు నిధులు:ఈటల

ప్రకృతి విపత్తుల నిర్వహణ కోసం రాష్ట్రాలకు మరో 1% నిధులను పెంచాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అప్పట్లో రూ.1.28 లక్షల కోట్లను కేటాయించిందని, అందులో తెలంగాణకు రూ.2,648 కోట్లు వచ్చాయని గుర్తుచేశారు. కానీ.. తెలంగాణతో సహా రాష్ట్రాల్లో ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవిస్తున్నాయని, ఈ దృష్ట్యా 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులకు అదనంగా మరో ఒక్క శాతం పెంచి ఇవ్వడానికి 16వ ఆర్థిక సంఘం సిఫారసు చేయాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రాంటును సిఫారసు చేసిందని, అదే మాదిరిగా ఓబీసీలకు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలంటూ 16వ ఆర్థిక సంఘం సిఫారసు చేయాలని కోరారు. దారిద్ర్య నిర్మూలన, వ్యవసాయాధారిత కార్యక్రమాలకు ప్రత్యేక గ్రాంట్లనివ్వాలన్నారు. ప్రాంతీయ అసమానతలను తొలగించడంలో భాగంగా తెలంగాణలోని అత్యంత వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక గ్రాంటు కింద నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు.

నేడు భేటీ కానున్న సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులతో భేటీ కానున్నారు. వీరికి ముఖ్యమంత్రి విందు ఇవ్వనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

రాష్ట్ర వాటాను 3.5 శాతానికి పెంచాలి: సీపీఎం

కేంద్ర పన్నుల్లో వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నంద్యాల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు వచ్చే వాటాలో జనాభా దామాషాలో తెలంగాణకు 2.10 శాతం నిధులను మాత్రమే కేటాయిస్తున్నారని, ఈ దృష్ట్యా దీనిని 3.5 శాతానికి పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న ఎడ్యుకేషన్ సెస్, రోడ్డు సెస్ వంటి సెస్సులన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విజ్ఞప్తులపై ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగారియా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఒకే రకమైన డిమాండ్ చేయడం మంచి సంప్రదాయమన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటాను 41% నుంచి 50 శాతానికి పెంచాలని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయని.. ఈ అంశంపై ఆలోచన చేస్తామని పేర్కొన్నారు. పార్టీలు ఇచ్చిన సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. కేంద్ర ఆర్థిక సంఘంతో భేటీ అయిన వారిలో.. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ నుంచి కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద్, టీడీపీ నుంచి సామా భూపాల్‌రెడ్డి, ఎన్.దుర్గాప్రసాద్, మజ్లిస్ నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ, సయ్యద్ అమీన్ జాఫ్రీ, అహ్మద్ బలాల తదితరులు కూడా ఉన్నారు.

కుల గణనకు ప్రభుత్వం సిద్ధం

- కాంగ్రెస్‌తోనే ఇది సాధ్యం
- సామాజిక న్యాయానికి పెద్ద పీట
- బీసీ కమిషన్‌కు అన్ని రకాల సహకారం
- నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కుల గణన కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ఆ ప్రక్రియ మొదలవుతుందని వెల్లడించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్ద పీట వేస్తుందని, ఓబీసీలకు తమ హయాంలోనే న్యాయం జరుగుతుందని చెప్పారు. సోమవారం బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన నూతన పాలక మండలి బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ పదవులు ఇవ్వడంతోపాటు పథకాలలోనూ పెద్ద పీట వేస్తుందన్నారు. అందుకే పార్టీలో అత్యంత ఉన్నతమైన పీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకే కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. నిజాయితీ, నిబద్ధత కలిగిన నిరంజన్‌కు బీసీ కమిషన్ ఛైర్మన్ పదవి ఇవ్వడం వల్ల దానికి హుందా తనం వచ్చిందన్నారు. కమిషన్ చేపట్టబోయే కుల గణన ప్రక్రియకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో కుల గణన చేపట్టాలనే పట్టుదలతో రాహుల్ ఉన్నారని, సోనియా గాంధీ, ఖర్గేలు కూడా అందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఓబీసీలు ఈ విషయాన్ని గుర్తించి రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ప్రభుత్వం తమపై మోపిన బాధ్యతను, లక్ష్యాన్ని నెరవేరుస్తామన్నారు. అన్ని కుల సంఘాలతో చర్చిస్తామని, ఎవరైనా ఎప్పుడైనా వచ్చి కమిషన్‌ను కలువవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత హనుమంతరావు పాల్గొన్నారు. ఛైర్మన్ జి.నిరంజన్‌తోపాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

వట్టెం పంప్‌హౌస్ విద్యుత్తు కనెక్షన్‌కు 62 కోట్లు

- విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశం
- పంప్‌హౌస్‌లో వరద నీటిని తొలగించే కసరత్తు ముమ్మరం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్‌లో చేరిన వరద నీటిని తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేసింది. ఇందుకు నెల రోజులకు పైగా పట్టనుందని అధికారులు అంచనా వేశారు. పంప్‌హౌస్, టన్నెళ్లలోకి చేరిన వరద నీటిని తొలగించేందుకు తొలుత 16 పంపులను ఏర్పాటు చేయాలని భావించారు. తాజాగా పంప్‌హౌస్, డ్రాఫ్ట్ ట్యూబుల్లోకి చేరిన దాదాపు 8 లక్షల క్యూబిక్ మీటర్ల వరద నీటిని అదనపు మోటార్ల ద్వారా తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆ తర్వాత ప్రాజెక్టులోని పంపులను సిద్ధం చేసి, వాటి ద్వారానే టన్నెల్‌లోని దాదాపు 26 లక్షల క్యూబిక్ మీటర్ల వరద నీటిని తొలగించవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. అయితే పంప్‌హౌస్‌కు విద్యుత్తు కనెక్షన్ లేదు. దానికోసం రూ.62 కోట్లను దక్షిణ డిస్కమ్‌కు చెల్లించాల్సి ఉందని అధికారులు గుర్తుచేయగా.. అవసరమైన నిధులు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం శివారులోని నాగనూలు చెరువు ఉప్పొంగడంతో ఆ నీరంతా వట్టెం పంప్‌హౌస్‌ను ముంచెత్తింది. వట్టెం రిజర్వాయర్‌కు నీటిని తరలించే కట్టకు గండిపడి టన్నెల్‌లోకి భారీగా నీరు చేరింది. అదేవిధంగా కుమ్మెర గ్రామ సమీపంలోని చెరువు వరద కూడా టన్నెల్‌లోకి వెళ్లింది. 16 కిలోమీటర్ల పొడవైన 2 సొరంగాలు పూర్తిగా నీటితో నిండిపోయాయి.

ఐఐటీహెచ్‌లో సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు

కంది, సెప్టెంబరు 9: కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయంలోని సంస్కృత అభ్యాస కేంద్రం సహకారంతో ఐఐటీ హైదరాబాద్‌లో సంస్కృతంలో ప్రత్యేక కోర్సు ప్రారంభమైంది. పదో తరగతి ఉత్తీర్ణులై, 15 ఏళ్లు నిండిన వారికి సంస్కృత భాషలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అర్హులుగా ఐఐటీహెచ్ ప్రకటించింది. ఆసక్తి ఉన్నవారు సెప్టెంబరు 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. హైబ్రిడ్ మోడ్‌లో (ఆన్‌లైన్-ఆఫ్‌లైన్) తరగతులు నిర్వహించనున్నారు. కోర్సు ఫీజు రూ.1200, పరీక్ష ఫీజు రూ.300లుగా నిర్ణయించారు. మరిన్ని వివరాలను ఐఐటీ-హెచ్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

త్వరలో సీఎం చేతుల మీదుగా..
టీజీఈఆర్‌సీ కొత్త భవనం ప్రారంభోత్సవం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) కొత్త భవనంలో కొలువుదీరింది. మరో 10 రోజుల్లో కొత్త ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఎర్రగడ్డ కల్యాణ్‌నగర్‌లోని జీటీఎస్ కాలనీలో 'విద్యుత్ నియంత్రణ్ భవన్' పేరిట కొత్త భవనాన్ని నిర్మించారు. తొలుత లక్డీకాపూల్‌లో కట్టాలని శంకుస్థాపన చేయగా... ఆ తర్వాత భూవివాదాలతో కల్యాణ్‌నగర్‌కు తరలించారు. దక్షిణ డిస్కమ్‌కు చెందిన కార్యాలయాలు ఉన్నచోట దీని నిర్మాణం చేపట్టగా ఇటీవలే పనులు పూర్తయ్యాయి. కొత్త కార్యాలయాన్ని కమిషన్ నోటిఫై చేసింది. ఈ నెల 4వ తేదీ నుంచి కొత్త ప్రాంగణంలో కార్యకలాపాలు ప్రారంభం కాగా భవనాన్ని లాంఛనంగా ఈ నెల 18-21వ తేదీల మధ్య ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి రెడ్‌హిల్స్‌లోని సింగరేణిభవన్‌లో కార్యాలయం నడుస్తోంది.

టీపీసీసీ చీఫ్‌గా 15న
మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ ఈ నెల 15న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి దాకా టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఆయన పార్టీ బాధ్యతలను స్వీకరిస్తారు. గాంధీభవన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారు. మరోవైపు తన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి అధిష్ఠానం పెద్దలను ఆహ్వానించేందుకు మహేష్‌కుమార్‌గౌడ్ ఢిల్లీకి వెళ్లనున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు, సోనియా, రాహుల్, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి కృతజ్ఞతలు చెబుతారు. కాగా మహేష్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ నేతల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన ఛాంబర్‌కు పెద్ద ఎత్తున వచ్చిన పార్టీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఏసీబీలో లీకు వీరులు..!

- దాడుల విషయం ముందే చేరవేత
- ఏసీబీ పేరుతో ప్రైవేటు వ్యక్తుల బెదిరింపు వసూళ్లు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో లీకు వీరుల వ్యవహారం మరోమారు కలకలం రేపింది. రైడ్‌కు వెళ్లడానికి ముందే.. అవినీతి ఉద్యోగులకు దాడుల విషయాన్ని ముందే చెబుతుండడంతో వారు అప్రమత్తమవుతున్న దాఖలాలను ఏసీబీ ఉన్నతాధికారులు గుర్తించారు. కొంతకాలంగా వరుసదాడులతో అవినీతి అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న ఏసీబీలో లీకుల అంశం చర్చనీయాంశమవుతోంది. ఇటీవల ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు బాధ్యులైన ఓ ఇన్‌స్పెక్టర్, మరొకరిని సొంత విభాగానికి బదిలీ చేశారు. గతంలో కూడా ఈ తరహా లీకులు ఇచ్చిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ప్రైవేటు వ్యక్తులు ఏసీబీ కేసుల పేరుతో ప్రభుత్వోద్యోగులను బెదిరించి, అందినకాడికి దండుకుంటుండడం ఆ శాఖకు ఇబ్బందికరంగా మారింది. కొద్ది రోజులక్రితం వరంగల్ జిల్లాలో ఓ అధికారికి ఫోన్ చేసి.. ఏసీబీ ప్రధాన కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతున్నానని, కేసు నుంచి తప్పించాలంటే రూ. 3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ శివార్లలో ఏకంగా.. ఏసీబీ పేరు చెప్పి.. వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటం సిగ్గుచేటు


- న్యాయవ్యవస్థపై మాకు విశ్వాసం ఉంది
- డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తాం: కడియం
- గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు.. బీఆర్ఎస్ నేతలకు ప్రజాస్వామ్య విలువలు గుర్తులేవా ?
- నా నిర్ణయానికి కట్టుబడి ఉంటా: తెల్లం



వరంగల్/భద్రాచలం/హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఫిరాయింపులకు ప్రోత్సహించి.. ప్రతిపక్ష పార్టీల శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న నీచ చరిత్ర బీఆర్ఎస్‌దని మండిపడ్డారు. హైకోర్టు తీర్పుతో ఏదో అయిపోయిందని, అప్పుడే ఉపఎన్నిక వచ్చిందన్నట్లుగా సంబరాలు చేసుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. న్యాయవ్యవస్థపై తనకు విశ్వాసం ఉందని, హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు కాపీలు ఇంకా తమకు అందలేదని తెలిపారు. కోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని, వారి సలహాల మేరకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయాలనుకుంటున్నామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లే అవకాశాలున్నాయని చెప్పారు. కాగా, గతంలో కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ఆ పార్టీ నేతలకు ప్రజాస్వామ్య విలువలు గుర్తుకురాలేదా? అని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రశ్నించారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్లో మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే తీర్పు పూర్వాపరాలు తెలుసుకున్న తర్వాతే పూర్తిగా మాట్లాడతానన్నారు. తాను మొదటి నుంచీ భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పరితపిస్తున్నానని, ప్రజల కోరిక మేరకు తన నిర్ణయానికి కట్టుబడి ఉంటానని అన్నారు. కాగా, పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సుద్దపూస కబుర్లు చెబుతున్నారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. పదేళ్లపాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఇప్పుడు నీతులు బోధిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విపక్ష ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి ప్రలోభాలు పెట్టి, బెదిరించి పార్టీ చేర్చుకున్న రోజులను హరీశ్‌రావు మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలతో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించినప్పుడు రాజ్యాంగ స్ఫూర్తి ఎటుపోయిందని నిలదీశారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తామని, స్పీకర్ కచ్చితంగా నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

4 వారాల్లో విచారణకు షెడ్యూల్ ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)



తిరిగి మొదలు పెడతామని, తగిన ఆదేశాలూ జారీ చేస్తామని స్పష్టం చేసింది. స్పీకర్ (రెండో ప్రతివాది) పదవికి ఉన్న గౌరవం, రాజ్యాంగబద్ధమైన హోదాను తగ్గించకుండా మూడో ప్రతివాది అయిన తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయడం సముచితమని భావిస్తున్నామని వ్యాఖ్యానించింది. శాసనసభ పదవీ కాలం పూర్తయ్యే వరకూ అంటే ఐదేళ్లపాటు స్పీకర్ వేచి ఉండవచ్చని, అప్పటి వరకూ న్యాయస్థానం తన చేతులను కట్టేసుకుని ఉండాలని చెప్పడం సరికాదని, అటువంటి వైఖరి ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగానికి వ్యతిరేకమని తేల్చి చెప్పింది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ నైతిక సూత్రాలకు కట్టుబడి ఉండాలని, ఆ పదవిలో ఉన్నవాళ్లు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోయినా న్యాయ సమీక్ష చేయడానికి వీల్లేదని అంటే.. ఎంత కాలం ఆగాలనే ప్రశ్న ఉత్పన్నమవుతుందని వ్యాఖ్యానించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేర్వేరు తేదీల్లో హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టి ఆగస్టు 10న తీర్పు రిజర్వు చేసి సోమవారం తుది తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యామ సుందరం, సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్ రావు, జె.రామచంద్రరావు తదితరులు తమ వాదనలు వినిపించారు. స్పీకర్ తన ఎదుట ఉన్న అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని, ఈ మేరకు 'రాజేంద్రసింగ్ రాణా, కైశం మేఘా చంద్ర సింగ్, జయంత్ పాటిల్, సుభాశ్ దేశాయి' వంటి కేసుల్లో ఇటీవల సుప్రీం కోర్టు చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, పార్టీ మారిన ఎమ్మెల్యేల తరఫున న్యాయవాదులు పి.శ్రీరఘురాం, మయూర్ రెడ్డి వాదనలు వినిపించారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క అనర్హత పిటిషన్‌ను కూడా విచారించలేదు. స్పీకర్ అధికారాల్లో జోక్యం చేసుకోవడానికి ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది" అంటూ 'కిహోటో హోలోహన్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సంపత్ కుమార్' కేసులను వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం.. అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయవాదులు చాలా తీర్పులను ప్రస్తావిస్తున్నారని, కానీ, ఒక పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడమనేది ఎక్కడా చూసి ఉండరని వ్యాఖ్యానించింది. నిర్ణీత కాల వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్‌కు హైకోర్టు ఆదేశాలు ఇవ్వజాలదన్న వారి వాదనను అంగీకరిస్తే.. స్పీకర్ నిర్ణయ రాహిత్యాన్ని ఎంత కాలం చూస్తూ ఉండాలని నిలదీసింది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై స్పీకర్‌కు హైకోర్టు ఆదేశాలు ఇవ్వవచ్చంటూ కైశం మేఘా చంద్రసింగ్ కేసులో సుప్రీం కోర్టు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. "నిర్ణీత సమయంలో అనర్హత పిటిషన్లను పరిష్కరించండి అని స్పీకర్‌కు ఆదేశాలు ఇచ్చే అధికారం ఈ కోర్టుకు ఉంది. ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు ఈ కోర్టు కట్టుబడి ఉండాల్సిందే. ఇటీవలి కైశం మేఘా చంద్రసింగ్ కేసులో తీర్పు చాలా స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇదే కోర్టు 'ఎర్రబెల్లి దయాకర్‌రావు' కేసులో స్పీకర్ అధికారాల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించిందంటూ ప్రభుత్వం, ఇతర ప్రతివాదులు చేస్తున్న వాదన నిలబడదు. ప్రస్తుతం మా ఎదుట ఉన్న మూడు పిటిషన్లలో రెండు ఏప్రిల్‌లో దాఖలు కాగా ఒకటి జూలైలో దాఖలైంది. వాటిపై ఆగస్టు 10 వరకు సుదీర్ఘంగా వాదనలు విన్నాం. అయితే, స్పీకర్ ఎదుట పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్ల స్థితి ఏమిటి? అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్లు (బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు) ప్రత్యేక పరిస్థితులను కోర్టు దృష్టికి తేవడంలో సఫలమయ్యారు. దరిమిలా.. ఉపశమనం పొందడానికి వారు అర్హులు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. స్పీకర్ కార్యాలయానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన హోదా, గౌరవం తగ్గకుండా అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయడం మర్యాదగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపింది. తద్వారా, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ముగించింది.

తీర్పును స్వాగతిస్తున్నాం: లక్ష్మణ్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ కూడా సాగుతోందని విమర్శించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హోల్‌సేల్, రిటైల్ ఫిరాయింపులకు తెలంగాణ ప్రయోగశాలగా మారిందన్నారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. మరో పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయడం కంటే దిగజారుడుతనం ఏముంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలు, హామీల విషయంలో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హైడ్రా పేరుతో రోజుకో చర్చ పెడుతున్నారని ఆరోపించారు. హైడ్రా అధికారాలు, విధులకు సంబంధించి చట్టబద్ధత కల్పించకుండా.. కేవలం జీవో-99కు అనుగుణంగా మాత్రమే ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా, గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట భస్మాసుర హస్తంలా మారిందని ఆరోపించారు. గడచిన తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో 1900 మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే తీర్పు

- కాంగ్రెస్ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు : కేటీఆర్, హరీశ్‌రావు
- హైకోర్టు తీర్పు హర్షణీయం: కొప్పుల

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ పేర్కొంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై వెలువడిన ఈ తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామ్య విధానాలకు చెంపపెట్టు లాంటిదన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై.. ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం తథ్యమని, అక్కడి ప్రజలు బీఆర్ఎస్‌నే గెలిపిస్తారని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా అసెంబ్లీ స్పీకర్ నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలోనూ గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. "పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టు చాలా సీరియస్‌గా ఉంది. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరొక పార్టీ లోకి వెళ్లడం నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేయటమే. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేలకు పింఛన్ రాకుండా చట్టం చేశారు. కర్ణాటకలో తమ పార్టీ ఎమ్మెల్యేలను రూ.100 కోట్లు ఇచ్చి బీజేపీ ఎత్తుకెళుతోందని మొత్తుకున్నారు. తెలంగాణలో ఒక నీతి, ఇతర రాష్ట్రాల్లో మరో నీతా?" అని కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్నించారు. కాగా, రాజకీయాల్లో దుష్ట సంప్రదాయాలకు విరుద్ధంగా కోర్టు తీర్పు రావడం హర్షణీయమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ తన నిర్ణయాన్ని వెల్లడించడంలో ఇక జాప్యం చేసేందుకు అవకాశం లేదని మరో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాగా, హైకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ స్పీకర్ ఎవరి మాటలూ వినకుండా ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ కోరారు.

వాళ్లు బీఆర్ఎస్ సభ్యులుగానే..!

- పీఏసీ ఛైర్మన్‌గా అరికెపూడి నియామకమే సంకేతం
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- స్పీకర్ నిర్ణయంపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై విచారణకు నాలుగు వారాల్లో షెడ్యూలు జారీ చేయాలంటూ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. రేవంత్ సర్కారు వ్యూహాత్మక చర్యలకు ఉపక్రమించింది. హైకోర్టు ఆదేశం వెలువడిన గంటల వ్యవధిలోనే అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమిస్తూ స్పీకర్ కార్యాలయం బులెటిన్ విడుదల చేసింది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన గాంధీ.. కొద్ది రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. అయితే, ప్రధాన ప్రతిపక్షానికి చెందిన సభ్యుడికి ఇవ్వాల్సిన పీఏసీ ఛైర్మన్ పోస్టును అరికెపూడి గాంధీకి ఇవ్వడం ద్వారా.. ఆయనను బీఆర్ఎస్ సభ్యునిగానే గుర్తిస్తున్నట్లుగా స్పీకర్ సంకేతం ఇచ్చారు. వాస్తవానికి, పీఏసీ ఛైర్మన్ పదవిని ప్రతిపక్షానికి కేటాయించడం ఆనవాయితీ. ఇందులో 13 మంది సభ్యులు కూడా ఉంటారు. సభ్యులకు ఎన్నిక జరుగుతుంది. కానీ, ఛైర్మన్‌ను స్పీకర్ నియమిస్తారు. పీఏసీలోని 13 మంది సభ్యుల్లో 9 మందిని శాసనసభ నుంచి ఎన్నుకుంటారు. శాసనసభలో ఆయా పార్టీలకున్న సంఖ్యా బలాన్ని బట్టి వీరు ఎన్నికవుతారు. శాసనసభలో బీఆర్ఎస్‌కున్న సంఖ్యా బలాన్ని బట్టి ముగ్గురు ఎన్నికయ్యే అవకాశం ఉంది. అయితే, పీఏసీ ఛైర్మన్‌గా మాజీ మంత్రి హరీశ్ రావును; సభ్యులుగా మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ పేర్లను బీఆర్ఎస్ ఇప్పటికే ప్రతిపాదించింది. పీఏసీలో సభ్యత్వం కోసం వారితో నామినేషన్లనూ వేయించింది. పీఏసీ సభ్యునిగా ఎన్నిక కోసం అరికెపూడి గాంధీ కూడా నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేల్లో హరీశ్ రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, అరికెపూడి గాంధీ పోటీలో ఉండగా.. హరీశ్ మినహా విగిలిన ముగ్గురూ పీఏసీ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరిలో అరికెపూడి గాంధీని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఛైర్మన్‌గా నియమించారు. తద్వారా ఆయనను బీఆర్ఎస్ సభ్యునిగానే గుర్తిస్తున్నట్లు సంకేతం ఇచ్చారన్న వాదన వినిపిస్తోంది.

స్పీకర్.. కింకర్తవ్యం!?

హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పును రాజ్యాంగం ప్రకారం అదే స్థాయిలో ఉన్న శాసనసభ స్పీకర్ అమలు చేస్తారా!? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఇటీవలి సుప్రీం కోర్టు తీర్పును హైకోర్టు ప్రస్తావిస్తుంటే.. ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలు, అందుకు వివిధ న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఆయా వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవడమనేది స్పీకర్ విచక్షణకు సంబంధించినదని పార్టీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అందులో జోక్యం చేసుకోవడం ద్వారా న్యాయ, అధికార, రాజకీయ వ్యవస్థల మధ్య ఘర్షణ అనివార్యమని వ్యాఖ్యానిస్తున్నాయి. అలాగే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశంపై అసెంబ్లీ కార్యదర్శి లేదా ప్రభుత్వం లేదా ఫిరాయింపు ఎమ్మెల్యేలైనా డివిజన్ బెంచ్‌కు వెళ్లవచ్చని, అక్కడా తీర్పు వ్యతిరేకంగా వస్తే.. సుప్రీం కోర్టుకూ వెళ్లవచ్చని చెబుతున్నాయి.

పీఏసీ ఛైర్మన్‌గా అరికెపూడి గాంధీ

అంచనాల కమిటీ ఛైర్‌పర్సన్‌గా పద్మావతిరెడ్డిని నియమించిన అసెంబ్లీ స్పీకర్

- ప్రభుత్వరంగ సంస్థల కమిటీ ఛైర్మన్‌గా కె.శంకరయ్య
- బులెటిన్ ఇచ్చిన అసెంబ్లీ కార్యాలయం



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్‌గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నియమితులయ్యారు. ఆయనతోపాటు అంచనాల కమిటీకి కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డిని, ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్యను ఛైర్మన్‌లుగా అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియమించారు. తెలంగాణ శాసనసభ, శాసనమండలి బిజినెస్ రూల్స్ ప్రకారం ఈ మూడు కమిటీలకు ఎన్నికలు జరిగినట్లు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు వెల్లడించారు. ప్రతి కమిటీకి శాసనసభ నుంచి 9 మంది, శాసనమండలి నుంచి నలుగురు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. పీఏసీకి ఎన్నికైన సభ్యుల నుంచి అరికెపూడి గాంధీని, అంచనాల కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి నలమాద పద్మావతిరెడ్డిని, ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి ఎన్నికైన సభ్యుల నుంచి కె.శంకరయ్యను ఆయా కమిటీలకు ఛైర్మన్లుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియమించినట్లు తెలుపుతూ సోమవారం బులెటిన్ విడుదల చేశారు. ఈ మూడు కమిటీలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కోసం ఏర్పాటు చేసినా.. అసెంబ్లీ బిజినెస్ రూల్స్ ప్రకారం మరుసటి ఆర్థిక సంవత్సరాల్లో ఎన్నికలు నిర్వహించకపోతే ఇవే కమిటీలు కొనసాగుతాయి.

మూడు కమిటీలకు ఎన్నికైన సభ్యులు వీరే..!

ప్రజా పద్దుల కమిటీ: అరికెపూడిగాంధీ (ఛైర్మన్), వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రామారావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కూనంనేని సాంబశివరావు. మండలి నుంచి టి.జీవన్‌రెడ్డి, టి.భానుప్రసాద్ రావు, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్

అంచనాల కమిటీ: నలమాద పద్మావతి రెడ్డి (ఛైర్‌పర్సన్), వి.సునీతా లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, సీహెచ్.విజయరమణారావు, కోరం కనకయ్య, రాందాస్ మాలోతు, యశస్విని మామిడాల, పైడి రాకేశ్‌రెడ్డి, మండలి నుంచి ఎం.ఎస్.ప్రభాకర్‌రావు, సుంకరి రాజు, టి.రవీందర్‌రావు, వి.యాదవరెడ్డి

ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ: కె. శంకరయ్య (ఛైర్మన్), పి.సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద్, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పి.సంజీవరెడ్డి, తోట లక్ష్మీకాంతరావు, కౌసర్ మొహియుద్దీన్, మండలి నుంచి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, తాతా మధుసూదన్, మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ

రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

పార్టీ మారిన వ్యక్తిని పీఏసీ ఛైర్మన్‌ను చేయడమేంటి?.. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా నియామకం

- ప్రతిపక్ష ఎమ్మెల్యేను విస్మరించడం దారుణం: హరీశ్
- దేశంలో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ తీరు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుచిత నిర్ణయాలు తీసుకుంటూ.. రాజ్యాంగ స్ఫూర్తిని ఖూనీ చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే కాకుండా.. శాసనసభ సంప్రదాయాలను సైతం మంటగలుపుతోందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకు దక్కాల్సిన ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ పదవిని.. అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడం అసెంబ్లీ నియమావళికి, పార్లమెంటరీ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రతిపక్ష పార్టీ ప్రతిపాదించిన ఎమ్మెల్యేను విస్మరించి.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెపూడి గాంధీని పీఏసీ ఛైర్మన్‌ను చేయడం దారుణమన్నారు. నిత్యం రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకొని తిరిగే రాహుల్‌గాంధీ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 1958-59 నుంచి ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేను పీఏసీ ఛైర్మన్‌గా ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోందని గుర్తు చేశారు. శాసనసభ్యులకు ఇచ్చే హ్యాండ్‌బుక్‌లోని 65వ పేజీలో పీఏసీ ఛైర్మన్ ఎన్నికపై స్పష్టంగా వివరించారని తెలిపారు. అలాంటిది.. పార్టీ ఫిరాయించిన అరికెపూడి గాంధీని ఏ నిబంధన ప్రకారం పీఏసీ ఛైర్మన్‌గా అసెంబ్లీ స్పీకర్ నియమించారని ప్రశ్నించారు. "శాసనసభ నిర్దేశించిన బిజినెస్ రూల్ 250 ప్రకారం 9మంది ఎమ్మెల్యేలను పీఏసీ సభ్యులుగా ఎన్నుకోవాలి. పీఏసీ కమిటీ ఏర్పాటు చేసేనాటికి బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దానిప్రకారం ముగ్గురు సభ్యులు బీఆర్ఎస్ నుంచి పీఏసీలో ఉండాలి. కానీ, ఒక్కో సభ్యుడిని ఎన్నుకోవడానికి సుమారు 13 మంది అవసరం అవుతారన్న నిబంధనను ఎక్కడా పాటించలేదు. పార్టీ ఫిరాయించిన అరికెపూడి గాంధీని బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది ఎమ్మెల్యేలు ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్ ద్వారా ఎలా ఎన్నుకున్నారో స్పీకర్ చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



ఎవరూ ప్రతిపాదించని వ్యక్తికి ఎలా ఇచ్చారు?

ప్రతిపక్ష పార్టీ నుంచి పీఏసీ ఛైర్మన్, సభ్యుల ఎన్నిక చేపట్టాలన్న నిబంధనను అనుసరించి.. తమ పార్టీ పీఏసీ ఛైర్మన్‌గా తన పేరును, సభ్యులుగా వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్ పేర్లను ప్రతిపాదించారని హరీశ్‌రావు తెలిపారు. అయితే ఈ కమిటీలో సభ్యులుగా ప్రతిపాదించిన ఇద్దరిని ఆమోదించి.. ఎవరూ ప్రతిపాదించని అరికెపూడి గాంధీని నిబంధనలకు విరుద్ధంగా ఛైర్మన్‌గా నియమించడమేంటని ప్రశ్నించారు. స్పీకర్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అసెంబ్లీ నియమావళికి విరుద్ధమన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కూడా పాల్పడని దుశ్చర్యకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని హరీశ్‌రావు మండిపడ్డారు. లోక్‌సభలో 99 మంది సభ్యులతో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తరఫున కేసీ వేణుగోపాల్‌ను పీఏసీ ఛైర్మన్‌గా నియమించారని గుర్తుచేశారు. కాగా, పీఏసీ ఛైర్మన్ పదవి విషయంలో దేశంలో ఎక్కడాలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.

మిజోరాం గవర్నర్ కంభంపాటికి తీవ్ర అస్వస్థత



శంషాబాద్ రూరల్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన భద్రత సిబ్బంది, వ్యక్తిగత డాక్టర్లు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించాలని నిర్ణయించారు. వెంటనే మిజోరాం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. ఆయన వైరల్ ఇన్‌ఫెక్షన్, జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆయన ఇంతకు ముందు ఆయన గుండెకు సంబంధించిన చికిత్సలను స్టార్ ఆస్పత్రి వైద్యుల వద్ద తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఆయనను ఇక్కడే వైద్యం కోసం ఇక్కడకు తరలించినట్లు తెలుస్తోంది. సోమవారం ఆయనకు అవసరమైన పరీక్షలను చేసినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం నివేదికలు వచ్చిన తర్వాత ఆయన పూర్తి ఆరోగ్యంపై వైద్యులు నిర్ధారణకు రానున్నట్లు సమాచారం. ఆయనను ప్రత్యేక గదిలో ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పినట్లు తెలుస్తోంది.

ఫార్మా కంపెనీకి భూములిచ్చేది లేదు

» సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 9: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్‌లో ఫార్మా కంపెనీ వద్దంటూ వందలాది మంది రైతులు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుటధర్నా నిర్వహించారు. 'ఫార్మా కంపెనీ వద్దు..మా భూములే మాకు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. న్యాల్‌కల్ మండలం డప్పూరు, మల్గి, వడ్డి గ్రామాలకు చెందిన రైతులు చేపట్టిన ధర్నాకు జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీపీఎం నాయకులు జయరాజ్, మాణిక్యం మద్దతు పలికారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ, ఏడాదికి మూడు పంటలు పండే పచ్చని పొలాలను ఫార్మా కంపెనీ పేరుతో నాశనం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు.

డిగ్రీ సీట్ల భర్తీ కోసం దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిగిలి పోయిన డిగ్రీ సీట్ల భర్తీ కోసం దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు, వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఈ నెల 12వ తేదీన సీట్లను కేటాయిస్తామని, సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోపు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

టెట్ వివరాల ఎడిట్‌కు మరో అవకాశం

డీఎస్సీ దరఖాస్తుల్లో కొందరు అభ్యర్థులు పొందుపరచిన టెట్ వివరాలు సరిగ్గా లేకపోవడంతో డీఎస్సీ ఫలితాల ప్రకటనలో సాంకేతిక ఇబ్బందులు వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించడం కోసం డీఎస్సీ దరఖాస్తుల్లో టెట్ వివరాలను ఎడిట్ చేయడానికి వీలుగా మరో అవకాశాన్ని ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సుమారు రెండు రోజుల పాటు ఎడిట్ చేయడానికి అభ్యర్థులకు గడువు ఇచ్చే వీలుంది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత డీఎస్సీ ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. మరోవైపు డీఎస్సీ తుది కీలో తప్పులు దొర్లినట్టు అభ్యర్థులు ఆరోపించారు. ఈ తప్పులను సరిదిద్ది తాజాగా మళ్లీ తుది కీని విడుదల చేయాలని వారు కోరారు. ఈ మేరకు డీఎస్సీ పరీక్షలను రాసిన పలువురు అభ్యర్థులు సోమవారం విద్యాశాఖ అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందించారు.

సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య వందేభారత్

» ఈ నెల 15న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-నాగ్‌పూర్ మార్గంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు పెట్టనుంది. ఈ నెల 15న ఈ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో ఐదు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తుండగా, వీటికి మరో వందే భారత్ తోడవనుంది. సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య 578 కిలోమీటర్ల దూరాన్ని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 7.15 గంటల్లో చేరుకోనుంది. వారంలో మంగళవారం మినహా ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు నాగ్‌పూర్‌లో బయల్దేరే వందే భారత్ మధ్యాహ్నం 12.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకు బయల్దేరి రాత్రి 8.20 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

చంద్రబోస్, బలగం కొమురమ్మ, మొగిలయ్యకు పొన్నం సత్తయ్యగౌడ్ స్మారక అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ మూడవ స్మారక అవార్డును ప్రముఖ సినీ గేయ రచయిత, అస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్, బలగం ఫేమ్ కొమురమ్మ, మొగిలయ్యకు అందజేయనున్నారు. జ్యూరీ కన్వీనర్ పొన్నం రవిచంద్ర సభ్యులు మాడభూషి శ్రీధర్, దిలీప్ రెడ్డి, మామాడి హరికృష్ణ, ఐనంపూడి శ్రీలక్ష్మి... రచయితల విభాగంలో చంద్రబోస్, కళాకారుల విభాగంలో కొమురమ్మ, మొగిలయ్యను అవార్డుకు ఎంపిక చేశారు. 13న రవీంద్ర భారతిలో అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని జ్యూరీ ప్రకటించింది.

ఫోన్ ట్యాపింగ్ నిందితుల రిమాండ్ పొడగింపు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుల జ్యుడీషియల్ రిమాండ్‌ను నాంపల్లి కోర్టు మరోసారి పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ గడువు ముగియడంతో చంచల్‌గూడ జైల్లో ఉన్న రాధాకిషన్ రావు, ప్రణీత్ రావు, తిరుపతన్నను అధికారులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం వారి రిమాండ్‌ను ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించింది. కాగా, ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న భుజంగరావు అనారోగ్య కారణాలతో ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్నారు. అయితే ఆరోగ్యం ఇంకా కుదట పడని కారణంగా మధ్యంతర బెయిల్‌ను మరో 45 రోజులు పొడిగించాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ ముగిసింది. మధ్యంతర బెయిల్‌పై కోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది.

వైద్య కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ అమలు చేయండి

» హైకోర్టులో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి పిటిషన్

మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయమై తాను కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రాసిన లేఖను పరిగణనలోకి తీసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 2024-25 విద్యా సంవత్సరం కౌన్సెలింగ్‌లో ఈ రిజర్వేషన్లను అమలు చేయాలి కదా? అని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది

సైబర్ దందాకు బ్యాంకర్ల అండ!

అడ్డగోలుగా ఖాతాలు తెరిచేందుకు కొందరి సహకారం





(హైదరాబాద్ సిటీ- ఆంధ్రజ్యోతి)

రాజధాని హైదరాబాద్‌కు చెందిన మునావర్ మహ్మద్, అరుశ్ దాస్, షమీర్ ఖాన్, ఎస్.సుమైర్ స్నేహితులు. మునావర్ స్నేహితుడు.. లఖ్‌నవూకు చెందిన నయీమ్ ఒకసారి అతడికి ఫోన్ చేశాడు. "లఖ్‌నవూలో చిన్న పని ఉంది. అది పూర్తి చేసుకొని వెళ్తే డబ్బులు కూడా వస్తాయి. నీతోపాటు మరో ముగ్గురిని తీసుకురా" అని చెప్పాడు. తన మాట విని లఖ్‌నవూకు చేరుకున్న నలుగురు స్నేహితులకూ రాచమర్యాదలు చేశాడు. మనీష్, వికాస్, రాజేశ్ అనే మరో ముగ్గురు వ్యక్తులను వారికి పరిచయం చేశాడు. వారు ఈ నలుగురి పేరిట నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారుచేసి.. వాటి ఆధారంగా 33 షెల్ కంపెనీలు సృష్టించి, వారి సంతకాలతో 61 బ్యాంకు ఖాతాలు తెరిచారు. బ్యాంకు అధికారుల చేతులు తడిపి.. ఈ ప్రక్రియలో వారి సహకారం కూడా తీసుకున్నారు. వచ్చిన పని అయిపోయిందని చెప్పి ఆ నలుగురు స్నేహితుల చేతిలో కొంత డబ్బు పెట్టారు. "కంపెనీలకు బ్యాంకు ఖాతాలు తీయడానికి పిలిచాం. వాటి వల్ల మీకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు" అని చెప్పి పంపేశారు. ఇది జరిగిన కొద్దిరోజులకే సైబర్ క్రైమ్ పోలీసులు.. మునావర్ బృందాన్ని అరెస్టు చేశారు. ఇదేంటని ప్రశ్నించగా.. లఖ్‌నవూలో తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు దేశవ్యాప్తంగా రూ.128 కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. అంతేకాదు.. బ్యాంకర్ల సహకారంతో ఆ సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లో 109 బ్యాంకు ఖాతాలను తెరిచి, కేవలం రెండేళ్లలో రూ.712 కోట్లు కాజేసినట్లు వెల్లడించారు. కేవలం కొంతమంది బ్యాంకర్ల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా.. దేశవ్యాప్తంగా 15వేల మంది మోసపోయారని, ఆ రూ.712 కోట్లూ విదేశాలకు తరలిపోయాయని తెలిపారు. అంతేకాదు.. ఈ వ్యవహారంపై ఈడీకి కూడా సమాచారమిచ్చారు. అయితే.. దీనిపై బ్యాంకర్లకు నోటీసులు ఇచ్చినా బ్యాంకుల నుంచిగానీ, ఆర్‌బీఐ నుంచి గానీ ఇసుమంతైనా స్పందన లేదని పోలీసులు పేర్కొన్నారు. ఇటీవలికాలంలో వెలుగులోకి వస్తున్న పలు సైబర్ మోసాల్లో నేరగాళ్లు ఇలాగే వేరొకరి ఖాతాలో డబ్బులు వేయించి వారినీ ఇరికిస్తున్నారు.

సామాన్యుడు బ్యాంకు ఖాతా తెరవాలంటే బ్యాంకు సిబ్బంది సవాలక్ష షరతులు చెబుతారు! "ఆ కాగితం తీసుకురా.. చిరునామా ధ్రువీకరణ పత్రం సరిగ్గా లేదు.. ఆధార్, పాన్ కార్డుల్లో పేరు సరిపోలలేదు.." అంటూ కొర్రీలతో విసిగిస్తారు. కానీ.. షెల్ కంపెనీలు పెట్టి, తప్పుడు చిరునామాలు, సంతకాలతో పెద్ద సంఖ్యలో ఖాతాలు తెరిచే సైబర్ నేరగాళ్లు ఇచ్చే ఆమ్యామ్యాలకు ఆశపడి ఆ దందాలో పాత్రధారులు అవుతున్నారు. ఆ మోసం బయటపడ్డాక పోలీసులు అడిగినా స్పందించట్లేదు. ఈ నేపథ్యంలో నకిలీ ఖాతాల కట్టడికి ఆర్‌బీఐ ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఖాతాలే నేరగాళ్లకు ఆధారం..

సైబర్ నేరగాళ్లు అమాయకులను దోచుకోవాలన్నా.. దోచుకున్న సొమ్మును తీసుకోవాలనుకున్నా.. విదేశాలకు తరలించాలన్నా బ్యాంకు ఖాతాలే ఆధారం. అవే లేకపోతే సైబర్ నేరాల్లో డబ్బులు కొల్లగొట్టడం అసాధ్యం. అందుకే వారు బ్యాంకు ఖాతాలు తెరవడానికి దళారీ వ్యవస్థను ఆశ్రయిస్తారు. వారి ద్వారా డబ్బుల ఆశ చూపి.. ఆ ప్రలోభానికి లొంగే బ్యాంకర్లకు వలవేస్తారు. వారితో కుమ్మక్కై నకిలీ ధ్రువపత్రాలతో, ఎలాంటి విచారణలూ లేకుండా ఖాతాలు తెరుస్తున్నారు. వాటి క్రెడెన్షియల్స్ (డెబిట్ కార్డు, చెక్‌బుక్, ఫోన్‌నంబర్ వంటివి) తీసుకొని.. ఆ ఖాతాలను సైబర్ నేరాలకు వినియోగిస్తున్నారు. ఇలా నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయడం ఒకెత్తు అయితే.. ఆయా ఖాతాల్లో రోజూ రూ. లక్షల్లో డబ్బులు వచ్చిపడుతున్నా బ్యాంకర్లు పట్టించుకోకపోవడం మరొక ఎత్తు. నిజానికి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. ప్రతి బ్యాంకు ఖాతాపైనా అధికారుల నిఘా ఉండాలి. దీనివల్ల ఆయా ఖాతాల్లో అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వచ్చినా, ఆ ఖాతాల నుంచి పెద్ద ఎత్తున లావాదేవీలు జరుగుతున్నా.. బ్యాంకు అధికారులకు అనుమానం వస్తుంది. అప్పుడు ఆయా ఖాతాలపై నిఘాపెట్టి ఆరా తీస్తారు. అనుమానం నిజమని తేలితే ఖాతాలను స్తంభింపజేసి పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. అక్రమ లావాదేవీలు నిజమని తేలినా.. ఆ ఖాతాను ఇతర ప్రాంతాల్లో ఉన్న సైబర్ క్రిమినల్స్ వినియోగిస్తున్నట్లు తేలినా సబంధిత వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయొచ్చు. ఇలా తరచూ చేయడం వల్ల సైబర్ క్రిమినల్స్‌లో భయం పుడుతుంది. కానీ.. పోలీస్ ఉన్నతాధికారులు ఎన్ని నోటీసులు జారీ చేసినా, ఎన్నిసార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి.. సైబర్ క్రిమినల్స్ బ్యాంకు ఖాతాలను ఎలా వినియోగిస్తున్నదీ చెప్పినా కొన్ని బ్యాంకుల్లో పర్యవేక్షణ కనిపించడంలేదు. ఈ నేపథ్యంలో.. ఆర్బీఐ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సైబర్ నేరాలను అడ్డుకోవడానికి, కరెంట్ ఖాతాలను పర్యవేక్షించడానికి, అక్రమ ఖాతాలపై నిఘాపెట్టి సైబర్ క్రిమినల్స్ వినియోగిస్తున్న ఖాతాలను గుర్తించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

బ్యాంకర్లు అప్రమత్తంగా ఉంటే..

ఇటీవల హైదరాబాద్ నగరంలోని ఒక బ్యాంకు అధికారులు.. కొన్ని ఖాతాల నుంచి పెద్ద ఎత్తున లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో సైబర్ సెక్యూరిటీ పోలీసులకు వాటిపై సమాచారం అందించారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆరా తీయగా.. అవన్నీ సామాన్య ప్రజల పేరుతో ఉన్న ఖాతాలని, వారికి రూ.లక్షల్లో లావాదేవీలు జరిపే స్థోమత లేదని గుర్తించారు. అంతే కాదు.. ఆయా ఖాతాల్లోంచి డబ్బు ఎక్కడికి వెళ్తోందో పరిశీలించగా.. అవన్నీ సైబర్ క్రిమినల్స్ నకిలీ ఖాతాలని తేలింది. దీంతో వాటిని ఫ్రీజ్ చేశారు. ఇదే విధంగా బ్యాంకర్లు అప్రమత్తంగా వ్యవహరించి నకిలీ ఖాతాలను, అక్రమ లావాదేవాలను గుర్తిస్తే సైబర్ క్రిమినల్స్ చెక్ పెట్టడంతో పాటు.. నకిలీ ఖాతాలను అడ్డుకోవచ్చని సైబర్ సెక్యూరిటీ పోలీసులు పేర్కొన్నారు.

రాజస్థాన్ ముఠా.. యూపీఐ దోపిడీ

'చార్జ్ బ్యాక్' ఆప్షన్‌తో రూ.4 కోట్ల మోసం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): యూపీఐ చెల్లింపుల్లో జరిగే పొరపాట్లను సరిదిద్దడానికి బ్యాంకులు అందించే 'చార్జ్‌బ్యాక్' ఆప్షన్‌ను వాడుకుని రూ.4 కోట్ల మేర మోసానికి పాల్పడ్డ రాజస్థాన్ ముఠాను సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ నరసింహ ఈ కేసు వివరాలను వెల్లడించారు. పేమెంట్ యాప్స్ ద్వారా పొరపాటున ఒకరికి బదులు వేరే వ్యక్తికి డబ్బు పంపిస్తే.. బ్యాంకును సంప్రదించి, పొరపాటు జరిగిందని చెప్తే బ్యాంకు ఆ డబ్బును మళ్లీ మన ఖాతాలో జమ చేస్తుంది. దీన్ని 'చార్జ్ బ్యాక్' ఆప్షన్ అంటారు! ఈ లొసుగు ఆధారంగా రాజస్థాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి.. బజాజ్ ఎలక్ట్రానిక్స్ సంస్థను లక్ష్యంగా చేసుకుని మోసానికి పాల్పడ్డారని డీసీపీ నరసింహ వివరించారు. ప్లాన్‌లో భాగంగా ఈ ముఠాలోని కొందరు హైదరాబాద్‌లో, మరికొందరు రాజస్థాన్‌లో ఉంటారు. ఇక్కడున్నవారు బజాజ్ ఎలక్ట్రానిక్స్ దుకాణానికి వెళ్లి ఖరీదైన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. వాటికి డబ్బు చెల్లించాల్సిన సమయంలో.. అక్కడున్న క్యూఆర్ కోడ్‌ను ఫొటో తీసి రాజస్థాన్‌లోని తమ ముఠా సభ్యులకు పంపుతారు. వారు ఆ కోడ్ ద్వారా చెల్లింపులు జరుపుతారు. డబ్బు తమ ఖాతాలోకి రాగానే దుకాణదారులు ఆయా వస్తువులను ముఠాసభ్యులకు అప్పగిస్తారు. వారు వెంటనే ఆ వస్తువులను బయట అమ్మేసి డబ్బును పంచేసుకుంటారు. అక్కడ రాజస్థాన్‌లో ఉన్నవారు.. బ్యాంకును సంప్రదించి, ఒకరికి చెల్లించాల్సిన సొమ్మును వేరొకరికి చెల్లించామనో లేదా సైబర్ మోసానికి బలయ్యామనో చెప్పి.. తమ డబ్బును తిరిగి తమ ఖాతాలో జమ చేయాలని విజ్ఞప్తి చేస్తారు. బ్యాంకులు విచారణ జరిపి.. కొనుగోలు చేసిన వారి వివరాలు, చెల్లింపు చేసిన వారి వివరాలు వేరుగా ఉండడంతో ఆ డబ్బును తిరిగి జమ చేసేస్తున్నాయి. ఇలా ఇప్పటిదాకా ఈ ముఠా.. కేపీహెచ్‌బీ, మాదాపూర్, నార్సింగ్, ఆర్‌జీఐఏ, మధురానగర్, జడ్చర్ల తదితర ప్రాంతాల్లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లలో మోసాలకు పాల్పడింది. దీనిపై వరుసగా ఫిర్యాదులు రావడంతో సీపీ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు శంషాబాద్ సీసీఎస్, మాదాపూర్, కేపీహెచ్‌బీ, నార్సింగ్ పోలీసులు రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలు, సీసీ ఫుటేజ్ ఆధారంగా.. రాజస్థాన్‌కు చెందిన సోమరాజ్, సునీల్, లక్‌రామ్, షర్వాన్, సోమరాజ్, శివలాల్, రమేష్, శర్వాన్, పప్పురామ్, శ్రావణ్, రాకేష్, రమేష్, అశోక్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 50 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ సామాగ్రి, రూ.1.72 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన 13 మందీ కేవలం పాత్రధారులని.. ఈ ముఠాలో ఇంకా చాలామంది సభ్యులు ఉన్నారని, వారిని కూడా అరెస్ట్ చేస్తామని డీసీపీ తెలిపారు. మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠా ఒక పథకం ప్రకారం శుక్రవారం కొనుగోళ్లు చేసి, శనివారం చార్జ్‌బ్యాక్ రిక్వెస్ట్ పెడుతోందని.. విచారణ చేసిన బ్యాంకు అధికారులు కొనుగోలుదారుడి వివరాలు వేరు, చెల్లింపు చేసిన వారు వేరు కావడంతో పొరపాటు జరిగినట్టుగా భావించి సోమ, మంగళ వారాల్లో డబ్బులు తిరిగి ఖాతాలోకి జమచేస్తున్నట్టు తెలిపారు.



అమ్రాబాద్ అభయారణ్యంలో పెద్ద పులులు 34

» 180 దాకా చిరుతలు, 22 రకాల వన్యప్రాణులు, 350 రకాల పక్షులు

మన్ననూర్, సెప్టెంబరు 9: రాష్ట్రంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ అమ్రాబాద్‌లో పెద్ద పులుల సంఖ్య 34కు చేరుకుంది. ఈ విషయాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా అటవీ అధికారి రోహిత్ గోపిడి సోమవారం వెల్లడించారు. ఇవే గాక అక్కడ 22 రకాల వన్యప్రాణులు, 350 రకాల పక్షులు కూడా ఉన్నట్లు తెలిపారు. అమ్రాబాద్ అభయారణ్యంలోని 10 రేంజ్‌లలో 2023 డిసెంబరు 12 నుంచి 2024 మే 2 వరకు 4వ ఫేజ్ మానిటరింగ్‌లో భాగంగా 1806 సీసీ కెమెరాలను 4 బ్లాకుల్లో బిగించారు. అచ్చంపేట, కొల్లాపూర్, లింగాల రేంజ్‌లను మొదటి బ్లాక్‌గా, అమ్రాబాద్, మద్దిమడుగు రేంజ్‌లు రెండవ బ్లాక్‌గా, దోమలపెంట, మన్ననూర్ రేంజ్‌లు మూడో బ్లాక్, దేవరకొండ, కంబాలపల్లి, నాగార్జునసాగర్ రేంజ్‌లు నాలుగో బ్లాక్‌గా విభజించి ట్రాప్ కెమెరాలతో మానిటరింగ్ చేశారు. అలాగే 2 కిలోమీటర్లకు ఇద్దరు అధికారుల చొప్పున శాకాహార జంతువుల సర్వే నిర్వహించారు. వీటన్నింటి ఆధారంగా పెద్దపులులు ఇతర వన్యప్రాణుల సంఖ్యను వెల్లడించారు. ఒక్కో సీసీ కెమెరాలో నాలుగు సార్లు నిక్షిప్తం అయిన చిత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని, వాటి ఆధారంగా పెద్దపులులను లెక్కిస్తారు. పులిపై ఉండే చారల ఆధారంగా ఒక్కోపులిని లెక్కిస్తారు. ఒక పులికి ఉండే చారలు మరో పులికి ఉండే అవకాశం లేదు. మొత్తంగా 34 పెద్దపులులకు గాను ఆడ 15, మగ 11 కాగా 8 పులి పిల్లలు ఉన్నాయని తెలిపారు. 3వ ఫేజ్ మానిటరింగ్‌లో భాగంగా గుర్తించిన 22 పెద్దపులులు ఇక్కడే ఉండగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 4 వచ్చి చేరినట్లు గుర్తించారు. పులి పిల్లలు ఆడ, మగను గుర్తించడం అప్పుడే వీలుపడదని అధికారులు తెలిపారు. మరోవైపు, చిరుత పులుల సంఖ్య 163 నుంచి 183 వరకు ఉంటుందని, చుక్కల దుప్పులు 7020 నుంచి 14085 వరకు, సాంబార్లు 3247 నుంచి 5309 వరకు, మనుబోతులు 1733 నుంచి 2347వరకు, కొండగొర్రెలు 285 నుంచి 768 వరకు, అడవి పందులు 3554 నుంచి 8030 వరకు, కొండముచ్చులు 1140 నుంచి 4080 వరకు ఉంటాయని రోహిత్ పేర్కొన్నారు.

పల్లెల్లో అరకొర వైద్యం

» గ్రామాల్లో ఆస్పత్రులు, డాక్టర్లకు కొరత

» వైద్య సిబ్బంది సంఖ్య కూడా అంతంతే

» జనాభాకు తగ్గట్లుగా లేని దవాఖానాలు

» రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్‌లో కేంద్రం వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయని తేలింది. పల్లె ప్రజలకు వైద్యులు పెద్దగా అందుబాటులో లేరని వెల్లడైంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవల వివరాలపై కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ 'హెల్త్ డైనమిక్ ఆఫ్ ఇండియా 2022-23' వార్షిక నివేదికను సోమవారం విడుదల చేసింది. దీనినే రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్‌గా పిలుస్తారు. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) 63 శాతం మంది వైద్యులే పనిచేసున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సీహెచ్‌సీ) 52 శాతమే స్పెషాలిటీ వైద్యులున్నారు. అలాగే జనాభాకు తగినట్లుగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు లేవు.

రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్‌లోని ముఖ్యాంశాలు

- తెలంగాణలో 11,226 గ్రామాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 4,228 సబ్ సెంటర్లు ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 712 ఉన్నాయి. పల్లెల్లో 594 పీహెచ్‌సీలు ఉండగా అందులో 757 మంది డాక్టర్లు, 1,134 మంది నర్సులు పనిచేస్తున్నారు. పట్టణాల్లోని 275 పీహెచ్‌సీల్లో 299 మంది వైద్యులు, 517 మంది నర్సులు సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 29 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 57 ఉన్నాయి. 42 సబ్ డివిజిన్ ఆస్పత్రులు, 6 జిల్లా ఆస్పత్రులు, 9 వైద్య కళాశాలలు ఉన్నాయి.
- గ్రామీణ ప్రాంతాల్లోని 594 పీహెచ్‌సీల్లో 1,188 మంది వైద్యులుండాలి. కానీ 757 మందే ఉన్నారు. 431 ఖాళీలున్నాయి. 29 సీహెచ్‌సీల్లో 116 మంది స్పెషలిస్టు వైద్యులు అవసరం ఉండగా.. 61 పోస్టులనే మంజూరు చేశారు. ఉన్న వాటిలో ప్రస్తుతం 37 మందే పనిచేస్తున్నారు. 79 ఖాళీలున్నాయి. ఒక్కో సీహెచ్‌సీలో ఒక రేడియోగ్రాఫర్ అవసరం ఉండగా.. 18 ఖాళీలున్నాయి. 683 ఫార్మసిస్ట్ శాంక్షన్ పోస్టులకు 523 మందే పనిచేస్తున్నారు. 159 ఖాళీలున్నాయి. ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులు 677 ఉండగా.. 461 మందే పనిచేస్తున్నారు. 216 ఖాళీలున్నాయి. స్టాఫ్‌నర్స్ పోస్టులు 1,739 ఉండగా.. 1,377 మందే సేవలందిస్తున్నారు.
- రాష్ట్రంలో 2022లో 578 పీహెచ్‌సీలుండగా.. 2023 నాటికి అవి 594కు పెరిగాయి. 2022లో 802 మంది డాక్టర్లు ఉండగా.. గతేడాది ఆ సంఖ్య 757కు తగ్గింది. సీహెచ్‌సీల్లో స్పెషలిస్టుల సంఖ్య 98 నుంచి 37కు పడిపోయింది. జాతీయ స్థాయిలో పల్లె పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యుల సంఖ్య 30,640 నుంచి 32,901కు పెరిగింది..
- తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో 2023 నాటికి సుమారు 2.70 కోట్ల మంది ఉంటారని అంచనా. ఆ మేరకు 708 పీహెచ్‌సీలు అవసరం కాగా, 114 కేంద్రాల కొరత ఉంది. 177 సామాజిక ఆరోగ్య కేంద్రాలు అవసరం కాగా, 29 ఉన్నాయి.
- గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో 427 శాంక్షన్ ఏఎన్ఎమ్ పోస్టులుండగా.. 167 మందే పనిచేస్తున్నారు. 1,188 శాంక్షన్ డాక్టర్ పోస్టులకు గాను 757 మందే పనిచేస్తున్నారు. 431 ఖాళీలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ వైద్యులు 871 మంది అవసరం కాగా 659 మందే ఉన్నారు.
- రాష్ట్రంలోని 4,228 సబ్ సెంటర్లలో 2216 మంది ఏఎన్ఎమ్‌లు పనిచేస్తున్నారు. 52 శాతం మేర కొరత ఉంది.
- తెలంగాణలో ప్రతీ 4,705 మందికి ఒక సబ్‌సెంటర్ ఉంది. కేరళలో ఆ సంఖ్య 719గా ఉంది. అలాగే మన రాష్ట్రంలో ప్రతీ 33,488 మందికి ఒక పీహెచ్‌సీ.. ప్రతీ 6,85,931 మందికి ఒక సీహెచ్‌సీ ఉంది. దేశంలోనే అత్యధిక జనాభాకు ఒక సీహెచ్‌సీ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. వాస్తవానికి అతితక్కువ జనాభాకు ఒక సీహెచ్‌సీ ఉన్న రాష్ట్రం కేరళ. అక్కడ ప్రతీ 40,720 మందికి ఒక సీహెచ్‌సీ ఉంది.

టెర్రరిస్టులా ట్రీట్ చేశారు

» పీఎస్ఆర్, కాంతిరాణా, గున్నీపై చర్యలు తీసుకోవాలి: నటి జెత్వానీ



విజయవాడ(ధర్నాచౌక్), సెప్టెంబరు 9: గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు ఉన్నతాధికారులు తన పట్ల నీచంగా ప్రవర్తించారని ముంబై నటి కాదంబరి జెత్వానీ ఆరోపించారు. తనను ఒక టెర్రరిస్టుగా ట్రీట్ చేశారని, తన క్యారెక్టర్‌ను తప్పుగా చూపించే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పట్ల దారుణంగా వ్యవహరించిన పోలీసు అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఒక మహిళ పట్ల దారుణంగా వ్యవహరించడం సరికాదన్నారు. అప్పటి పోలీసులు విద్యాసాగర్‌కు కొమ్ముకాశారని ఆరోపించారు. దుబాయ్‌లో ఉన్న తన సోదరుడిని కూడా ఇబ్బంది పెట్టారని చెప్పారు. తనపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేశారు. విద్యాసాగర్ తనను బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపించారు. అతనిపై 2015 నాటికే 18 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు తనకు న్యాయం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లకు పోలీసులు తన బాధను అర్థం చేసుకున్నారన్నారు. వరదల కారణంగా ప్రస్తుతం పోలీసులు సహాయ కార్యక్రమాలు అందించే పనిలో నిమగ్నమయ్యారన్నారు. తనను వేధించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు మద్దతిచ్చిన మహిళా సంఘాలకు జెత్వానీ కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల జేఏసీ నేతలు మాట్లాడుతూ... జెత్వానీ కేసును న్యాయ విచారణ చేయించాలని, ఆమె పట్ల దారుణంగా ప్రవర్తించిన పోలీసు ఉన్నతాధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 10 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్



ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్

ఫోరెన్సిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏఐఎఫ్ఎస్ఈటీ) 2025' నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు అందిస్తున్న బీఎస్సీ (ఫోరెన్సిక్ సైన్స్), ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ వ్యవధి రెండేళ్లు. ఫోరెన్సిక్ సైన్స్ అధ్యయనంలో మెడికల్ డేటా సైన్స్, ల్యాబొరేటరీ డేటా సైన్స్, ఫీల్డ్ సైన్స్ అనే మూడు విభాగాలు ఉంటాయి.

- **మెడికల్ డేటా సైన్స్:** ఇందులో ఫోరెన్సిక్ పాథాలజీ, సైకియాట్రీ, సైకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఆంటాలజీ అంశాలు ఉంటాయి.
- **ల్యాబొరేటరీ డేటా సైన్స్:** ఇందులో కెమిస్ట్రీ, బయాలజీ, టాక్సికాలజీ, బాలిస్టిక్స్, ఫింగర్‌ప్రింట్స్, సస్పెక్టెడ్ డాక్యుమెంట్స్, మార్క్స్, ఇంప్రెషన్స్ అంశాలు ఉంటాయి.
- **ఫీల్డ్ సైన్స్:** ఇందులో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్; అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, సీక్రెట్ డ్రగ్ ల్యాబొరేటరీలపై విచారణ వంటివి ఉంటాయి.

ప్రోగ్రామ్‌ల వివరాలు: బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో సైంటిఫిక్ అప్లికేషన్స్, బ్లడ్ స్టయిన్స్-సాయిల్-టోన్స్-ఫింగర్ ప్రింట్స్, మొబైల్/ల్యాప్‌టాప్/కంప్యూటర్ డేటా రికవరీ, డీఎన్ఏ ప్రొఫైలింగ్, సివిల్ కేసెస్, ఇల్లీగల్ యాక్టివిటీస్ తదితరాలకు సంబంధించిన సబ్జెక్టులు ఉంటాయి.

- ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్రైమ్ ఇన్వెస్టిగేషన్స్, క్రైమ్ లొకేషన్‌లో దొరికిన వస్తువుల ఆధారంగా అనుమానితుల ఐడెంటిఫికేషన్, ఫోరెన్సిక్ సైన్స్ ప్రిన్సిపల్స్, పోలీసింగ్, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్, ఫోరెన్సిక్ సైన్స్ టెక్నిక్స్, ఫొటోగ్రఫీ టెక్నిక్స్, విభిన్న పరిస్థితుల్లో జరిగిన నేరాలపై విశ్లేషణ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

అర్హత వివరాలు: బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

- ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్/సంబంధిత సబ్జెక్టులు) ఉత్తీర్ణులై ఉండాలి.

ఏఐఎఫ్ఎస్ఈటీ వివరాలు: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ద్వారా హాజరు కావచ్చు. ఈ ఎగ్జామ్‌లో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు. బీఎస్సీ, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన టెస్ట్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. అభ్యర్థులు ఈ ఎగ్జామ్‌ను ఒక్కో ప్రోగ్రామ్‌నకు గరిష్ఠంగా మూడుసార్లు రాయవచ్చు.

ఉద్యోగావకాశాలు: ఈ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసిన అభ్యర్థులకు డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ సర్వీసెస్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఇంటెలిజెన్స్ బ్యూరో, బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్, ఐఎఫ్ఎస్ ఫోరెన్సిక్ స్టాండర్డ్స్ అండ్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్, సెంట్రల్ గవర్నమెంట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, క్రైమ్ బ్రాంచ్‌లు, నార్కోటిక్ డిపార్ట్‌మెంట్, హాస్పిటల్స్, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీస్, లీగల్ సంస్థలు, పోలీస్ డిపార్ట్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ బ్యూరో, బ్యాంక్‌లు, డిఫెన్స్/ఆర్మీ సంస్థల్లో ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్‌లుగా రాణించవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 26
- **ఏఐఎఫ్ఎస్ఈటీ 2025 తేదీ:** అక్టోబరు 27
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** అక్టోబరు 30
- **వెబ్‌సైట్:** aifset.com

ఐఐటీ హెచ్‌లో పీహెచ్‌డీ

సంగారెడ్డి-కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, డైరెక్ట్ విధానాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో విభాగానికి నిర్దేశించిన మేరకు అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. డైరెక్ట్ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ కింద రూ.50,000; చివరి మూడేళ్లు ఎస్ఆర్ఎఫ్ కింద రూ.55,000 అందిస్తారు.

విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్

అర్హత: డైరెక్ట్ పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐఐటీలు/నిట్ సంస్థలు/ఐఐఎస్సీ/ఐసర్ సంస్థల నుంచి కనీసం 9 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీ డిజైన్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ అర్హత తప్పనిసరి కాదు.

- రెగ్యులర్ పీహెచ్‌డీలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎంసీఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 19
- **వెబ్‌సైట్:** www.iith.ac.in/phdadmissions/



6జీ టెక్నాలజీ భారత్ సంసిద్ధత

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొన్ని ఆవిష్కరణలు ప్రపంచ గతినే మార్చివేస్తాయి. అలాంటి ఆవిష్కరణలుగా నిప్పు, చక్రం, ఆవిరి యంత్రాలు, కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి వాటిని పేర్కొనవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాయి. కానీ మరో అయిదారేళ్లలో అందుబాటులోకి రాబోతున్న 6జీ టెక్నాలజీ పనిలో మానవ ప్రమేయాన్ని ఆసాంతం తగ్గించనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీ మానవ-రోబో సమన్వయంతో పనులు చక్కబెట్టడానికి వీలుకల్పిస్తుండగా, రాబోతున్న 6జీ టెక్నాలజీ కృత్రిమ మేధకు మరింత వేగాన్ని అందించి అనేక రంగాల్లో మానవ ప్రమేయాన్ని దాదాపు శూన్యం చేయనుంది. ఉదాహరణకు స్వయంచోదక వాహనాలు(డ్రైవర్‌లెస్ కార్లు)ను చెప్పుకోవచ్చు.

- ఈ అధునాతన 6జీ సాంకేతికతను అందిపుచ్చుకుని అందరికన్నా ముందుగా ప్రపంచ విపణిలో మార్కెట్ అవకాశాలను కొల్లగొట్టడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా రంగంలోకి దిగింది. 2030 నాటికల్లా 6జీ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి గల సాధ్యాసాధ్యాల పరిశీలన, సూచనల నిమిత్తం ఎ.కె.తివారీ అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.
- తదనంతరం '6 మూలస్తంభాల వ్యూహంతో 6జీ విజన్'ను తదుపరి '6జీ మిషన్'ను భారత టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రవేశపెట్టడమే కాక అంతర్జాతీయ పరస్పర సహకారం నిమిత్తం భారత్ 6జీ అలయెన్స్(బీ6జీఏ)ను కూడా ఏర్పాటు చేసింది. ఈవిధమైన కార్యాచరణల నేపథ్యంలో అసలు 6జీ టెక్నాలజీ అంటే ఏమిటి? ప్రస్తుత తరం 5జీ టెక్నాలజీతో పోల్చిన ఏవిధంగా మెరుగైనది? 6జీ సాంకేతికత కోసం జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలేమిటి? అన్న కోణంలో పరిశీలన జరపాల్సి ఉంది.

6జీ అంటే?

- వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీని దాని పరిణామక్రమం ఆధారంగా వివిధ జనరేషన్లుగా విభజించి పేర్కొంటారు. ఈవిధంగా ఇప్పటివరకూ 1 నుంచి 5 తరాలు అందుబాటులోకి రాగా, మరింత అభివృద్ధి చెందిన తరంగా రాబోతున్న తదుపరి తరాన్ని 6వ తరంగా పేర్కొంటున్నారు.

5జీతో పోల్చితే 6జీ ఏవిధంగా మెరుగైనది?

- వేగపరంగా 5జీ ఒక మిల్లీ సెకన్(1000 మైక్రో సెకన్లు)లో 20 గిగాబైట్ల డేటాను అందిస్తుంది. అదే 6జీ 1 మైక్రో సెకన్‌లో వెయ్యి గిగాబైట్ల(ఒక టెరాబైట్) డేటాను అందిస్తుంది. అంటే 6జీ సాంకేతికత వేగంలో 5జీ కన్నా వెయ్యిరెట్లు మెరుగైనది.
- అదేవిధంగా లేటెన్సీ అనగా నెట్‌వర్క్‌లోని ఒక పాయింట్ నుంచి మరో పాయింట్‌కు సమాచారం(డేటా) చేరడానికి పట్టే సమయం(జాప్యం)ను, 5జీతో పోల్చిన 6జీ విపరీతంగా తగ్గిస్తుంది. 5జీలో ఈ లేటెన్సీ 5 మిల్లీ సెకన్లు కాగా, 6జీతో 'అల్ట్రా లో లేటెన్సీ(అతి తక్కువ జాప్యం)' సాధ్యపడి ఒక మైక్రో సెకనుకు ఈ జాప్యం పరిమితం అవుతుందని అంచనా. ఇంతవరకూ ఉపయోగించని 'టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాల'ను 6జీ సాంకేతికతలో వినియోగించనుండటంతో అల్ట్రాలో లేటెన్సీ సాధ్యం కానుంది. టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలు విద్యుదయస్కాంత వర్ణ పటంలో పరారుణ తరంగాలు, మైక్రోవేవ్ తరంగాల మధ్య ఉంటాయి. చాలా సూక్ష్మంగానూ, సున్నితంగానూ ఉండే ఈ తరంగాలు భారీస్థాయిలో డేటాను వేగంగా చేరవేయగలవు.
- 5జీ సాంకేతికత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'ను ప్రవేశపెట్టడానికి సహకరించి, మానవుల నుంచి యంత్రానికి కమ్యూనికేషన్‌ను సాధ్యం చేసింది. ఈ పునాదిపై మరింత విస్తృతీకరించిన 6జీ సాంకేతికత మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్‌ను(యంత్రాల మధ్య సమాచార బదిలీ) సాధ్యపరిచింది. ఇది చాలా వేగంగా జరిగే కమ్యూనికేషన్ కావడంతో మానవ మెదళ్లు గ్రహించగలవు.

6జీ టెక్నాలజీ ద్వారా రానున్న మార్పులు

1. కమ్యూనికేషన్ల పరంగా: నెట్‌వర్క్ సైక్లింగ్ ప్రక్రియ ద్వారా విస్తృత నెట్‌వర్క్‌లను అతి చిన్న ప్రత్యేక నెట్‌వర్క్‌లుగా విభజించడం వల్ల వివిధ రకాల సమాచార రద్దీని ప్రాధాన్యతల ఆధారంగా విభజించి నిర్వహించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా సమాచార ప్రసారంలో విస్తృతస్థాయిలో భద్రత లభిస్తుంది. ఎన్‌క్రిప్షన్, హోలో గ్రాఫిక్ కమ్యూనికేషన్, మెరుగైన కృత్రిమమేధ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీల ద్వారా మరింత భద్రతతో పాటు స్పష్టత, నిజ సమయ సమాచార బదిలీ(రియల్ టైమ్ డేటా ట్రాన్స్‌ఫర్) సాధ్యమవుతాయి. మరింత వేగంగా ఫైల్ డౌన్ లోడింగ్, వెబ్‌సెర్చ్, వర్చువల్ రియాలిటీ, సమాచార మార్పిడి సాధ్యమవుతాయి.

2. రవాణారంగం: వేగం, లేటెన్సీల పరంగా, మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, త్రీడీ సాంకేతికతలతో ఈ 6జీ టెక్నాలజీ తీసుకువచ్చే మార్పుల కారణంగా స్వయంచోదిత వాహనాలు (డ్రైవర్ లెస్ కార్లు), ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ; బుల్లెట్ ట్రైన్స్ వంటి రవాణారంగ అంశాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

3. స్మార్ట్ సిటీస్, గ్లోబల్ కనెక్టివిటీ: రియల్ టైమ్ మానిటరింగ్, గ్లోబల్ కనెక్టివిటీ(ప్రజలు, పరికరాలు, సిస్టమ్స్, వివిధ సంస్థల మధ్య నిరంతర అనుసంధానత) వల్ల ట్రాఫిక్ నుంచి, ఫ్రిజ్‌లో సరుకుల వరకూ అన్నిటి సమాచారం అప్రయత్నంగా బదిలీ అయిపోతున్నాయి. అనుసంధానతలు పెరగడం వల్ల పట్టణ-గ్రామ అంతరాలు తొలగిపోతాయి.

4. విద్య, పరిశోధన రంగాలు: విద్యార్థులకు విద్యారంగంలో ప్రపంచ వ్యాప్త అనుసంధానత ఏర్పడుతుంది. వర్చువల్ క్లాసెస్, టీచర్స్, క్లాస్‌మేట్స్‌తోపాటు సమాచార విశ్లేషణ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్(అనుభవ పూర్వక అధ్యయనం) సాధ్యమవుతాయి. అదేవిధంగా అన్ని రంగాల్లో సంక్లిష్ట అంశాలపరంగా కూడా పరిశోధనకు అవకాశం ఏర్పడుతుంది. పరిశోధనల్లో వేగం సాధ్యమవుతుంది.

5. ఆరోగ్యరంగం: టెలీ మెడిసిన్, కృత్రిమమేధ మద్దతుతో క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా రోబోటిక్ పద్ధతిలో నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వేగం, వైద్యులతో అనుసంధానత మొదలైన సౌలభ్యాలు కలుగనున్నాయి.

6. వ్యవసాయ, వ్యాపార, ఆర్థిక రంగాలు: వ్యవసాయ, వ్యాపార రంగాల్లో డిమాండ్ - సప్లయ్ -ఉత్పత్తి నియంత్రణపరంగా తక్షణ సమాచార బదిలీ విస్తృతస్థాయిలో వివిధ వ్యవస్థల మధ్య జరిగి మార్కెట్లు విస్తరిస్తాయి. నష్టభయం తగ్గుతుంది. వేగవంతమైన కృత్రిమ మేధతో నిర్ణయాలు, విశ్లేషణ, ఆచరణపరమైన జాప్యాన్ని నివారించవచ్చు. ఇవి సమిష్టిగా ఆర్థికవ్యవస్థ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

7. అంతరిక్ష రంగం, రక్షణ రంగం, విపత్తు నిర్వహణ: అంతరిక్ష ప్రయోగాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోల్ ద్వారా వాహక నౌకలు, రోబోలు వంటి వాటిని తక్షణం నియంత్రిస్తూ వైఫల్యాలను తగ్గించవచ్చు. అత్యధిక రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలు ఖగోళ పరిస్థితుల, పదార్థాల విస్పష్ట అంచనాకు సహకరిస్తాయి. అదేవిధంగా సుదూర ఖగోళ అన్వేషణ సాధ్యమై దూరాన ఉన్న నక్షత్రాలు, గ్రహాల సమాచారం లభ్యమవుతుంది. మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్, వేగం వల్ల వివిధ రకాల భౌగోళిక పరిస్థితుల్లో, సరిహద్దుల్లో, యుద్ధ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ప్రయోజనకరం.

8. పర్యావరణం: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వల్ల ప్రయాణ అవసరాలు తగ్గి కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గుతుంది. అదేవిధంగా స్మార్ట్ సిటీస్, స్మార్ట్ మీటర్స్ వంటి వాటివల్ల విద్యుత్, నీరు వృథా తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో..)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

బాలికల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2024'కి దరఖాస్తులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెంది, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 1,500 అర్హులైన బాలికలకు ఏటా రూ.24,000 స్కాలర్‌షిప్‌ని 'విప్రో కన్జూమర్ కేర్ అండ్ విప్రో కేర్స్ అందజేస్తుంది'. అభ్యర్థులు పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తప్పనిసరిగా ఫుల్ టైం గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 25లోపు www.santoorscholarships.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని పూర్తి వివరాలకు 7411654395/7411654394 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

ఎస్‌బీఐఎఫ్ ఆశా స్కాలర్‌షిప్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్(ఎస్‌బీఐఎఫ్)- ఆశా స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2024ను ప్రకటించింది. పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తూ వారు ఉన్నత విద్యలు అభ్యసించేలా ప్రోత్సహించేందుకు దీనిని ఉద్దేశించారు. ఇది పన్‌టైమ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. ఆరోతరగతి నుంచి పీజీ వరకు చదివే అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. గత విద్యా సంవత్సరంలో కనీసం 75 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. స్కాలర్‌షిప్‌ల సంఖ్యలో సగాన్ని మహిళలకు/విద్యార్థినులకు కేటాయించారు.



పాఠశాల విద్యార్థులకు

- ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరోతరగతి నుంచి పన్నెండోతరగతి చదువుతూ ఉండాలి. కుటుంబ వార్షికాదాయం మూడు లక్షలు మించకూడదు.
- ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు.

డిగ్రీ అభ్యర్థులకు

- ఐఐటీలు/నిట్ సంస్థలు/ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ఉన్న కళాశాలల్లో డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం ఆరు లక్షలకు మించకూడదు. మూడు లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.
- నిట్ సంస్థలు, ఎన్ఐఆర్ఎఫ్ కళాశాలల్లో చదివేవారికి రూ.50,000ల స్కాలర్‌షిప్; ఐఐటీల్లో చదివేవారికి రూ.2,00,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు.

పీజీ అభ్యర్థులకు

- ఐఐఎం సంస్థలు/నిట్ సంస్థలు/ఎన్ఐఆర్ఎఫ్ కళాశాలల్లో పీజీ చేస్తూ ఉండాలి. కుటుంబ వార్షికాదాయం ఆరు లక్షలకు మించకూడదు. మూడు లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.
- నిట్ సంస్థలు, ఎన్ఐఆర్ఎఫ్ కళాశాలల్లో చదివేవారికి రూ.70,000ల స్కాలర్‌షిప్; ఐఐఎం సంస్థల్లో ఎంబీఏ/పీజీడీఎం చదివేవారికి రూ.7,50,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు వారి బ్యాంక్ ఖాతాల్లో స్కాలర్‌షిప్ మొత్తాన్ని నేరుగా జమ చేస్తారు.


- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 1
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** గత విద్యా సంవత్సరానికి సంబంధించిన మార్కుల పత్రాలు; ఆధార్ కార్డ్; అడ్మిషన్ లెటర్, ఐడీ కార్డ్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఫీజు రిసీట్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.sbifashascholarship.org

ఎద్దు పాలు

ఒక రోజు అక్బర్ చక్రవర్తికి సరదాగా బీర్బల్ ను పరీక్షించాలి అనిపించింది, వెంటనే బీర్బల్‌ను పిలిపించి, నాకు చాలా తలనొప్పిగా ఉంది. వైద్యుని పిలిచి చూపిస్తే, దీనికి మందు తయారు చేయాలంటే ఎద్దు పాలు కావాలి అన్నాడు. నువ్వు వెళ్లి ఆ పాలు తెప్పించే పని చూడు లేకపోతే పరిణామాలు దారుణంగా ఉంటాయిఅని చెప్పాడు బీర్బల్ అది విని, మారు మాట్లాడకుండా అలాగే మహారాజా అని వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చి, ఆందోళనగా ఉన్న బీర్బల్‌ను అతని భార్య విషయం ఏమిటని ఎందుకు ఆందోళనగా ఉన్నారని అడిగింది, మహారాజు పురమాయించిన పని సంగతి చెప్పాడు బీర్బల్. దీనికేనా ఇంత కంగారు? అని నవ్వేసింది బీర్బల్ భార్య. నేనో ఉపాయం చెబుతాను మీరు నేను చెప్పినట్టు చేస్తే, ఈ గండం గట్టెక్కవచ్చు అన్నది ఆమె .సరేనని ప్రశాంతంగా నిద్రపోయి, రెండు రోజుల తర్వాత అక్బరు కొలువుకు వెళ్లాడు బీర్బల్. ఏమైంది ఎద్దుపాల సంగతి? అని అడిగాడు అక్బరు. దానికి బీర్బల్ మహారాజా ఎద్దుపాల జాడ కనుక్కున్నాను. కానీ ఆ పాలు అమ్మే అతనికి నిన్న మగ పిల్లాడు పుట్టడం వల్ల ఆరోగ్యం బాగా లేదు. అతని ఆరోగ్యం బాగు పడగానే మీకు ఎద్దుపాలు తెచ్చి ఇవ్వగలడుఅని చెప్పాడు అది విన్న అక్బరు 'మగ వాడికి పిల్లలు పుట్టడం ఏమిటయ్యా బీర్బల్?నీ చమత్కారం కాకపోతే? అన్నాడు దానికి బీర్బల్ నవ్వి, 'మరి ఎద్దు పాలు ఇవ్వడం ఏమిటి మహారాజా మీ చమత్కారం కాకపోతే?' అన్నాడు, తన సవాలును తనకే తిప్పికొట్టిన బీర్బల్ తెలివిని మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు అక్బరు చక్రవర్తి.



7 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 405

	7		1		
		3		7	4
8		6	5	2	
7		5			
1					

సుడోకు - 404 సమాధానం

8	4	5	7	3	6
7	2	6	8	1	9
3	1	9	5	4	2
9	5	2	1	6	3
4	7	8	2	9	5
6	3	1	4	8	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.